## 'ఇస్టా'తో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన తెలంగాణ: నిరంజన్‌రెడ్డి



పార్థసారథి, కేశవులను అభినందిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో నిర్వహించిన అంతర్జాతీయ విత్తన సదస్సు (ఇస్టా) విజయవంతం కావడంలో అందరి కృషి ఉందని, ఆసియాలో తొలిసారి నిర్వహించిన ఇస్టా సదస్సును తెలంగాణలో నిర్వహించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించగలిగామని వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంత్రి ఛాంబర్‌లో బుధవారం వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, ఇస్టా ఉపాధ్యక్షుడు, తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు మర్యాదపూర్వకంగా నిరంజన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సదస్సు విజయవంతానికి కృషిచేసిన వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథికి అభినందనలు తెలిపారు. ఇస్టా స్టాండింగ్ కమిటీలో ఉపాధ్యక్షుడిగా చోటు దక్కించుకున్న కేశవులును ఆయన సన్మానించారు.

## అమిత్ షాతో డిన్నర్ మీటింగ్!

### బీజేపీలో చేరిన, చేరబోయే వారితో 6న ఏర్పాటు

**సాక్షి, హైదరాబాద్:** వివిధ పార్టీల నుంచి బీజేపీలో ఇప్పటికే చేరిన, కొత్తగా చేరబోయే నేతలకు పార్టీ చీఫ్ అమిత్‌షాతో 6న డిన్నర్ మీటింగ్ నిర్వహించాలని రాష్ట్ర పార్టీ భావిస్తోంది. తద్వారా పార్టీలో చేరే వారిలో మరింత ఉత్సాహం నింపాలనుకుంటోంది. గత ఎన్నికల సమయంలో టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీల నుంచి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు ఇతర ముఖ్య నేతలు బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. మరోవైపు కాంగ్రెస్ ముఖ్య నేతలతోపాటు టీఆర్ఎస్ జిల్లా స్థాయి నేతలను బీజేపీలోకి తీసుకొచ్చేందుకు పార్టీ నాయకత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే పలు దఫాలుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నేతృత్వంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ మాజీ మంత్రి డీకే అరుణ నివాసంలో కాంగ్రెస్ నేతలతో చర్చలు జరిపారు. ఇక పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 6న అమిత్ షానే స్వయంగా రాష్ట్రానికి వస్తుండటం చూస్తే బీజేపీ జాతీయ నాయకత్వం ఇక్కడ పార్టీ విస్తరణకు ఎంత ప్రాధాన్యమిస్తుందో అర్థం చేసుకోవచ్చు.

## బీజేపీది గోబెల్స్ ప్రచారం: మల్లురవి



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఇతర పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీలోకి వస్తున్నారంటూ బీజేపీ గోబెల్స్ ప్రచారానికి పాల్పడుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి విమర్శించారు. బీజేపీలో నాయకులే లేరా... కాంగ్రెస్ పార్టీ నేతలే దిక్కా అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని, ఇతర పార్టీల నుంచి వచ్చే వలసలపైనే ఆ పార్టీ నేతలు దృష్టి పెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాలు అమలయ్యేలా అధికార పార్టీపై ఒత్తిడి చేయకుండా పార్టీ మారి తమతో చేరాలని ఇతర పార్టీల నేతలపై ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీది వాపే కానీ బలుపు కాదని, టీఆర్ఎస్‌కు కాంగ్రెస్ మాత్రమే ప్రత్యామ్నాయమని ఆయన స్పష్టం చేశారు.

## 'రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేయాలి'

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష్యానికి మించి టీఆర్ఎస్ సభ్యత్వాలు నమోదు చేయించాలని టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు పిలుపునిచ్చారు. గజ్వేల్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న బాలమల్లు ఆయా నియోజకవర్గాలకు చెందిన పలువురు కీలక నేతలను హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్‌కి చెందిన పార్టీ సీనియర్ నేత, ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లక్ష్మీకాంతరావుకు పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొని ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని బాలమల్లు కోరారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల మూసివేత ఆపాలి

### టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం డిమాండ్



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ విద్యాసంస్థల మూసివేత ఆపాలని, అందులో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆపకపోతే త్వరలో డీఈఓ, కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నిజ్జన రమేష్ ముదిరాజ్ అధ్యక్షతన బుధవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కోదండరాం మాట్లాడుతూ.. టీఆర్ఎస్ భవనాల నిర్మాణం, సచివాలయం కూల్చివేతలు ఎందుకని ప్రశ్నించారు. వాటి కోసం కేటాయించిన నిధులను విద్య మీద పెడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. గురుకుల విద్యాసంస్థలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

## అంకితభావంతో పనిచేయాలి

### కొత్త పరిషత్ సభ్యులకు మంత్రి ఎర్రబెల్లి శుభాకాంక్షలు..



**సాక్షి, హైదరాబాద్:** బంగారు తెలంగాణ లక్ష్య సాధన దిశగా ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం (4వ తేదీన) మండల ప్రజాపరిషత్ (ఎంపీపీ) అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు, శుక్రవారం (5న)జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, జెడ్పీటీసీ సభ్యులు పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రజా ప్రతినిధులకు ఆయన లేఖ రూపంలో ఒక సందేశాన్ని పంపించారు.

## దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు

### బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్



**హైదరాబాద్:** దివ్యాంగులకు అసెంబ్లీ, పార్లమెంట్‌లో 5% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ వికలాంగుల సంఘాల ఐక్య వేదిక ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. సమాజాన్ని ప్రక్షాళన చేసే సత్తా దివ్యాంగుల్లో ఉందని, వారికి అవకాశం ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నా రు. 2016లో కేంద్రం తీసుకువచ్చిన డిజేబుల్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు దివ్యాంగులకు ఇవ్వడం లేదని అందులో క్లర్క్, అటెండర్ లాంటి పోస్టులు ఇవ్వాలన్నారు. దివ్యాంగులకు భృతిని రూ.6 వేలకు పెంచాలని కోరారు.

## 'పోడు సాగు దారులకు రక్షణ కల్పించాలి'

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం సార్సాల గ్రామంతోపాటు రాష్ట్రంలోని పోడు సాగు దారులకు రక్షణ కల్పించాలని వివిధ వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఆసిఫాబాద్ జిల్లా సార్సాలకు వెళుతుండగా అరెస్ట్ చేసిన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని కోరాయి. పోడు సాగుదారుల రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించాయి. పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్న సీఎం కేసీఆర్ వామపక్షాల నాయకులను అరెస్ట్ చేయడం సరైంది కాదని పేర్కొన్నాయి.

# హైదరాబాద్‌లో ఫారిన్ పోస్టాఫీస్

**హుమాయూన్‌నగర్ తపాలా కార్యాలయంలో ఏర్పాటు**

- వచ్చేనెల ఒకటి నుంచి పూర్తిస్థాయి సేవలు
- ఇక్కడే విదేశీ పార్శిళ్లకు కస్టమ్స్ తనిఖీ
- ముంబైకి వెళ్లాల్సిన అవసరం లేదు
- తద్వారా భారీ జాప్యానికి చెల్లు
- ఎగుమతులు భారీగా పెరిగే అవకాశం



**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన విశ్వాస్ తయారీ రంగంలో వ్యాపారం ప్రారంభించాడు. మందులు, బలవర్ధకమైన పదార్థాల తయారీకి సంబంధించి చిన్న పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నాడు. పోస్టాఫీస్‌ల ద్వారా పార్శిళ్లను ఎగుమతి చేస్తున్నాడు. అలాగే కొన్ని ముడి సరుకులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటాడు. పార్శిళ్ల రూపంలో జరిగే దిగుమతి ఎగుమతుల్లో పెద్ద చికాకు ఎదురైంది. హైదరాబాద్‌లో తపాలా శాఖకు సంబంధించి ఫారిన్ పోస్టాఫీస్ లేకపోవటంతో కస్టమ్స్ ఎగ్జామినేషన్ కోసం పార్శిళ్లను ముంబై పంపుతున్నాడు. కొన్ని పార్శిళ్ల క్లియరెన్సుకు పక్షం రోజుల నుంచి నెలకు పైబడి సమయం పడుతోంది. అలాగే కస్టమ్ డ్యూటీ ఎంత చెల్లించాలో ముందు తెలియక అప్పటికప్పుడు ముంబై పరుగెత్తాల్సి వస్తోంది.

ఇది కేవలం విశ్వాస్ ఒక్కడి సమస్యే కాదు. చివరకు ఇతర దేశాల్లో ఉండే బంధువులకు పంపే పార్శిళ్లలో కూడా ఇదే సమస్య ఏర్పడుతోంది. కోటి జనాభాతో దేశంలోనే ఓ ప్రధాన నగరంగా భాసిల్లుతున్న హైదరాబాద్‌కు ఇంతకాలం ఇదో సమస్య. ఈ సమస్య పరిష్కరించాలంటూ ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌కు స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. నగరంలో ఫారిన్ పోస్టాఫీస్ ఏర్పాటు చేసింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇది పూర్తిస్థాయిలో పని ప్రారంభించనుంది.

**విదేశాలకు నిత్యం వేలల్లో పార్శిళ్లు..**

నగరం నుంచి నిత్యం వేల సంఖ్యలో విదేశాలకు పార్శిళ్లు ఎగుమతవుతుంటాయి. అంతకంటే ఎక్కువ సంఖ్యలో విదేశాల నుంచి దిగుమతి అవుతుంటాయి. దేశాల మధ్య సరఫరా అయ్యే ఈ పార్శిళ్లన్నింటిని కచ్చితంగా కస్టమ్స్ ఎక్సైజ్ విభాగం తనిఖీ చేయాల్సి ఉంటుంది. వాటిల్లో నిషేధిత వస్తువులు, సరుకులు ఎగుమతి, దిగుమతి కాకుండా నిరోధించటంలో భాగంగా ఈ తనిఖీ తప్పనిసరి. పార్శిళ్లను బుక్ చేసే వారు వాటిల్లో ఉన్న వస్తువుల వివరాలు పేర్కొంటూ డిక్లరేషన్ ఇస్తారు. డిక్లరేషన్‌లో పేర్కొన్న వస్తువులే అందులో ఉన్నాయో లేదో తెలుసుకోవాలంటే కచ్చితంగా యంత్రాలతో స్కాన్ చేయాల్సిందే. నిబంధనల ప్రకారమే దిగుమతి, ఎగుమతి ప్రక్రియ సాగుతోందని స్పష్టమైన తర్వాతే వాటిని తరలించేందుకు కస్టమ్స్ సెంట్రల్ ఎక్సైజ్ విభాగం అధికారులు పచ్చజెండా ఊపుతారు. అవసరమైతే కస్టమ్ డ్యూటీ కట్టించుకుంటారు. కానీ హైదరాబాద్‌లో ఇప్పటివరకు ఫారిన్ పోస్టాఫీస్ లేకపోవటంతో స్థానికంగా ఈ ప్రక్రియకు వీల్లేకుండా పోయింది.

**ఎగుమతులకు ప్రోత్సాహం..**

నగరం ఇప్పుడు ఎన్నో ఉత్పత్తులకు హబ్‌గా మారుతోంది. శివారు ప్రాంతాల్లో తయారీ రంగం విస్తరిస్తోంది. ఫార్మాతో పాటు చాలా వస్తువులు ఇక్కడ ఉత్పత్తవుతున్నాయి. వీటిల్లో తక్కువ పెట్టుబడితో చిన్న స్థాయి తయారీ యూనిట్లు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఈ ఉత్పత్తుల్లో చాలా వరకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పెద్దపెద్ద యూనిట్లు షిప్పింగ్ ద్వారా ఎగుమతి చేస్తుండగా.. చిన్నచిన్న తయారీ యూనిట్లు మాత్రం తపాలా ద్వారా పార్శిళ్ల రూపంలో పంపుతోంది. ఇంతకాలం ఫారిన్ పోస్టాఫీసు లేకపోవటంతో ఎగుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతూ వారంతా ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ఇక్కడే ఫారిన్ పోస్టాఫీసు ఏర్పాటు అవటంతో జాప్యం బాగా తగ్గి ఎగుమతులు భారీగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. నగరం నుంచి నిత్యం వేల సంఖ్యలో పార్శిళ్లు ఎగుమతవుతున్నాయి. ఆ సంఖ్య బాగా పెరిగి ఎగుమతులకు ప్రోత్సాహం లభించినట్లవుతుంది. వ్యక్తిగత పార్శిళ్ల విషయంలోనూ సమస్య పరిష్కారం కానుంది.

**ఇప్పటివరకు ఆ నాలుగు చోట్లే..**

దేశంలో ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతాల్లో మాత్రమే ఇవి అందుబాటులో ఉన్నాయి. వాటికి కొన్ని చొప్పున దేశాలను కేటాయించారు. ఆయా దేశాలకు ఎగుమతి కావాల్సిన, దిగుమతి కావాల్సిన పార్శిళ్లు ఆయా నగరాల్లోని ఫారిన్ పోస్టాఫీసులకు వెళ్లాల్సి ఉంటుంది. హైదరాబాద్ నుంచి అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలకు ఎక్కువ పార్శిళ్లు ఎగుమతి అవుతాయి. ఇవి ముంబైకి వెళ్లాల్సి ఉంటుంది. ముంబైలో లక్షల సంఖ్యలో పార్శిళ్లు పేరుకుపోతుండటంతో రోజుల తరబడి, ఒక్కోసారి నెలల తరబడి జాప్యం జరుగుతోంది. ఈలోపు కొన్ని సరుకులు పాడైపోతున్నాయి. ఇది పెద్ద సమస్యగా పరిణమించింది.

**ఎట్టకేలకు రాజధానిలో..**

ఈ సమస్యను గుర్తించిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) దేశవ్యాప్తంగా అదనంగా ఫారిన్ పోస్టాఫీసులను ఏర్పాటు చేయాలంటూ 2016లో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో హైదరాబాద్‌ను కూడా చేర్చింది. కానీ దాని ఏర్పాటులో జాప్యం జరుగుతూ వచ్చింది. ఎట్టకేలకు తపాలా శాఖ సెంట్రల్ ఎక్సైజ్ విభాగంతో కలసి ఇప్పుడు ఫారిన్ పోస్టాఫీస్‌ను ఏర్పాటు చేసింది. నగరంలోని హుమాయూన్‌నగర్ తపాలా కార్యాలయంలో ఇందుకు కొంత స్థలాన్ని కేటాయించారు. ఇక్కడే సెంట్రల్ ఎక్సైజ్ విభాగం ప్రత్యేకంగా స్కానర్లను ఏర్పాటు చేసింది. ఇక నుంచి విదేశాలకు ఎగుమతయ్యే, విదేశాల నుంచి దిగుమతయ్యే పార్శిళ్లను ఇక్కడే తనిఖీ చేస్తారు. అవసరమైన వాటికి కస్టమ్ డ్యూటీ కట్టించుకుని డెలివరీకి వీలుగా తపాలా సిబ్బందికి అందిస్తారు.

## ఏ రాష్ట్ర ఉద్యోగులు ఆ రాష్ట్రంలోనే..

- ఏపీ ఉద్యోగులను తెలంగాణకు తెస్తామంటే ఊరుకోం
- ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసిన విద్యుత్ ఉద్యోగ సంఘాలు

**సాక్షి, హైదరాబాద్:** స్థానికత ప్రతిపాదికన ఏ రాష్ట్ర ఉద్యోగులను ఆ రాష్ట్రంలోనే కొనసాగించాలని, ఒకవేళ కాదని ఆంధ్రా ఉద్యోగులను తెలంగాణ విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని చూస్తే మలిదశ తెలంగాణ పోరాటానికి కూడా వెనుకాడబోమని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, తెలంగాణ విద్యుత్ ఎకౌంట్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లు హెచ్చరించాయి. ఇరు రాష్ట్రాలకు చెందిన సీఎంలు ఈ విషయంపై తుది నిర్ణయానికి రావాలని అల్టిమేటం జారీ చేశాయి. ఈ మేరకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివాజీ, మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ ఎలక్ట్రికల్ ఎకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకుడు అంజయ్య సంయుక్తాధ్వర్యంలో బుధవారం ఎర్రగడ్డ జెన్‌కో ఆడిటోరియంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఇదే అంశంపై తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, కార్యదర్శి సదానందం అధ్యక్షతన ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి, తీర్మానం ప్రతిని జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులను ఆప్షన్ల పేరుతో తెలంగాణ విద్యుత్ సంస్థల్లోకి తెచ్చే కుట్ర జరుగుతోందని, ఏపీ ప్రతిపాదనను తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోరని స్పష్టం చేశారు. ఏపీ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న 229 మంది తెలంగాణ ఉద్యోగులను తెలంగాణ సంస్థల్లో చేర్చుకున్నట్లే.. ఆంధ్ర స్థానికత గల 1157 మంది విద్యుత్ ఉద్యోగులను ఏపీ విద్యుత్ సంస్థల్లో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. తమ అభీష్టానికి విరుద్ధంగా సీఎంలు వ్యవహరిస్తే ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

## సచివాలయ భవనాల కూల్చివేత, తరలింపుపై స్టేకు నో

- మరో 'పిల్'లోనూ ప్రభుత్వానికి నోటీసులు
- విచారణ 8కి వాయిదా వేసిన హైకోర్టు





**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సచివాలయ భవనాల కూల్చివేత నిర్ణయం అమలు కాకుండా స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. సచివాలయాన్ని ఇతర భవనాల్లోకి తరలింపును అడ్డుకోవాలనే అభ్యర్థనను కూడా హైకోర్టు తోసిపుచ్చింది. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదని నిన్ననే సుప్రీంకోర్టు సైతం చెప్పిందని ధర్మాసనం గుర్తు చేసింది. సచివాలయ భవనాల కూల్చివేత, తరలింపులను అడ్డుకోవాలని కోరుతూ ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం బుధవారం విచారించింది. ఇదే తరహాలో గతంలో దాఖలైన వ్యాజ్యాలతో ఈ పిల్‌ను కూడా కలిపి విచారిస్తామని ప్రకటించింది. ఈ నెల 8న జరిగే తదుపరి విచారణలోగా ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రోడ్లు,భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. చట్ట వ్యతిరేకంగా, సంబంధం లేని అధికారి నిర్ణయం తీసుకున్నా, సహజ న్యాయ సూత్రాలకు భంగం వాటిల్లినప్పుడు కచ్చితంగా జోక్యం చేసుకుంటామని, విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకోబోమని తేల్చి చెప్పింది.

స్టే మంజూరు చేయకపోతే ఎన్నో ఏళ్లుగా ఉంటున్న భవనాల్ని ప్రభుత్వం కూల్చివేసే అవకాశముందని పిటిషనర్ తరపు న్యాయవాది సిహెచ్. ప్రభాకర్ తొలుత వాదించారు. ధర్మకర్తగా ఉండాల్సిన పాలకులు ప్రజాధనాన్ని విచక్షణారహితంగా వినియోగించడాన్ని అడ్డుకోవాలన్నారు. బెంగళూరులో మెడికల్ ట్రస్ట్–ముద్దప్ప మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు నిర్మాణాన్ని అడ్డుకుందని గుర్తు చేశారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ.. ఆ కేసులో ఒక పార్కును ప్రైవేట్ మెడికల్ కళాశాలకు ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు అడ్డుకుందని తెలిపింది. విచారణ ఈనెల 8కి వాయిదా పడింది.

## ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

**గాంధీభవన్‌లో కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల కమిటీ భేటీ**



బుధవారం గాంధీ భవన్‌లో భేటీ అయిన పొన్నం ప్రభాకర్, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్లలోని శ్రేణులను ఎన్నికల దిశగా ఇప్పటినుంచే అప్రమత్తం చేయాలని, ఎలక్షన్ నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండేలా కార్యాచరణ రూపొందించాలని ఆ పార్టీ మున్సిపల్ ఎన్నికల కమిటీ నిర్ణయించింది. మున్సిపల్ ఎన్నికలపై చర్చించేందుకుగాను బుధవారం గాంధీభవన్‌లో ప్రత్యేక కమిటీ భేటీ అయింది. ఈ భేటీలో కమిటీ కన్వీనర్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, సభ్యులు సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ భేటీలో మున్సిపల్ ఎన్నికల కోసం ప్రభుత్వం చేస్తున్న కసరత్తుపై చర్చించారు. పార్టీ జిల్లా అధ్యక్షులతో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా త్వరలోనే సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం గాంధీభవన్‌లో విలేకరులతో కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మున్సిపాలిటీలు, వార్డుల విభజన అశాస్త్రీయంగా జరిగిందని ఆరోపించారు. 3,385 వార్డుల్లో అధికార పార్టీ నేతలు జోక్యం చేసుకున్నారని, అధికారులపై ఒత్తిడి తెచ్చి జనాభా ప్రాతిపదికన కాకుండా వారికి అనుగుణంగా వార్డులను రిజర్వ్ చేయించుకుంటున్నారని విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతోనే వార్డుల విభజన చేశారని ఆరోపించిన నేతలు దీనిపై అభ్యంతరాల కోసం మరింత గడువు పెంచాలని కోరారు. స్థానిక నేతలు సమన్వయంతో పనిచేయాలని, ఎట్టి పరిస్థితుల్లో సగానికి పైగా మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు.

## సాగుకు 8-10 గంటలే విద్యుత్

- సాగుకు విద్యుత్ సమయం తగ్గించాలని రాష్ట్రాలను కోరిన కేంద్రం
- భూగర్భ జలాలను పరిరక్షించుకోవాలని సూచన

**సాక్షి, హైదరాబాద్:** భూగర్భ జలాలను పరిరక్షించడంలో భాగంగా వ్యవసాయానికి రోజుకు 8 నుంచి 10 గంటల విద్యుత్‌ను మాత్రమే సరఫరా చేయాలని రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సూచించింది. 'పవర్ ఫర్ ఆల్' పథకం కింద కేంద్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వ్యవసాయం మినహా మిగిలిన అన్ని వర్గాల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. గత ఫిబ్రవరి 26, 27 తేదీల్లో గుర్గావ్‌లో రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులతో నిర్వహించిన సదస్సులో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ మేరకు సూచనలు చేసింది. ఈ సదస్సుకు సంబంధించిన మినిట్స్ కాపీని తాజాగా విడుదల చేసింది. రెండేళ్ల నుంచి రాష్ట్రంలో సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్న తరుణంలో కేంద్రం నుంచి ఇలాంటి సూచనలు రావడం ప్రత్యేకత సంతరించుకుంది. సాగుకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయని, బోర్లు, బావుల్లో నీళ్లు పడటం లేదని, రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో రైతులు సైతం ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ విద్యుత్‌ను 8 నుంచి 10 గంటలకు నియంత్రించాలని కేంద్రం సూచనలు మాత్రమే చేసిందని, ఈ విషయంలో నిర్ణయాధికారం రాష్ట్రాలదేనని రాష్ట్ర ఇంధన శాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు చేసిన సూచనలు..

- విద్యుత్ చౌర్యం కేసుల విచారణ కోసం ప్రత్యేక పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసుకోవాలి
- ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, ఏబీసీ కేబుల్ వినియోగంతో మీటర్ రీడింగ్, బిల్లింగ్, విద్యుత్ బిల్లుల చెల్లింపు, విద్యుత్ చౌర్యం సమస్యలకు పరిష్కారం లభిస్తుంది
- క్రాస్ సబ్సిడీ పేరుతో పరిశ్రమలపై అధిక విద్యుత్ చార్జీలను విధించే రాష్ట్రాలకు కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశం సన్నగిల్లుతుంది. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి
- విద్యుత్ వినియోగం పెరిగే కొద్దీ కర్బన ఉద్గారాలు పెరుగుతాయి. విద్యుత్‌ను ఆదా చేసేందుకు స్టార్ రేటింగ్ విద్యుత్ పరికరాలు, బిల్డింగ్ కోడ్‌ను అమలు పర్చాలి. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశాం. దీనిని అమలు చేసేందుకు రాష్ట్రాలు నోడల్ అధికారులను నియమించుకోవాలి
- సుప్రీం ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ కోసం 2022 నాటికి విద్యుదుత్పత్తి ప్లాంట్లన్నీ నూతన పర్యావరణ మార్గదర్శకాలను అమలుపర్చాలి
- స్మార్ట్ మీటరింగ్, ఏబీసీ కేబుల్స్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం కొత్తగా రెండు పథకాలను ప్రవేశపెట్టింది. రాష్ట్రాల సూచన మేరకు అండర్ గ్రౌండ్ కేబులింగ్‌ను ఏబీసీ కేబులింగ్ కార్యక్రమం పరిధిలోకి తీసుకురానున్నాం


## బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం

### మీట్ ది గ్రీట్‌లో కె.లక్ష్మణ్

**హైదరాబాద్:** తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తన ధ్యేయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం ముషీరాబాద్‌లోని ఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది గ్రీట్ కార్యక్రమంలో లక్ష్మణ్ మాట్లాడారు. 2023 ఎన్నికల్లో బీజేపీ అధికారం చేపట్టేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వచ్చి లక్ష్మణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# వైద్య విద్య కౌన్సెలింగ్‌లో గందరగోళం

- అఖిల భారత కోటా జాబితాను తొలుత రద్దు చేయడంపై అనుమానాలు
- సవరించిన జాబితాను విడుదల చేసిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ
- నీట్ టాప్–20లో 18 మంది మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీలో చేరిక
- ప్రైవేటు కన్వీనర్ కోటాలో ఈడబ్ల్యూఎస్ సీట్లపై స్పష్టతివ్వని కేంద్రం



**సాక్షి, హైదరాబాద్:** అఖిల భారత కోటా సీట్లకు జరుగుతున్న నీట్–2019 కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. మొదటి కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించిన విద్యార్థుల మెరిట్ జాబితాను ఉపసంహరించుకోవడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఎట్టకేలకు సవరించిన జాబితాను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) మంగళవారం రాత్రి విడుదల చేసింది. అయితే ఎందుకు మొదటి జాబితాను రద్దు చేశారన్న దానిపై స్పష్టతివ్వలేదు. దీనిపై తెలంగాణలోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు కూడా ఏమీ చెప్పడం లేదు. విద్యార్థులు సవరించిన జాబితాను అధికారిక వెబ్‌సైట్ mcc.nic.inలో చూడవచ్చు. మొదటి మెరిట్ జాబితా ఉపసంహరించుకోవటానికి గల కారణం ఇప్పటివరకు స్పష్టం చేయకపోవడంపై పలువురు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక కారణాలు ఏర్పడి ఉండొచ్చని కొందరు అంటుంటే, కారణాలు చెప్పకుండా ఎందుకు రద్దు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. బుధవారం నుంచి సవరించిన జాబితాలో పేరున్న అభ్యర్థులు తమ కేటాయింపు లేఖను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**టాప్–20లో 18 మంది అక్కడే..**

నీట్‌లో టాప్–20 ర్యాంకులు సాధించిన వారిలో 18 మంది ఢిల్లీలోని మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీని ఎంచుకున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు వెల్లడించాయి. మహిళల్లో జాతీయ మొదటి ర్యాంకు సాధించిన మాధురీరెడ్డి జాతీయస్థాయిలో ప్రముఖమైన మెడికల్ కాలేజీనే ఎంచుకున్నట్లు విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. ఆమె తెలంగాణలో అసలు దరఖాస్తే చేసుకోలేదని వెల్లడించాయి. అంతే కాదు అఖిల భారత కోటా కింద తెలంగాణలో ఏ కాలేజీని.. ఎవరెవరు ఎంచుకున్నారన్న సమాచారం తమ వద్ద లేదని వారంటున్నారు.

**ఈడబ్ల్యూఎస్ కోటాపై అస్పష్టత..**

రాష్ట్రంలోనూ వైద్య విద్య కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగు తోంది. ఇప్పటికే కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నోటిఫికేషన్లు విడుదలయ్యా యి. కన్వీనర్ కోటా సీట్లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయింది. అయితే ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లకు మాత్రం అగ్రవర్ణ పేదల (ఈడబ్ల్యూఎస్)కు రిజర్వేషన్లను అమలు చేసేందుకు 190 సీట్లను అదనంగా కేంద్రం కేటాయించిన సంగతి తెలిసిం దే. అందులో ఎవరికీ సందేహాలు లేవు. కానీ ప్రైవేటులోని కన్వీనర్ కోటా సీట్లలోనూ ఈడబ్ల్యూఎస్‌ను అమలు చేస్తామని కేంద్రం తెలిపింది. అందుకోసం దరఖాస్తు చేసుకోవాలని కోరింది. ఆ మేరకు గత నెల 28 వరకు గడువు విధించింది. అందుకోసం రాష్ట్రంలోని 10 ప్రైవేటు మెడికల్ కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. కానీ ఇప్పటివరకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) సీట్ల పెంపుపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే కన్వీనర్ కోటా సీట్లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయింది. ప్రైవేటులోని కన్వీనర్ కోటా సీట్లకు మరి ఎప్పుడు ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు కేటాయిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**వస్తాయనే భరోసా.. కానీ..**

ఎంసీఐనే ఈడబ్ల్యూఎస్ కోటాకు దరఖాస్తు చేసుకొమ్మని కోరడంతో తప్పనిసరిగా సీట్లు వస్తాయన్న భరోసా ఉంది. కానీ సకాలంలో సీట్లు కేటాయించకుంటే పరిస్థితి ఏంటనేది కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్న కాళోజీ నారాయణరావు ఆరోగ్య వర్సిటీని, అలాగే అదనపు సీట్ల కోసం ఎదురుచూస్తున్న ఆ 10 ప్రైవేటు మెడికల్ కాలేజీలను వేధిస్తుంది. ఎంసీఐ ఏ విషయంలోనూ స్పష్టతివ్వకుండా తన పని తాను చేసుకుపోతోంది. దీంతో వైద్య విద్య అధికారులు ఏమీ అర్థంగాక తలలు పట్టుకుంటున్నారు.

# ఓటమికి నాదే బాధ్యత

**అందుకే నిష్క్రమిస్తున్నా**

**నాలుగు పేజీల బహిరంగ లేఖలో రాహుల్ గాంధీ వెల్లడి**



**న్యూఢిల్లీ:** ఎట్టకేలకు రాహుల్ గాంధీ తన పంతం నెగ్గించుకున్నారు. వర్కింగ్ కమిటీ వారించినా, పార్టీ శ్రేణులు వద్దని బతిమాలినా వినకుండా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి తనదే బాధ్యత అని అంగీకరించారు. పార్టీ అభివృద్ధికి జవాబుదారీతనం కీలకమని, అందుకోసమే తాను రాజీనామా చేస్తున్నానని 49 ఏళ్ల రాహుల్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన బహిరంగ లేఖ రాశారు. నాలుగు పేజీల ఆ లేఖను ట్విట్టర్‌లో పెట్టారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం 52 స్థానాలు మాత్రమే గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఫలితాలు వెలువడిన రెండు రోజులకు తాను అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్టు రాహుల్ ప్రకటించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆయన రాజీనామాను తిరస్కరించింది. పార్టీ శ్రేణులు రాజీనామా చేయవద్దని కోరాయి. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాహుల్ గాంధీని కలిసి సంఘీభావం ప్రకటించారు. ఎన్నికల ఓటమికి తాము నైతిక బాధ్యత వహిస్తామని చెప్పారు. తాను రాజీనామా చేసినందున కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయడం కోసం ఒక కమిటీని వేయాలని రాహుల్ ఆ లేఖలో పార్టీ వర్కింగ్ కమిటీని కోరారు. కాంగ్రెస్ పార్టీకి సేవ చేయడం తనకు గౌరవప్రదమన్నారు. విలువలు, ఆదర్శాలే జీవనాడులుగా కాంగ్రెస్ పార్టీ ఈ దేశానికి సేవ చేసిందని భావోద్వేగపూరితంగా పేర్కొన్నారు. ఈ దేశానికి, పార్టీకి తాను ఎంతో కృతజ్ఞుడినన్నారు. 'కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, 2019 ఎన్నికల్లో పార్టీ ఓటమికి నాదే బాధ్యత. మన పార్టీ భవిష్యత్తులో పైకి రావాలంటే జవాబుదారీతనం కీలకం. ఈ కారణంగానే నేను అధ్యక్ష పదవికి రాజీనామా చేశా' అని రాహుల్ తెలిపారు. పార్టీ పునర్నిర్మాణానికి కఠిన నిర్ణయాలు అవసరమన్నారు. ఎన్నికల ఓటమికి అనేక మందిని బాధ్యుల్ని చేయాల్సి వస్తుందని, అయితే, పార్టీ అధ్యక్షుడిగా తన బాధ్యతను విస్మరించి ఇతరులను బాధ్యుల్ని చేయడం సరి కాదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తాను ప్రధాని మోదీతోనూ, ఆరెస్సెస్‌తోనూ, వారి గుప్పిట్లో ఉన్న సంస్థలతోనూ శక్తివంచన లేకుండా పోరాడానన్నారు. 'భారత దేశాన్ని నేను ప్రేమిస్తున్నాను. అందుకే వారితో పోరాడా. ఒక్కోసారి ఈ పోరాటంలో నేను పూర్తిగా ఒంటరివాడినయ్యా. అయినా పోరాడినందుకు గర్వపడుతున్నా'అని రాహుల్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ప్రస్తావిస్తూ దేశాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలన్న ఆరెస్సెస్ లక్ష్యం దీంతో పూర్తయిందన్నారు. బీజేపీ అధికారం కైవసం చేసుకోవడం వల్ల దేశంలో ఊహించని స్థాయిలో హింస చెలరేగుతుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు జాతి మొత్తం ఏకం కావాలని, దీనికి కాంగ్రెస్ ఆయుధం అవుతుందని రాహుల్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే లక్ష్యాన్ని సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ తనను తాను పూర్తిగా సంస్కరించుకోవాలి. ప్రస్తుతం బీజేపీ ఒక పద్ధతి ప్రకారం ప్రజల గొంతు నొక్కేస్తోంది. ప్రజావాణిని కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్‌దే. భారత దేశమెప్పుడూ ఒకే గొంతు కాదు..కాబోదు. అది అనేక గొంతుల సమాహారం. అదెప్పటికీ అలాగే ఉండాలి. అదే భారత మాత అసలు స్వరూపం' అని రాహుల్ భావోద్వేగంతో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాల కోసం తాను పోరాడుతూనే ఉంటానని, తన సేవలు అవసరమైనప్పుడు అందుబాటులో ఉంటానని రాహుల్ పార్టీ శ్రేణుల నుద్దేశించి అన్నారు. 'నేను కాంగ్రెస్‌వాదిగా పుట్టాను. కాంగ్రెస్ పార్టీ నా ప్రాణం. అదెప్పటికీ నాతోనే ఉంటుంది' అని ఉద్ఘాటించారు.

> **కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, 2019 ఎన్నికల్లో పార్టీ ఓటమికి నాదే బాధ్యత. మన పార్టీ భవిష్యత్తులో పైకి రావాలంటే జవాబుదారీతనం కీలకం. ఈ కారణంగానే నేను రాజీనామా చేశా**

> **ఎన్నికల్లో మోదీతో, ఆరెస్సెస్‌తో, వారి గుప్పిట్లో ఉన్న సంస్థలతో పోరాడా. ఒక్కోసారి ఈ పోరాటంలో నేను పూర్తిగా ఒంటరివాడినయ్యా. అయినా పోరాడినందుకు గర్వపడుతున్నా**

**ట్విట్టర్‌లో హోదా తొలగింపు**

రాహుల్ గాంధీ తన ట్విట్టర్ ప్రొఫైల్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు అన్న పదాలను తొలగించారు. ప్రస్తుతం ఆయన ట్విటర్ ఖాతాలో 'ఇది రాహుల్ గాంధీ అధికారిక ఖాతా/ఇండియన్ కాంగ్రెస్ సభ్యుడు/ పార్లమెంటు సభ్యుడు' అని మాత్రమే దర్శనమిస్తోంది.

## ఆయనే మా నాయకుడు

అధ్యక్ష పదవికి రాజీనామా చేసినా రాహులే మా నేత అని రాజస్తాన్ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ అన్నారు. పార్టీ కోసం ఆయన ఎంత శ్రమించారో మాకు తెలుసు. అందుకే రాజీనామాను వెనక్కు తీసుకోమని కోరుతున్నాం' అని ఆయన అన్నారు. 'కాంగ్రెస్ సిద్ధాంతాలు నమ్మేవారికి ఆయనే నాయకుడు. రాహుల్ గాంధీ సరైన నిర్ణయం తీసుకున్నారు' అని మరో నేత అజయ్ మాకెన్ అన్నారు.

## కొత్త అధ్యక్షుడిగా ఖర్గే లేదా షిండే!

సుశీల్ కుమార్ షిండే (77) లేదా మల్లికార్జున ఖర్గే(76)ల్లో ఒకరు కొత్త అధ్యక్షుడయ్యే చాన్సుంది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అయిన షిండే గతంలో ఓసారి కేంద్ర మంత్రిగా చేశారు. 2002లో కాంగ్రెస్ తరఫున ఉపాధ్యక్ష పదవికి పోటీపడ్డారు. ఈ ఏడాదే మహారాష్ట్రలో ఎన్నికలు జరగనుండటం, ఆయనకు గాంధీల కుటుంబంతో సాన్నిహిత్యం ఉండటంతో షిండేను తదుపరి అధ్యక్షుడిగా నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. అటు ఖర్గే కూడా పార్టీలో సీనియర్ నాయకుడే. ఆయనా గాంధీల కుటుంబానికి సన్నిహితుడే. గత లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేతగా ఆయన పనిచేశారు. ఖర్గే ప్రతిపక్షంలో ఉండి మోదీని సమర్థవంతంగా ఎదుర్కోగలడనే అభిప్రాయం ఉంది. గతంలో ఆయన ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వాల్లో కేంద్ర మంత్రిగానూ పనిచేశారు. కొత్త అధ్యక్షుడు ఎవరనే దానిపై ఓ వారంలో నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

## ఇదో కొత్త నాటకం

రాహుల్ గాంధీ రాజీనామా మరో కొత్త నాటకమని కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ వ్యాఖ్యానించారు. ఆయన రాజీనామాతో తమకే సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలా కాకుండా తమ పార్టీలో సంస్థాగత వ్యవస్థ పటిష్టంగా ఉందని, సంస్థాగత ఎన్నికలు, సభ్యత్వ నమోదు వంటివి ఉన్నాయని మరో మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు.



# రైతుకు 'మద్దతు' పెంపు

- వరి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.65 మేర పెంపు
- పత్తికి రూ.105, సోయాబీన్‌కు రూ.311 మేర పెంపు
- వాణిజ్య సరోగసిపై నిషేధం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఊరట కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం నాడిక్కడ సమావేశమైన కేంద్ర కేబినెట్.. ఆహార, వాణిజ్య పంటకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ను పెంచింది. 2019–20 కాలానికి వరి పంటపై ఎంఎస్‌పీని రూ.65 మేర పెంచాలని నిర్ణయించింది. తాజా పెంపుతో సాధారణ గ్రేడ్ వరికి అందిస్తున్న ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.1,815కు, 'ఏ' గ్రేడ్ వరికి అందిస్తున్న ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.1,835కు చేరుకోనుంది. కేబినెట్ నిర్ణయాలను వ్యవసాయ మంత్రి నరేంద్ర తోమర్ మీడియాకు వివరించారు. 'రాగి పంటకు అందిస్తున్న ఎంఎస్‌పీని క్వింటాల్‌కు రూ.253 మేర పెంచాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. దీనివల్ల క్వింటాల్ రాగి రూ.3150కు పెరగనుంది. జొన్న పంట క్వింటాల్ ఎంఎస్‌పీని రూ.120 మేర పెంచాలని నిర్ణయించారు. మొక్కజొన్న కనీస మద్దతుధరను క్వింటాల్‌కు రూ.60, సజ్జలు క్వింటాల్‌కు రూ.50 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాం' అని అన్నారు. సోయాబీన్ పంట క్వింటాకు రూ.311, సన్‌ఫ్లవర్‌కు రూ.262, నువ్వులు క్వింటాల్‌కు రూ.236, వేరుశనగ క్వింటాల్‌కు రూ.200, పత్తి పంటకు క్వింటాల్‌కు రూ.105 మేర పెంచామని పేర్కొన్నారు.

**'సరోగసి' బిల్లుకు ఆమోదం..**

అద్దెగర్భం(సరోగసి)ని వాణిజ్యపరంగా వినియోగించుకోవడంపై నిషేధం విధిస్తూ తెచ్చిన సరోగసి(నియంత్రణ) బిల్లు–2019ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. కేవలం సన్నిహిత కుటుంబ సభ్యులు మాత్రమే సరోగసి ప్రక్రియకు అర్హులని బిల్లులో స్పష్టం చేశారు. ఈ బిల్లు ప్రకారం మానవ అండాలను కొనుగోలు చేయడం నిషేధం.


**మూడు ఎయిర్‌పోర్టులు లీజుకు..**

అహ్మదాబాద్(గుజరాత్), లక్నో(ఉత్తరప్రదేశ్), మంగళూరు(కర్ణాటక) విమానాశ్రయాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు లీజుకు ఇవ్వాలన్న ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇప్పటికే ఈ మూడు విమానాశ్రయాలను అదానీ గ్రూపు 50 ఏళ్ల లీజుకు దక్కించుకుంది. . కేంద్ర సాయుధ పోలీస్ బలగాల(సీఏపీఎఫ్) అధికారులకు గ్రూప్–ఏ సర్వీస్ హోదా కల్పించాలన్న డిమాండ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

## వేతనాల కోడ్ బిల్లుకు ఓకే

కేంద్ర కేబినెట్ బుధవారం వేతనాల కోడ్ బిల్లుకు ఆమోదం తెలిపింది. దీనిప్రకారం ప్రస్తుతం కార్మికులు, ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న వేతనాల చెల్లింపు చట్టం–1936, కనీస వేతన చట్టం–1948, బోనస్ చెల్లింపు చట్టం–1965, సమాన వేతన చట్టం–1976లను రద్దుచేసి వేతనాల కోడ్ చట్టాన్ని తీసుకొస్తారు. తాజా బిల్లు చట్టరూపం దాల్చితే కార్మికులు, ఉద్యోగుల కనీస వేతనంపై నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా సులభతర వాణిజ్యంలో భారత్ స్థానం మెరుగై విదేశీ పెట్టుబడుల్ని ఆకర్షించడం వీలవుతుంది. వేతనాల కోడ్ బిల్లును ఈ సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెడతామని కేంద్ర మంత్రి జవదేకర్ చెప్పారు. పార్లమెంటరీ స్థాయీ సంఘం 2018డిసెంబర్‌లో ఈ బిల్లుకు ఆమోదం తెలిపినా, లోక్‌సభ రద్దుతో మరోసారి ఆమోదించామన్నారు. బిల్లు ప్రకారం రైల్వేలు, గనులుసహా కొన్ని విభాగాల్లో అందించే వేతనాలను కేంద్రం ఖరారు చేస్తుంది. మిగిలిన రంగాల్లో వేతనాలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తాయి. ఈ కనీస వేతనాలను ప్రతి ఐదేళ్లకోసారి సమీక్షిస్తామన్నారు.

## కన్నడ పోలీసుల కస్టడీలో వరవరరావు



**పుణే:** ప్రముఖ తెలుగు కవి, ఉద్యమకారుడు వరవరరావును కర్ణాటక పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఎల్గార్ పరిషద్ కేసులో భాగంగా 2005లో జరిగిన తుమ్కూర్ నక్సల్ దాడిలో వరవరరావును నిందితునిగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పుణేలోనే ఉన్నాడని, బెంగళూరు పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. 2005 ఫిబ్రవరి 6న కర్ణాటకలోని చిక్‌మగళూరు జిల్లాలో నక్సల్ నాయకుడు సాకేత్ రాజన్ అలియాస్ ప్రేమ్ పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో మరణించాడు. దీనికి ప్రతిగా నక్సల్స్ దాడి చేయగా కర్ణాటక స్టేట్ రిజర్వ్ పోలీస్ (కేఆర్‌ఎస్పీ) బెటాలియన్‌కు చెందిన ఏడుగురు సిబ్బంది, ఓ పౌరుడు మృతి చెందారు. ఈ దాడులకు ముందు చిక్‌మగళూరులో 2003లో వరవరరావు కొన్ని బహిరంగ సమావేశాల్లో పాల్గొన్నారు. గత సంవత్సరం ఆగస్టు 28న ఎల్గర్ పరిషద్ కేసులో వరవరరావుతో పాటు ఉద్యమకారులైన సుధా భరద్వాజ్, అరుణ్ ఫెరీరా, వెర్నాన్ గోన్సాల్వెస్‌లను పుణే పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆయుధాలు, నాటుబాంబుల సేకరణతో పాటు మావోయిస్టు కార్యకలాపాలకు విద్యార్థులను ఎంచుకున్నారని వరవరరావుపై అభియోగాలున్నాయి. 2017 డిసెంబరు 31న జరిగిన ఎల్గర్ పరిషద్ సమావేశంలో కోరెగాన్–భీమా యుద్ధ స్మారకం వద్ద ఆవేశపూరిత ప్రసంగాలు జరిగాయని తెలిపారు.



వరద నీటి ఉధృతికి దెబ్బతిన్న ఇళ్లు

# తెగిన ఆనకట్ట

- మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో ప్రమాదం
- 23 మంది చనిపోయుంటారని అనుమానం
- 11 మృతదేహాలు లభ్యం

**సాక్షి, ముంబై:** గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా చిప్లున్ తాలుకాలోని తెవరీ ఆనకట్ట తెగింది. ఈ దుర్ఘటనలో దాదాపు 23 మంది వరకు చనిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు 11 మృతదేహాలు లభ్యమయ్యాయి. తెవరీ ఆనకట్టకు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వచేసే సామర్థ్యం ఉండగా, మంగళవారం రాత్రి తెగిందని అధికారులు వెల్లడించారు. దీంతో ఆనకట్ట కింద ఉన్న ఏడు గ్రామాల్లో వరదలాంటి పరిస్థితి ఏర్పడింది. 12 ఇళ్లు కొట్టుకుపోయాయి. రత్నగిరి అదనపు ఎస్పీ మాట్లాడుతూ 'ఇప్పటివరకు 11 మృతదేహాలను బయటకు తెచ్చాం. ఆయా గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాం' అని చెప్పారు. మరణించిన వారి బంధువులకు ప్రభుత్వం రూ. 4 లక్షల నష్ట పరిహారం ప్రకటించింది. ముఖ్యమంత్రి ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు.

**ముందే చెప్పినా పట్టించుకోలేదు:** ఆనకట్టకు పగుళ్లు ఉన్నట్లు గతేడాది నవంబర్‌లోనే గుర్తించి జిల్లా అధికారులకు చెప్పి మరమ్మతులు చేయించమన్నామనీ, అయినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తివరే ఆనకట్ట చిప్లున్, దపోలీ తాలూకాల్లో విస్తరించి ఉంది. అయితే ఈ ఆనకట్ట ఏ తాలూకా పరిధిలోకి వస్తుందనే విషయంపై వివాదం ఉండటంతో రెండు తాలూకాల అధికారులూ పట్టించుకోలేదని చనిపోయిన వ్యక్తి బంధువు ఒకరు చెప్పారు. మరో వ్యక్తి మాట్లాడుతూ 'అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ రోజు ఇలా జరిగింది. నా తల్లిదండ్రులు, భార్య, ఏడాదిన్నర వయసున్న బిడ్డ గల్లంతయ్యారు. నా సోదరుడు తన వాహనం తెచ్చుకోడానికి వెళ్లి తిరిగిరాలేదు' అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. గల్లంతైన వారి కోసం జాతీయ విపత్తు స్పందన దళం గాలింపు చేపడుతున్నారు. ప్రమాదానికి కారణం ప్రభుత్వమేనని స్థానిక ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఆనకట్టకు మరమ్మతులు చేయాల్సిందిగా తాము ఎన్నిసార్లు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆనకట్ట గోడలకు పగుళ్లు ఉన్నాయని అధికార యంత్రాంగానికి చెప్పామనీ, అయినా వారు ఏ చర్యలూ తీసుకోలేదని ప్రజాప్రతినిధులు నిందించారు.

## 26/11 సూత్రధారిపై పాక్ కేసులు

**లాహోర్:** ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలంటూ పాక్‌పై అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పాక్ అధికారులు 26/11 ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌పై బుధవారం కేసులు నమోదు చేశారు. మరో 12 మందిపై 23 కేసులు నమోదు చేశారు. వీరంతా ఉగ్రవాదులకు సహాయం చేయడానికి డబ్బు సేకరించారని అభియోగం మోపారు. జమాత్–ఉద్–దావా (జేయూడీ), దానికి చెందిన సంస్థలను ఉగ్రవాదులకు నిధులు కూర్చడానికి ఉపయోగించారని పాకిస్తాన్ ఉగ్రవాద నిరోధక విభాగం అధికారులు తెలిపారు. అందుకే జేయూడీ సహా ఇతర నాయకులపై కేసులు నమోదు చేశారు. లాహోర్, గుజ్రాన్‌వాలా, ముల్తాన్‌లలో కూడా వివిధ సంస్థలు అల్–అన్ఫాల్, దావత్ ఉల్ ఇర్షాద్, మువాజ్ బిన్ జబల్‌లతో ఉగ్రవాదుల నిధుల సేకరించినట్లు కేసులు నమోదయ్యాయి.

## వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో సాంకేతిక సమస్యలు

**న్యూఢిల్లీ:** వాట్సాప్‌లో మీడియా ఫైళ్లు డౌన్‌లోడ్ కావడం లేదంటూ బుధవారం రాత్రి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగాంలు కూడా సరిగ్గా పనిచేయడం లేదని అనేకమంది నెటిజన్లు ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఇండియాలో ఈ సమస్య ఏమంత పెద్దగా కనిపించలేదు. ప్రధానంగా దక్షిణ అమెరికా, యూరప్ ఖండాల్లోని ప్రజలు సమస్యను ఎదుర్కొన్నారు. ఫేస్‌బుక్ సర్వర్లలో తలెత్తిన సమస్య కారణంగానే వాట్సాప్, ఇన్‌స్ట్రాగాంలు కూడా సరిగ్గా పనిచేయలేదని తెలుస్తోంది. అయితే ఈ సమస్యపై మూడింటిలో ఏ సంస్థా అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ఏడాది మార్చిలోనూ ఇలాంటి సమస్యే తలెత్తింది.

## మీ డ్రైవర్లపై చర్యలు తీసుకోండి

**న్యూఢిల్లీ:** క్యాబ్ బుక్ చేసుకున్న తర్వాత కాన్సిల్ చేయడమే కాకుండా తనపై వివక్ష చూపారంటూ దివ్యాంగ హక్కుల కార్యకర్త అర్మాన్ అలీ ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ చేశారు. క్యాబ్ బుక్ చేసుకున్నాక 15 నిమిషాలకు డ్రైవర్ కాన్సిల్ చేశాడని, మరో క్యాబ్ బుక్‌చేస్తే అతడు తన కుర్చీని లోపల పెట్టకపోగా తనను బలవంతంగా బయటకు తోశాడని, దీంతో జూన్ 20న తాను విమానాన్ని అందుకోలేకపోయానని, మరో రూ. 14వేలు ఖర్చుపెట్టి టికెట్ కొనాల్సి వచ్చిందని వివరించారు. ఈ పోస్ట్‌లో ప్రధాని కార్యాలయం(పీఎంవో)తోపాటు ప్రధానిని ట్యాగ్ చేశారు. ఈ విషయాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని సామాజిక న్యాయం, సాధికారత శాఖ ఉబెర్ ఇండియాను ఆదేశించింది.

## ఎస్‌ఆర్‌ఎంలో 'లివర్ ట్రాన్స్‌ప్లాంట్' సక్సెస్

**చెన్నై:** చెన్నై సమీపంలోని ఎస్‌ఆర్‌ఎం వైద్యకళాశాలలో ఓ రోగికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి(46) లివర్ వ్యాధి ముదిరిపోయిన దశలో ఎస్‌ఆర్‌ఎం ఆసుపత్రిలో చేరారని వెల్లడించారు. కుటుంబ సభ్యుల లివర్ ఆయనకు మ్యాచ్ కాకపోవడంతో ప్రమాదవశాత్తూ చనిపోయిన ఓ దాత నుంచి లివర్‌ను సేకరించామని వెల్లడించారు. ఎస్‌ఆర్‌ఎం వైద్యులు, గ్లెనేగ్లెస్ గ్లోబల్ హెల్త్ సిటీ వైద్య బృందం సంయుక్తంగా 6 గంటల పాటు కష్టపడి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసిందన్నారు.

## నాకు రూ.40 కోట్లు ఆఫరిచ్చారు

**కర్ణాటక జేడీఎస్ ఎమ్మెల్యే మాధవ్**

**బెంగళూరు:** కర్ణాటక జేడీఎస్ ఎమ్మెల్యే కె.మాధవ్ సంచలన ఆరోపణలు చేశారు. తన నియోజకవర్గమైన పిరియపట్నలో బుధవారం ప్రజలతో మాట్లాడుతూ.. తనకు రూ.40 కోట్లు ఇస్తామని ఆఫర్ వచ్చిందని మాధవ్ తెలిపారు. అయితే ఈ మొత్తాన్ని ఎవరు ఇస్తారన్న విషయమై స్పష్టత ఇవ్వలేదు. 'నాకు రూ.30–40 కోట్లు ఇస్తామన్నారు. భారీగా నగదును 2–3 సార్లు నా గదికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే వెళ్లిపోకుంటే ఏసీబీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించా. నేను అమ్ముడుపోను. అంత డబ్బును ఏం చేయాలో కూడా నాకు తెలియదు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకూడదంటే రూ.80 కోట్లు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళీ నాముందే కూటమి నేతల్ని డిమాండ్ చేశారు' అని వ్యాఖ్యానించారు.

# పెండింగ్‌లోనే 'బెంగాల్ పేరుమార్పు'

- కేంద్రం ఇంకా ఆమోదించలేదు
- రాజ్యసభకు తెలిపిన కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్



**న్యూఢిల్లీ/కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ పేరును బంగ్లాగా మార్చే ప్రతిపాదనకు ప్రభుత్వం ఇంకా ఆమోదం తెలపలేదని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ బుధవారం రాజ్యసభకు తెలిపారు. దీంతో త్వరగా బెంగాల్ పేరును మార్చాలని కోరుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పశ్చిమ బెంగాల్ పేరును బంగ్లాగా మార్చాలంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జూలైలోనే తమ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. తమ రాష్ట్రం పేరును 'పశ్చిమబంగ' అని మార్చాలంటూ 2011లో ఒకసారి, ఇంగ్లిష్‌లో బెంగాల్, హిందీలో బంగాల్, బెంగాలీలో బంగ్లాగా మార్చాలంటూ 2016లో మరోసారి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫారసులు పంపినా వాటిని కేంద్రం ఆమోదించలేదు. దీంతో అన్ని భాషల్లోనూ ఒకేలా, రాష్ట్రం పేరును బంగ్లాగా మార్చాలని 2018 జూలైలో మరోసారి ప్రతిపాదనలు పంపింది. పేరు మార్పు వ్యవహారం ఎంతవరకు వచ్చిందో చెప్పాలని ఎంపీ రితబ్రత బెనర్జీ ఓ ప్రశ్న అడగ్గా, నిత్యానంద సమాధానమిస్తూ పేరు మార్పునకు కేంద్రం ఇంకా ఆమోదం తెలపలేదని స్పష్టం చేశారు. రాష్ట్రాల పేర్లను మార్చాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందనీ, సంబంధిత అన్ని అంశాలనూ పరిశీలించిన మీదట దీనిపై నిర్ణయం తీసుకుంటారని ఆయన వెల్లడించారు. బంగ్లాదేశ్ అనే పేరుతో బెంగాల్ పక్కన ఓ దేశమే ఉండగా, మళ్లీ బెంగాల్ పేరును బంగ్లాగా మార్చాలని ప్రతిపాదించడంపై అప్పట్లోనే అభ్యంతరాలు వచ్చాయి. కాగా, తమ రాష్ట్రం పేరును త్వరగా మార్చాలని కోరుతూ మోదీకి మమత లేఖ రాశారని ఓ అధికారి చెప్పారు. మన దేశంలో చివరిసారిగా ఓ రాష్ట్రం పేరును మార్చింది 2011లోనే. ఒరిస్సాగా ఉన్న పేరును అప్పట్లో ఒడిశాగా మార్చారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇంకే రాష్ట్రం పేరునూ మార్చలేదు.

# తెలుగులోనూ సుప్రీం తీర్పులు

- ఆరు భాషల్లోకి అనువాదం
- ఈ నెలాఖరుకు అందుబాటులోకి!



**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు తాను చెప్పే తీర్పులను కేవలం ఇంగ్లిష్‌లోనే కాకుండా తెలుగు సహా ఆరు భారతీయ భాషల్లో కూడా త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. ఇంగ్లిష్ నుంచి హిందీ, తెలుగు, కన్నడ, మరాఠీ, ఒడియా, అస్సామీ భాషల్లోకి తీర్పులను అనువదించి, వాటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ఆమోదం తెలిపారని విశ్వసనీయవర్గాల సమాచారం. ఇందుకోసం సుప్రీంకోర్టుకే చెందిన ఎలక్ట్రానిక్ సాఫ్ట్‌వేర్ విభాగం ఓ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించింది. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ నెల చివరికే తీర్పులు ఈ ఆరు ప్రాంతీయ భాషల్లో కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే తీర్పులు వెలువడిన రోజు వాటిని ఇంగ్లిష్‌లో మాత్రమే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఆ తర్వాత వారం రోజులకు ఆరు ప్రాంతీయభాషల్లోనూ తీర్పులను అప్‌లోడ్ చేయనున్నారు. ప్రాంతీయభాషల్లో కూడా తీర్పులను ప్రజలకు అందుబాటులో ఉంచితే ప్రయోజనకరంగా ఉంటుందని 2017లో రాష్ట్రపతి సూచించారు.

# హెచ్1బీ వీసా మోసం

**అమెరికాలో నలుగురు ఇండో అమెరికన్ల అరెస్ట్**



**వాషింగ్టన్:** అమెరికాలో విదేశీ నిపుణులకు జారీచేసే హెచ్1బీ వీసాల ప్రక్రియలో మోసానికి పాల్పడిన నలుగురు భారత సంతతి అమెరికన్లను పోలీసులు అరెస్ట్ చేశారు. తప్పుడు ధ్రువపత్రాలతో విజయ్ మానే(39), వెంకటరమణ మన్నెం(47), ఫెర్నాండో సిల్వ(53), సతీశ్ వేమూరి(52) వీసా మోసానికి పాల్పడ్డారని న్యాయశాఖ అధికారులు తెలిపారు. ఈ నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపరచగా, రూ.1.72 కోట్ల(2.50 లక్షల డాలర్ల) పూచీకత్తుపై వీరికి న్యాయస్థానం బెయిల్ మంజారుచేసింది. ఈ విషయమై అమెరికా న్యాయశాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ..'విజయ్ మానే, మన్నెం వెంకటరమణ, సతీశ్ వేమూరి కలిసి న్యూజెర్సీలోని మిడిల్‌సెక్స్ ప్రాంతంలో ప్రొక్యూర్ ప్రొఫెషనల్స్ ఇంక్, క్రిప్టో ఐటీ సొల్యూషన్స్ ఇంక్ అనే స్టాఫింగ్ కంపెనీలను ప్రారంభించారు. అదే సమయంలో ఫెర్నాండో సిల్వ, మన్నెం వెంకటరమణ కలిసి 'క్లయింట్ ఏ' అనే మరో సంస్థను మొదలుపెట్టారు. ఐటీ కంపెనీలకు నిపుణులైన సిబ్బందిని ఈ సంస్థలు సిఫార్సు చేయడంతో పాటు వారి తరఫున హెచ్1బీ వీసాలకు దరఖాస్తు చేస్తాయి. అయితే ప్రొక్యూర్ ప్రొఫెషనల్స్ ఇంక్, క్రిప్టో ఐటీ సొల్యూషన్స్ ఇంక్ ఇక్కడే మోసానికి తెరలేపాయి. తమ ఏజెన్సీల తరఫున హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తు చేసిన విదేశీయులకు ఇప్పటికే 'క్లయింట్ ఏ' సంస్థలో ఉద్యోగాలు లభించాయని తప్పుడు పత్రాలు సృష్టించాయి. దీంతో మిగతా వీసా దరఖాస్తుల కంటే ఈ రెండు సంస్థల తరఫున దాఖలైన హెచ్1బీ వీసాలు త్వరితగతిన ఆమోదం పొందాయి. తద్వారా ఇతర స్టాఫింగ్ కంపెనీలతో పోల్చుకుంటే ప్రొక్యూర్ ప్రొఫెషనల్స్ ఇన్, క్రిప్టో ఐటీ సొల్యూషన్స్ ఇన్ సంస్థలు అనుచితంగా లబ్ధిపొందాయి' అని తెలిపారు.

# మేఘాలయ ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ:** అక్రమ బొగ్గు తవ్వకాలను అరికట్టడంలో విఫలమైనందున నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) విధించిన రూ .100 కోట్ల జరిమానాను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)లో జమ చేయాలని మేఘాలయ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. అక్రమంగా సేకరించిన మొత్తం బొగ్గును కోల్ ఇండియాకు అప్పగించాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సంబంధిత అధికారుల అనుమతులకు లోబడి ప్రైవేటు, కమ్యూనిటీ యాజమాన్యంలోని భూముల్లో మైనింగ్ ఆపరేషన్ రాష్ట్రంలో కొనసాగడానికి ధర్మాసనం అనుమతించింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జనవరి 4న మేఘాలయ ప్రభుత్వానికి జరిమానా విధించింది. మేఘాలయలో పెద్ద సంఖ్యలో గనులు అక్రమంగా పనిచేస్తున్నాయని మేఘాలయ అంగీకరించింది. గౌహతి హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ కకోటి నేతృత్వంలోని కమిటీ నివేదిక ప్రకారం, మేఘాలయలో 24 వేల గనులుండగా, ఎక్కువ భాగం అనుమతులు లేనివేనని పేర్కొంది.




ప్రపంచ ప్రఖ్యాత జగన్నాథ స్వామి రథయాత్ర గురువారం ప్రారంభంకానున్న నేపథ్యంలో బుధవారం పూరీలో సముద్రతీరంలో శిల్పి చెక్కిన సైకత శిల్పం

సాక్షి
గురువారం, జూలై, 4

# ఎట్టకేలకు...

చివరకు రాహుల్‌గాంధీ మాటే నెగ్గింది. కాంగ్రెస్ పార్టీలో ఎందరు నచ్చజెప్పినా బేఖాతరు చేసి ఆయన అధ్యక్ష పీఠం నుంచి తప్పుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం నుంచి వెనక్కితగ్గేది లేదని బుధవారం ట్వీటర్ ద్వారా పార్టీనుద్దేశించి రాసిన లేఖలో మరోసారి తేల్చి చెప్పడంతో ఆయన స్థానంలో తాత్కాలికంగా పార్టీ కురువృద్ధుడు మోతీలాల్ వోరాను నియమించారు. అయిదు వారాలక్రితం రాహుల్ రాజీనామా నిర్ణయం ప్రకటించాక పార్టీ నిలువెల్లా చేష్టలుడిగినట్టు మిగిలిపోయింది. ఇతరత్రా కార్యకలాపాలన్నిటికీ స్వస్తి చెప్పి రాజీనామా వెనక్కి తీసుకోవాలంటూ రాహుల్‌కు వేడుకోళ్లు, విన్నపాలు చేయడంలోనే అది నిమగ్నమైంది. ఆయన అనుచరులుగా ముద్రపడిన చాలామంది ఆయన బాటలోనే పదవులనుంచి వైదొలగారు. రాహుల్ వెనక్కి తగ్గుతారని ఆ పార్టీ శ్రేణుల్లో చాలామందికి, ముఖ్యంగా సీనియర్ నేతలకు ఏదో మూల ఆశ ఉంది. అందరినుంచీ ఒత్తిళ్లు వస్తే కుమారుడి మనసు మారుతుందని సోనియాగాంధీ కూడా భావించినట్టున్నారు. కనుకనే నెల్లాళ్లకు పైగా ఇతర కార్యకలాపాలన్నిటినీ పార్టీ పక్కనబెట్టింది.

తాజా లేఖలో రాహుల్‌గాంధీ అనేక అంశాలు స్పృశించారు. అందులో పార్టీ తీరుతెన్నుల గురించి మాత్రమే కాదు... దేశంలో వ్యవస్థల పనితీరుకు సంబంధించిన విమర్శలు కూడా ఉన్నాయి. పార్టీలోనూ, వెలుపలా అనేక సమస్యలుండటం, వాటిపై తాననుకున్న రీతిలో పోరాడలేకపోవడం, సరిచేయలేకపోవడం ఆయన్ను నిరాశపరిచినట్టు లేఖ చెబుతోంది. ఏ రాజకీయ పార్టీకైనా సమస్యలే ప్రధాన వనరు. వ్యవస్థలు సక్రమంగా లేవనుకున్నప్పుడు, అవి దిగజారుతున్నాయనుకున్నప్పుడు నిజమైన నాయకుడు తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాడు తప్ప అస్త్ర సన్యాసం చేయడు. ఇక పార్టీలో సంస్థాగత లోటుపాట్లను సరిచేసుకోవడం రాహుల్‌వంటి అధినేతకు అసాధ్యమేమీ కాదు. వాస్తవానికి గతంలో పీవీ నరసింహారావు, సీతారాం కేసరి తదితరులకు లేని వెసులుబాటు రాహుల్‌కు ఉంది. ఆయన ఎవరికీ రిమోట్ కంట్రోల్‌గా ఉండనవసరం లేదు. ఏ అంశంపైనైనా నిర్ణయం తీసుకుని, దాని వెనక సమస్త శ్రేణుల్ని సమీకరించడం ఆయనకు అసాధ్యం కాదు. అలాగే తన సహచర నేతల్లో ఎవరైనా కలిసిరావడం లేదనుకుంటే వారిని సరిచేయడానికి, అది కుదరని పని అనుకుంటే పక్కనబెట్టడానికి రాహుల్ నిర్ణయించుకుంటే దానికి అడ్డుపడేవారు లేరు. ఎవరూ ఆయనపై కత్తి దూసే అవకాశం లేదు. అయినా ఆయన స్వతంత్రంగా వ్యవహరించలేకపోయారని, నిర్ణయాలు తీసుకోలేకపోయారని కొన్నేళ్లుగా తెలుస్తూనే ఉంది. పార్టీని 'ఎవరూ ఊహించని స్థాయిలో' ప్రక్షాళన చేస్తానని 2013లోనే ఆయన ప్రకటించినా... వర్కింగ్ కమిటీలో చేసిన కొన్ని మార్పులు మినహా ఆ ప్రక్షాళన జాడ ఎక్కడా కనబడలేదు.

మొత్తంగా పార్టీపై ఆయన ముద్రే లేదు. యువ నాయకత్వం వచ్చింది గనుక పార్టీ దూసుకుపోతుందని అందరూ భావించినా, ఆ జాడ కనబడలేదు. ఆయన చేద్దామనుకున్నదేమిటో, చేయలేకపోయిందేమిటో రాహుల్ ఎప్పుడూ చెప్పలేదు. కానీ తాజా లేఖలో మాత్రం పదే పదే ఆయన జవాబుదారీతనం గురించి ప్రస్తావించారు. కాంగ్రెస్‌లో అది బొత్తిగా కొరవడిందన్న భావన, దాన్ని అలవర్చలేకపోయానన్న అసంతృప్తి ఆయనకు దండిగానే ఉన్నదని లేఖ చూస్తే అర్థమవుతుంది. పార్టీ ఎదగాలంటే జవాబుదారీతనం అత్యంత ప్రధానమైనదని, కఠిన నిర్ణయాలు తప్పనిసరని రాహుల్ నొక్కి చెప్పారు. అంతేకాదు...ఎన్నికల ఓటమికి తన బాధ్యతను విస్మరించి ఇతరుల్ని బాధ్యుల్ని చేయడం అన్యాయమనుకున్నందువల్లే అధ్యక్ష పదవినుంచి తప్పుకుంటున్నట్టు తెలియజేశారు. చిత్రమేమంటే అందరూ ఆయన్ను రాజీనామా ఉపసంహరించుకోమని వేడుకునేవారే తప్ప, 'ఇందులో మా బాధ్యత కూడా ఉంది. మేమూ తప్పుకుంటా'మని వైదొలగినవారు లేరు. ఈ లేఖ చూశాకైనా అటువంటి నేతల్లో మార్పు వస్తుందేమో చూడాలి. లోక్‌సభ ఎన్నికలకు ముందు తమ సంతానానికి లేదా తమకు టిక్కెట్లివ్వకపోతే ముప్పు తప్పదని ఒత్తిడి తెచ్చి నవారంతా ఓడిపోయాక పక్కవారిపై నెపం వేయడం... చివరకు తానూ, తన బృందం ఓటమికి బాధ్యులన్నట్టు మీడియాలో కథనాలు అల్లించడం రాహుల్ ఆగ్రహానికి ప్రధాన కారణం. దీంతోపాటు లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వంలో సీనియర్ నేతలెవరూ తనతో సమానంగా బీజేపీపై విమర్శనాస్త్రాలు సంధించలేదని ఆయన రగిలిపోతున్నారు. ఫలితాలు వెల్లడయ్యాక జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో ప్రియాంక ఈ సంగతిని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. తన సోదరుడు 'ఒంటరిపోరు' చేయాల్సివచ్చిందని వాపోయారు. తాజా లేఖలో సైతం ఈ 'ఒంటరిపోరు' ప్రస్తావన ఉంది. పార్టీ శ్రేణులు మాత్రం అంకితభావంతో పనిచేశాయన్న ప్రశంసలున్నాయి.

కానీ పార్టీ ఈ స్థితికి చేరడానికి తమ కుటుంబం బాధ్యత కూడా ఉన్నదని రాహుల్ గుర్తించడం మేలు. అంతక్రితం దేన్నయినా నిష్కర్షగా చెప్పే, స్వతంత్రంగా వ్యవహరించగలిగే నేతలకు పార్టీలో కాస్తయినా అవకాశం ఉండేది. సోనియా ఏలుబడిలో అది క్రమేపీ కొడిగట్టింది. వందిమాగధ బృందాలు తయారై చాడీలు చెప్పడం, వాటిని విశ్వసించి విచక్షణారహిత నిర్ణయాలు తీసుకోవడం పెరిగింది. ఇప్పుడు వ్యవస్థలు పతనమయ్యాయని వాపోతున్న రాహుల్ అందుకు సంబంధించిన మూలాలు సైతం తమ పాలనాకాలంలోనే ఉన్నాయని గుర్తించడం మంచిది. వ్యవస్థల తీరు సరిగాలేదనుకుంటే, ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లందని భావిస్తే... జాతి మొత్తాన్ని ఏకం చేయాలనుకుంటే జవాబుదారీతనంతోపాటు ఆత్మవిమర్శ కూడా తప్పనిసరి. అది రాహుల్ లేఖలో కనబడదు. పార్టీ కొత్త సారథినైనా స్వతంత్రంగా పనిచేయనిస్తే అది అంతిమంగా కాంగ్రెస్‌కే ఉపయోగం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, తిథి శు.విదియ రా.9.17 వరకు, తదుపరి తదియ నక్షత్రం పునర్వసు ఉ.6.47 వరకు, తదుపరి పుష్యమి తె.5.14 వరకు (తెల్లవారితే శుక్రవారం), వర్జ్యం ప.2.16 నుంచి 3.46 వరకు దుర్ముహూర్తం ఉ.9.54 నుంచి 10.44 వరకు, తదుపరి ప.3.04 నుంచి 3.56 వరకు, అమృతఘడియలు... లేవు.

సూర్యోదయం : 5.34
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

# సోషలిజానికి సరికొత్త భాష్యం



మల్లెపల్లి లక్ష్మయ్య

**లాటిన్ అమెరికాలోనే కాక ప్రపంచవ్యాప్తంగా లక్షలాది అభిమానులను సంపాదించుకొన్న విప్లవ తాత్వికవేత్త మార్తా హర్నేకర్. విద్యార్థి దశలోనే ఉద్యమ ధారగా మొదలైన ఆమె జీవితం తత్వవేత్తగా, మార్క్సిస్టు మేధావిగా, మహా రచయిత్రిగా, పాత్రికేయురాలిగా, ప్రపంచ ప్రఖ్యాత రచయిత్రిగా ఎదిగిన తీరు ప్రజాస్వామిక కాంక్షాపరులందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది. ఆమె తెలుగు రాష్ట్రాల్లోని మార్క్సిస్టు అభిమానులకు, ప్రజాస్వామిక ఉద్యమకారులకు పరిచయమున్న విప్లవ కంఠం. ప్రజాస్వామ్యం అట్టడుగు స్థాయి నుంచి పటిష్టం చేయడం ద్వారా మాత్రమే సోషలిజం కల సాకారమవుతుందని ఆమె తేల్చి చెప్పారు. నిత్య సంఘర్షణావాది, నిరంతర సత్య శోధకురాలు మార్తా హర్నేకర్ గతనెల 14వ తేదీన తుదిశ్వాస విడవడం ప్రజాస్వామిక అభిమానులకు తీరని లోటు.**

''ప్రపంచంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయి. భారీ సైనిక శక్తి, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధితో అమెరికాతో సహా అనేక బహుళజాతి కంపెనీలు నూతన దోపిడీ విధానాలను కొనసాగిస్తున్నాయి. దీనితో ప్రజలు మరింత అశక్తులుగా తయారవుతున్నారు. సంపద కొద్దిమంది చేతుల్లోకి చేరిపోతుండడం వల్ల పేదరికం, వివక్ష మరింతగా పెరిగిపోతున్నది'' అని ఆధునిక మార్క్సిస్టు మేధావి మార్తా హర్నేకర్ చేసిన వ్యాఖ్యలు ఆధునిక సామాజిక స్థితిగతులకు అద్దం పడుతున్నాయి.

మార్క్సిజాన్ని సమకాలీన సమాజానికి అన్వయించడంలో నిరంతరం కృషి చేసిన గొప్ప తాత్విక వేత్త మార్తా హర్నేకర్. విద్యార్థి దశలోనే ఉద్యమధారగా మొదలైన ఆమె జీవితం తత్వవేత్తగా, మార్క్సిస్టు మేధావిగా, మహా రచయిత్రిగా, పాత్రికేయురాలిగా, ప్రపంచ ప్రఖ్యాత రచయిత్రిగా ఎదిగిన తీరు ప్రజాస్వామిక కాంక్షాపరులందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది. మార్తా హర్నేకర్ తెలుగు రాష్ట్రాల్లోని మార్క్సిస్టు అభిమానులకు, ప్రజాస్వామిక ఉద్యమకారులకు పరిచయమున్న విప్లవ కంఠం. తెలంగాణ ఆవిర్భావం తరువాత హైదరాబాద్‌లో 2014 మార్చిలో ఏర్పాటు చేసిన ''సోషలిజం–ప్రజాస్వామ్యం'' అంతర్జాతీయ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని నాలుగు రోజుల పాటు ఎన్నో అంశాలపై చర్చించడం తెలంగాణ ఉద్యమకారులకూ, ప్రజాస్వామికవాదులకూ, విప్లవాభిమానులకూ ఎంతో స్ఫూర్తినిచ్చింది. మార్తాహర్నేకర్ కలం నుంచి వెల్లువెత్తిన సైద్ధాంతిక భేదాభిప్రాయాలూ, సామాజిక అంచనాలూ వంటి వేనవేల రచనలు ఎందరినో ఆలోచింపజేశాయి. ఆమె ప్రపంచ మార్క్సిస్టు మేధావుల్లో ఒక నూతన ఆలోచనలకు పునాదులు వేసిన అగ్రగామి. లాటిన్ అమెరికాలోనే కాక ప్రపంచవాప్తంగా లక్షలాది అభిమానులను సంపాదించుకొన్న విప్లవ తాత్వికవేత్త. మార్తా రాసిన 'రీ బిల్డ్ ద లెఫ్ట్' ఎన్నో విమర్శలనెదుర్కొన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల్లో సైద్ధాంతిక చర్చను రేపిన పుస్తకం, మార్క్సిస్టు సైద్ధాంతిక ఆచరణకు సరికొత్త అర్థం చెప్పిన రచన అని చెప్పొచ్చు. అటువంటి నిత్య సంఘర్షణావాది, నిరంతర సత్య శోధకురాలు మార్తా హర్నేకర్ గతనెల 14వ తేదీన తుది శ్వాస విడవడం ప్రజాస్వామిక అభిమానులకు తీరని లోటు. మార్తా హర్నేకర్ ఆస్ట్రియన్ మూలాలు కలిగిన కుటుంబంలో 1937లో చిలీలో జన్మించారు. చిలీలోని క్యాథలిక్ విశ్వవిద్యాలయంలో మానసిక శాస్త్రంలో పట్టా పొందారు. ఆ తర్వాత పారిస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. ప్రముఖ విద్యావేత్త, లూయిస్ ఆల్తూసర్ వద్ద మార్తా హర్నేకర్ శిక్షణ పొందారు. 1963–1968 వరకు పారిస్‌లో ఉన్న మార్తా ఆనాడు ఉధృతంగా సాగిన పారిస్ విద్యార్థి ఉద్యమం నుంచి స్ఫూర్తిపొం దారు. 1968లో చిలీకి తిరిగి వచ్చిన మార్తా హర్నేకర్ చిలీ విశ్వవిద్యాల యంలో చారిత్రక భౌతికవాదం, రాజకీయార్థశాస్త్రం అధ్యాపకురాలిగా పనిచేశారు. 1968లోనే చిలీ సోషలిస్టు పార్టీలో చేరి క్రియాశీలకంగా పని చేసిన అనుభవం ఆమెను సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా మరింతగా రాటుదేలేలా చేశాయి.

కేరళ తర్వాత ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు ప్రభుత్వం చిలీలోని అలెండి ప్రభుత్వమే. 1970లో చిలీలో అలెండి ఎన్నికల ద్వారా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చిలీ సోషలిస్టు పార్టీ నేత సాల్వడర్ అలెండి నాయకత్వంలో మార్తా పనిచేశారు. అయితే 1973

కొత్త కోణం




సెప్టెంబర్ 11న అమెరికా కుట్రలో సైనిక తిరుగుబాటు జరిపి అలెండి ప్రభుత్వాన్ని కూలదోశారు. అలెండి అనుచరులందరినీ హత్య చేయడమో, జైల్లో పెట్టడమో జరిగింది. మార్తా మాత్రం చిలీ నుంచి తప్పించుకొని క్యూబా చేరుకున్నారు. క్యూబాలో ఒక అధ్యయన సంస్థను స్థాపించి, తన పరిశోధనలను, రచనా వ్యాసంగాన్నీ కొనసాగించారు. అంతకు ముందు మార్తా విద్యార్థి దశలో ఉండగానే 1959లో క్యూబాను సందర్శించారు. అప్పటికే క్యూబా విముక్తిని సాధించింది. క్యూబా విప్లవంలో 'ఎర్రగడ్డం' యోధుడిగా పేరుపొందిన మాన్యుల్ పినెరోను మార్తా వివాహం చేసుకున్నారు. వారిద్దరికీ ఒక కూతురు. ఆమె పేరు కమిల. మార్తా భర్త పినెరో 1998లో కారు ప్రమాదంలో మరణించారు. క్యూబాలో ఉన్న సమయంలో మార్తా హర్నేకర్ లాటిన్ అమెరికా చరిత్ర, ఉద్యమాలు, అనుభవాలెన్నింటినో ప్రత్యక్షంగా పాల్గొన్న వారి ద్వారా సేకరించారు. ఆ విధంగా లాటిన్ అమెరికా ఉద్యమాల చరిత్రను ఒక ప్రత్యేక దృష్టితో పరిశీలించారు. మార్క్సిజాన్ని లాటిన్ అమెరికాకు అన్వయించి ఆమె 80కి పైగా పుస్తకాలు రాశారు. అందులో మొట్టమొదట చెప్పుకోవాల్సింది. 'చారిత్రక భౌతిక వాదం–ప్రాథమిక సూత్రాలు' అన్న పుస్తకం. ఈ పుస్తకం 60కి పైగా ముద్రణలు పొందింది. మొదట స్పానిష్‌లో ప్రచురితమైన ఆ పుస్తకం, ఆ తర్వాత ఇంగ్లిష్‌తో పాటు ప్రపంచంలోని చాలా భాషల్లోకి అనువాదమైంది. ఆమె రచనల్లో 'ఎ వరల్డ్ టు బిల్డ్', 'ఐడియాస్ ఫర్ స్ట్రగుల్' వెనిజులా విప్లవనాయకుడు చావెజ్ ఇంటర్వ్యూతో రూపొందిన పుస్తకం, 'రీ బిల్డింగ్ ద లెఫ్ట్' పుస్తకాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందినవి. చివరి రెండు పుస్తకాలు తెలుగులోకి కూడా అనువాద మయ్యాయి. మార్తా మార్క్సిస్టు తాత్విక విషయాల వెలుగులో ఆచరణకు సంబంధించిన విషయాలను ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా మార్క్సిస్టు సిద్ధాంతాలతో పనిచేస్తోన్న రాజకీయ పార్టీల ఆచరణను మార్తా విమర్శనాత్మక దృష్టితో చూశారు.

కమ్యూనిస్టు, మార్క్సిస్టు పార్టీల సిద్ధాంత సంక్షోభాన్ని ప్రముఖంగా ఎత్తిచూపారు. ముఖ్యంగా మూడు అంశాలను ఆమె లేవనెత్తారు. కారల్‌మార్క్స్ పేర్కొన్న పెట్టుబడిదారీ విధానానికి ప్రస్తుతం కొనసాగుతోన్న పెట్టుబడిదారీ పద్ధతులకూ ఎంతో తేడా ఉన్నదని, దానిని అర్థం చేసుకోవడంలో మార్క్సిస్టులుగా మనం విఫలమవుతున్నామని పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసిన ఆటోమేషన్, డిజిటల్, కంప్యూ టర్లు, రోబోల పాత్ర గురించి విశ్లేషించుకోవాలని, అవి ఉత్పత్తి నుంచి కార్మిక వర్గాన్ని తొలగిస్తున్న అంశాలను అర్థం చేసుకోవాలని మార్తా అభిప్రాయపడ్డారు. కొద్ది మంది మినహా ప్రపంచంలోని అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిపోతున్నదని చెప్పారు. సమాచార విప్లవం పెట్టుబడిదారీ విధానాన్ని ముందుకు తీసుకెళ్ళిందని, సామ్రాజ్యవాదం రూపంలో మార్చుకున్నదే కానీ, కను మరుగు కాలేదని కూడా ఆమె స్పష్టం చేశారు.

రెండో అంశంగా, కమ్యూనిస్టుల ఒంటెద్దు పోకడలను ఎత్తిచూపారు. ప్రపంచంలో కొనసాగుతున్న నయా ఉదారవాదం, ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో కలిసివచ్చే శక్తులన్నింటితో కలిసి పనిచేయాలని, కేవలం కమ్యూనిస్టు సభ్యులతో మాత్రమే విజయం సాధించలేమని ఆమె పేర్కొన్నారు. సోదరభావం, సమసమాజం ఆశించే వాళ్ళు, కార్మిక వర్గ హక్కుల కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం పోరాడే వాళ్లందరితో కలిసి పోరాడాలని ఆమె స్పష్టం చేశారు. అంతేకాకుండా గత ఉద్యమాల నుంచి, గత సోషలిస్టు ప్రభుత్వాలు, వ్యవస్థలు అందించిన అనుభవాలను అధ్యయనం చేయాలని ఆమె సూచించారు. అందుకు గాను లాటిన్ అమెరికాలో గత రెండు వందల ఏళ్ళుగా సాగుతున్న ఉద్యమాలను మార్తా అధ్యయనం చేశారు.

మరొక ముఖ్యమైన విషయాన్ని మార్తా పదే పదే చెపుతుండేవారు. మార్క్సిజంలో అత్యంత ముఖ్యమైన చారిత్రక భౌతిక వాదం గురించి ఆమెది ప్రత్యేకమైన అధ్యయనదృష్టి. చరిత్రను భౌతికవాద దృష్టితో చూడాలని మార్క్సిజం చెపుతున్న మాటను ఆమె గుర్తు చేస్తూ, ఇప్పటి వరకూ చారిత్రక భౌతిక వాదాన్ని యూరప్‌కే పరిమితం చేసి చూస్తున్నామని ఆమె విమర్శించారు. ఏ దేశానికి ఆ దేశ ప్రత్యేక సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఉంటాయనే విషయాన్ని విస్మరించడం వల్ల చాలా దేశాల్లో విప్లవాలు విజయం సాధించలేకపోయాయి. మనదేశంలో ఉన్న సామాజిక సమస్యలు, ప్రత్యేకించి కుల వ్యవస్థ ప్రభావాన్ని ఇప్పటికీ కూడా శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించలేకపోతున్నాము.

మార్తా హర్నేకర్ మరొక విషయాన్ని చాలా నిక్కచ్చిగా తేల్చి చెప్పారు. కార్మిక వర్గ నియంతృత్వం ద్వారానే సోషలిజం సాధ్యమవుతుందనే వాదనను ఆమె తిరస్కరించారు. ప్రజాస్వామ్యాన్ని అట్టడుగు స్థాయి నుంచి పటిష్టం చేయడం ద్వారా మాత్రమే సోషలిజం కల సాకారమవుతుందని ఆమె తేల్చి చెప్పారు. ఆ విధంగా మార్క్సిజాన్ని ఆధునిక ప్రజాస్వామ్య ఆలోచనల వెలుగులో విశ్లేషించి నూతన అధ్యయనానికి పునాదులు వేశారు. ఆమె రచనలు, భావాలు ఆధునిక ప్రపంచంలో ఒక నూతన వెలుగును నింపాయి. మార్తా లాటిన్ అమెరికా ఉద్యమాలు, విప్లవాల వెలుగులో అధ్యయనం సాగించినప్పటికీ ఆమె ఆలోచనలు ప్రపంచం లోని మార్క్సిస్టులందరికీ స్ఫూర్తినిస్తున్నాయి. ముఖ్యంగా మార్తా హర్నేకర్ జీవితం, ఉద్యమం, నిత్యం సమాజ మార్పు కోసమే సాగాయి. క్యాన్సర్‌తో పోరాడుతూ తుదిశ్వాస విడిచిన మార్తా మూసభావనలకు భిన్నంగా, ప్రవాహంతో కొట్టుకుపోకుండా, మారుతున్న సామాజిక ఆర్థిక పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సరికొత్త, ఆచరణాత్మక పద్ధతులతో ముమ్మందుకు సాగాలని కోరుకున్నారు. మార్తా అంకిత భావం, పోరాట దీక్ష, శాస్త్రీయ అధ్యయనశక్తి భవిష్యత్ తరాలకు మార్గదర్శకం అవుతుందని ఆశిస్తున్నా...!


వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్ : 81063 22077

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### ఏది చేస్తామో



"నాకు విశ్వసనీయంగా తెలిసిన సమాచారం మేరకు మాజీ మంత్రి రాణా సనా ఉల్లా గుండె జబ్బుతో బాధపడుతున్నారు. షుగర్, హైబీపీతోపాటు ఎడమకన్ను ప్రాంతంలో రక్తం గడ్డకట్టి ఉంది. గాలి ఆడని గదిలో అతడిని బంధించారు. అతడి దగ్గర నుంచి మందులన్నీ గుంజేసుకున్నారు. మనం ఇతరులకు ఏది చేస్తామో, మనకూ అదే లభిస్తుందని నేను ఈ సందర్భంగా పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెప్పదల్చుకున్నా"

– నాజం సేథి, టీఎఫ్‌టీ చీఫ్ ఎడిటర్

### సక్సెస్



"సక్సెస్‌కు సూత్రం ఏమిటని నన్ను ఎవరైనా అడిగితే అటువంటివేమీ ఉండవని నేను మొదట చెబుతాను. దాంతోపాటు వినయం, ఆసక్తి లేకపోతే మీరు దీర్ఘకాలంపాటు విజయపథంలో సాగలేరని కూడా చెబుతాను. వాస్తవానికి ఒకటి మరో దానికి చోదకశక్తిగా పనిచేస్తుంది"

– ఆనంద్ మహీంద్ర
మహీంద్రా గ్రూప్ ఛైర్మన్

### ఉద్వేగం



"అంబటి రాయుడిని తలుచుకుంటే బాధకలుగుతోంది. ప్రతిసారీ అతడు ఎంత ఆడగలడో, అంత బాగా ఆడాడు. కానీ, కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతాయి. అతడు దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతాడని ఆశిస్తున్నా. దాంతో ఐపీఎల్ అతడు తనకు నచ్చిన విధంగా ఆడటాన్ని మనమంతా చూడొచ్చు"

– హర్షాభోగ్లే, క్రికెట్ వ్యాఖ్యాత

### నిజాయితీ



"ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను గాలికొదిలి తన సౌకర్యాల గురించి పోరాడుతున్నారు చంద్రబాబు. ప్రభుత్వానికి రాసిన మొదటి లేఖలో ప్రజావేదికను కేటాయించాలని కోరారు. తనకు భద్రత పెంచాలని ఇప్పుడు హైకోర్టులో పిటిషన్ వేశారు. వేతనం తీసుకుంటున్నందుకైనా ప్రజలను కాస్త గుర్తు పెట్టుకోండి బాబూ. విత్తనాల సేకరణకు 380 కోట్లు విడుదల చేయాలని ఫిబ్రవరిలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ కోరితే ఆ నిధులను 'ఓటర్ల ప్రలోభాలకు' మళ్లించారు. ఇంకా నిజాయితీ గురించి మాట్లాడుతున్నారంటే మీ ధైర్యానికి జోహార్లు బాబూ"

– విజయసాయిరెడ్డి
వైఎస్సార్‌సీపీ జాతీయ కార్యదర్శి

### విఫలం



"ముంబైలో గోడ కూలి 26 మంది చనిపోయారు. పుణేలో రెండు చోట్ల గోడ కూలిన ఘటనల్లో 21 మంది చనిపోయారు. ఇదంతా కేవలం ఒక్క గాలివానకే. వర్షాకాలపు ఇబ్బందులకు సిద్ధంగా లేనందుకు బీజేపీ సిగ్గుపడాలి"

– షమా మహ్మద్, కాంగ్రెస్ నేత

# తెలంగాణ వేగుచుక్క దొడ్డి కొమురయ్య

నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు సాగించిన మహత్తరమైన ప్రజాపోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. 1724లో స్థాపితమైన హైదరాబాద్ దక్కన్ రాజ్యాన్ని భూమి, భుక్తి, విముక్తి అనే మౌలిక హక్కుల కోసం తెలంగాణ ప్రజలంతా కలిసి 1948లో కూకటివేళ్లతో పెకిలించి తమ విముక్తిని ప్రకటించుకున్నారు. నిజాం ప్రభువుల పాలనకు మూలస్తంభాలుగా నిలిచిన భూస్వాములు, దేశముఖ్‌లు, అధికారులు తెలంగాణ ప్రజలపై పాశవిక నిర్బంధానికి గురి చేశారు. ఈ నిరంకుశ నిర్బంధం నుంచి తెలంగాణ ప్రజలను విముక్తి చేయడానికి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రమహాసభలు ఉమ్మడిగా ప్రజా ఉద్యమాన్ని నడిపించాయి. ఈ సమయంలో నిజాం డిప్యూటీ సేనాని, దేశముఖ్ విసునూరు రాంచంద్రారెడ్డి నిరంకుశ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా కడివెండి గ్రామంలో ప్రజలు సాగించిన వీరోచిత పోరాటం చారిత్రాత్మకమైంది.

అది 1946 జూలై 4వ తేదీ. రాత్రి 7 గంటల సమయం. నిజాం రాజ్యంలోని కడివెండి గ్రామంలో దేశ్‌ముఖ్ గూండాల ఆగడాలు హద్దు మీరడంతో భరించలేని ప్రజలు ఉమ్మడిగా ప్రజా ఊరేగింపు తీస్తున్నారు. నీ బాంచెన్ కాల్మొక్త దొరా అని వెట్టి చాకిరీతో బానిసల్లా బతుకుతున్న రైతులు విసిగిపోయి బందూకులు, గుత్పలు చేతపట్టి కొరివి దయ్యాలుగా పిలువబడే విస్నూరు దేశ్‌ముఖ్ తల్లి జానమ్మ దొరసాని గడివైపుకు కదం తొక్కుతూ కొనసాగారు. దొరసాని ఆజ్ఞ మేరకు వారి గుమస్తా మిస్కిన్ ఆలీ ఆధ్వర్యంలో గుండాలు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ఊరేగింపులో తొలి వరుసన మార్చింగ్ చేస్తున్న దొడ్డి కొమురయ్య అమరుడు కాగా చాలామంది గాయపడ్డారు.



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దొడ్డి కొమురయ్య వీరమరణంతో ప్రారంభమైంది. 1946 జూలై 4న మొదలైన తెలంగాణ సాయుధ పోరాటం 1951 వరకు సాగింది. గడీలను కూల్చింది. పది లక్షల ఎకరాల భూముల్ని పేదలకు పంచి ఇచ్చింది. నాలుగు వేలకు పైగా రైతాంగ గెరిల్లాలు అమరత్వం చెందారు. దొడ్డి కొమురయ్య అమరత్వంతో మొదలైన తెలంగాణ విముక్తి పోరాటం స్వరాష్ట్ర సాధనతో అంతిమ రూపం తీసుకుంది.

(నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి)

అస్నాల శ్రీనివాస్, వ్యవస్థాపకులు, దొడ్డికొమురయ్య ఫౌండేషన్

# ఆర్థికాన్ని బడ్జెట్ ఆదుకునేనా..?

అభిప్రాయం



డి. పాపారావు

కేంద్రప్రభుత్వ 2019–20 ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ జూలై 5, 2019న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ప్రధానంగా, దేశీయ ఆర్థికవ్యవస్థకు సంబంధించిన జీడీపీ, నిరుద్యోగం, పన్నుల ఆదాయాల వంటి అనేక సరికొత్త గణాంకాలు అన్నీ ప్రతికూల దిశగానే సాగుతున్నాయని నేడు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం, దేశ ఆర్థికస్థితి తీవ్ర మందగమనంలో ఉంది. 2018–19 తాలూకు చివరి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు కేవలం 5.8 శాతంగానే ఉంది. కాగా, మొత్తంగా 2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను అది 6.6 శాతం స్థాయిలోనే ఉంది. అలాగే, నిరుద్యోగ గణాంకాలు కూడా 45 ఏళ్ల గరిష్ట స్థాయిలో 6.1 శాతంగా ఉన్నాయి. ఇక, బ్యాంకింగ్ రంగంలో పేరుకుపోయిన మొండి బకాయిలు, బ్యాంకింగేతర ఫైనాన్స్ రంగ సంస్థలలో సంక్షోభ పరిస్థితుల వలన దేశీయంగా రుణాల మంజూరు తీవ్రంగా కుంటుపడింది. అలాగే, గ్రామీణ వ్యవసాయ సంక్షోభం నేడు పరాకాష్టలో ఉంది. పైగా, మన ప్రభుత్వం వేసుకొన్న పన్నుల రాబడి అంచనాలు కూడా తమ లక్ష్యాలను చేరలేకపోయాయి. 2018–19లో ప్రభుత్వ పన్నుల ఆదాయంలో నికరంగా 19 శాతం వృద్ధి ఉంటుందని అంచనా వేసుకున్నారు. కాగా, అది కేవలం 6 శాతంగానే ఉంది. అంటే ప్రభుత్వం రూ. 14.84 లక్షల కోట్ల మేరకు పన్నుల ఆదాయాన్ని ఆశించగా, వాస్తవంలో అది కేవలం రూ.13.17 లక్షల కోట్లుగానే ఉంది. దీనితో పాటుగా, రిజర్వ్ బ్యాంక్‌లోని అదనపు నిధులకు సంబంధించి ఏర్పరచిన బిమాల్ జలాన్ కమిటీ నివేదిక బడ్జెట్‌లోపే వస్తుందనీ, దాని వలన ప్రభుత్వ ఖజానాకు రిజర్వ్ బ్యాంకు ''అదనపు'' నిధుల నుంచి భారీగా వనరులు వచ్చి చేరుతాయని ప్రభుత్వం పెట్టుకున్న ఆశ, నిరాశే అయింది.

ఈ బడ్జెట్ ఒక ప్రక్కన ఆదాయ కొరతలూ, మరో ప్రక్కన ఆర్థిక మందగమనాన్ని పరిష్కరించవలసిన అడకత్తెర స్థితిలో ఉంది. దీన్నుంచి బయటపడేందుకు, ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఏదో ఒక రూపంలో కనీస ఆదాయ పథకాన్ని ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఇటువంటి పథకానికి సుమారు 2.5 నుంచి 3 లక్షల కోట్ల రూపాయల మేరకు ఖర్చు కాగలదని ఇప్పటికే అంచనాలు ఉన్నాయి. కాగా, నేడు కేంద్రప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాల మీదా కలగలిసి పెడుతోన్న మొత్తం ఖర్చు రూ. 3.4 లక్షల కోట్లు. కాబట్టి, మిగతా అన్ని సంక్షేమ పథకాల స్థానంలో కనీస ఆదాయ పథకం వంటి దానిని ప్రవేశపెడితే, అది ప్రభుత్వానికి సుమారు రూ. 40 వేల కోట్లనుంచి రూ. 90 వేల కోట్ల మేరకు ఆదా చేయగలదు. ఈ బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పన వ్యయాలు రెండవ ప్రధాన అంశం. ఇప్పటికే, ప్రధాని మోదీ రానున్న 5 ఏళ్లలో వ్యవసాయరంగంలో రూ. 25 లక్షల కోట్ల పెట్టుబడులను ప్రతిపాదించడం తెలిసిందే. అటు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇటు ప్రధాని కూడా ఈ పెట్టుబడులు ప్రధానంగా గిడ్డంగులు, శీతల గిడ్డంగులు, ఆహారశుద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల వంటి వాటిలో రావాలనీ, దీనిలో కార్పొరేట్‌లు భాగస్వాములు కావాలనీ చెప్పి ఉన్నారు. అంటే, వ్యవసాయక పెట్టుబడుల రంగంలో కార్పొరేట్ వ్యవసాయానికి అనుకూల దిశగానే ఉండవచ్చును.

చివరగా, బడ్జెట్ కేటాయింపులలో 30,000 నుంచి 40,000 కోట్ల రూపాయల మేరన మొండి బకాయిలతో కుదేలై ఉన్న బ్యాంకులకు మూలధనంగా అందవచ్చును. ఇక కార్పొరేట్‌లు, తమపై విధిస్తోన్న పన్నులను తగ్గించమన్న డిమాండ్ నిరంతరంగా ఉండేదే. నేడు ప్రపంచంలో వివిధ దేశాల మధ్యన విదేశీ పెట్టుబడుల కోసం, అలాగే దేశీయ ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహం కోసం నెలకొన్న పోటీలో కార్పొరేట్ పన్నును తగ్గించడం అవసరమంటూ ప్రభుత్వం బహుశా ఈ దిశగా నిర్ణయం తీసుకోవచ్చును. కాగా, మధ్యతరగతి వేతన జీవుల ఆశ అయిన ఆదాయపు పన్ను రాయితీలు అందే అవకాశం అంతంతమాత్రమే. ఇప్పటికే, ఆశించిన మేరకు పన్నుల రాబడిలో వృద్ధి లేదని భావిస్తోన్న ప్రభుత్వం నికరంగా, ఖచ్చితంగా వచ్చి తీరే ఈ వ్యక్తిగత పన్ను ఆదాయవనరును తగ్గించుకునేందుకు, ఎంతవరకు సిద్ధపడగలదు? అనేది ఇక్కడి ప్రశ్న. దేశంలో రోజురోజుకూ పెరిగిపోతోన్న నిరుద్యోగ సమస్యకు ఉపశమనాన్ని ఇచ్చేందుకు కూడా ఎగుమతులకు ప్రోత్సాహకాలు అవసరం. అలాగే పెద్ద నోట్ల రద్దు, హడావుడి జీఎస్టీ నిర్ణయాల వలన దెబ్బతిన్న చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకొనే రాయితీలూ, రుణ సదుపాయాల పెంపుదల, పన్నుల సంస్కరణ లాంటి నిర్ణయాలు అనివార్యం.


వ్యాసకర్త ఆర్థికరంగ విశ్లేషకులు
మొబైల్ : 98661 79615

# కవి

కవి అంటే కావ్యాలు రాసేవాడు. కావ్యం అంటే కవి రచించిన గ్రంథం అని లోకంలో ఇప్పటి వాడుక. కవి అంటే సర్వజ్ఞుడు అని అర్థం. కవిం కవీనాం.. అని గణపతిని స్తుతించే రుగ్వేదమంత్రంలో ఆ మాటలకు సర్వజ్ఞులలో సర్వజ్ఞుడు అని అర్థం చెబుతారు. భగవద్గీత భగవంతుడిని కవిగా, సనాతనుడిగా, సర్వ శాసకుడిగా, అణువులో అణువంత భాగమైన వాడిగా వర్ణిస్తుంది. ఇక్కడ కవి అన్నమాటకు ఆదిశంకరులు సర్వజ్ఞుడు, క్రాంతదర్శి అని భాష్యం చెప్పారు. క్రాంతదర్శి అంటే సామాన్య దృష్టిని దాటిపోయే విషయాలు కూడా దర్శించగల దార్శనికుడు.

కవి అంటే మేధావి, బుద్ధిశాలీ, లోతుగా చింతన చేయగలవాడు అని మరొక అర్థం. కవులలో నేను శుక్రాచార్యుడటిని అంటాడు గీతాచార్యుడు. శుక్రాచార్యుడికి తెలియని విద్యలు లేవు. అందుకే ఆయనను గురువుగా చేసుకున్న అసురజాతి అజేయంగా నిలిచి దేవతలను నానా ఇక్కట్ల పాలు చేసింది.

కాలక్రమంలో సాలంకారమైన చక్కనిభాషలో, సొగసుగా, రసవంతంగా మనసును రంజింపచేసి పరవశంలో ముంచే సాహిత్య కృతులను రచించగల ప్రజ్ఞాశాలులను కవులు అనడం వాడుక అయింది. అయితే పురుషులలో పుణ్యపురుషుల లాగా, కవులలో, కవులమని చెప్పకునేవారిలో నిజమైన కవులూ, మహాకవులూ ప్రాచీన కాలం నుంచి కుకవుల బెడద ఉంటూనే వస్తోంది. అందుకే మన ప్రబంధ కవులు చాలా మంది కవులను, సుకవులూ, కుకవులూ అని రెండు వర్గాలుగా విభజించి తమ కావ్యాల ఆరంభంలో సుకవులకు మొక్కి కుకవులకు పద్యరూపంలోనే రెండు మొట్టి కాయలు వేసి ముందుకెళ్లే సంప్రదాయం పాటించారు. తెనాలి రామకృష్ణుడు లాంటి తీవ్రవాదులైతే కవి అల్లసాని పెద్దన/ కవి తిక్కన సోమయాజి గణుతింపగా/కవి నేను రామకృష్ణుడ/కవి అను నామంబు నీటికాకికి లేదే! అనేవారు. నిజమే.. కవి అనే పదానికి నీటికాకి అనే అర్థం కూడా ఉంది.




పూర్వకాలంలో వివిధ శాస్త్రాలలో విశారదులకు ఉన్న గౌరవం, మహాకవులకు తప్ప మామూలు కవులకు ఉండేది కాదు. శాస్త్రాలు నేర్చుకునే శక్తీ, చిత్త ఏకాగ్రతా లేనివారు కవులవుతారు అనేవారు. వేదాంతులైతే మరీనీ. వేదాంత విచారణ చేయగోరేవారు కావ్యాలూ, కాకరకాయలూ పూర్తిగా వర్జించడం మంచిది అనేవారు. అయితే ఈమాట సన్మార్గ బోధ చేసే మహాకవుల సత్కావ్యాలకు వర్తించదని మల్లినాథుడి లాంటి వ్యాఖ్యాతలు స్పష్టం చేశారు.

ఆధునిక సమాజంలో డాక్టర్లకూ, ఇంజనీర్లకూ, శాస్త్రవేత్తలకూ ఆచార్యులకూ, వ్యాపారవేత్తలకూ, ఉన్నతోద్యోగులకూ, ధనస్వాములకూ ఉన్న స్థానం కవులకు లేదంటే అది కొత్త విశేషమేమీ కాదు.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 4-7-2019



అమ్మో... టీన్‌మార్! లోపలి పేజీలో...



కెప్టెన్ మిథాలీ సినిమా పేజీలో...



కానుకలు సంతోషాన్నిస్తాయి.
బంధాలను ఏర్పరుస్తాయి.
దాచుకోవాలనిపిస్తాయి.
కానీ బంధాన్ని తుంచుకోవడమే
ఒక కానుకగా ఆ తల్లి భావిస్తే..?
అది తల్లికి ఇవ్వాల్సిన కానుక
అని పిల్లలు భావిస్తే..?
ఆ తండ్రి ఎలాంటి వాడన్నట్టు?
అతనితో విడిపోవడానికి
ఏమిటి అడ్డు ఉన్నట్టు?

# విడాకుల కానుక

ఒక అక్కా, ఒక తమ్ముడు.

అక్కకు ఇరవై సంవత్సరాలు. తమ్ముడికి పద్దెనిమిది. ఇద్దరూ ఆ తల్లికి రెండు కళ్లు.

అక్క పుట్టిన రోజు వచ్చింది. తల్లి హడావిడి చేసింది. తమ్ముడు ఏర్పాట్లు చేశాడు. బయటి నుంచి పుడ్డు, స్వీట్లు, కేక్ తెప్పించాడు.

కూతురు కేక్ కోసి ఒక ముక్క తల్లికి తినిపించింది.

ముగ్గురూ సంతోషంగా ఉన్న క్షణాలు అవి.

తల్లి ఎంతో సంతృప్తితో ‘నీకేం కావాలో గిఫ్ట్ అడుగమ్మా’ అంది తాను ఉద్యోగస్తురాలన్న సంగతిని గుర్తు చేసుకుంటూ.

కూతురు తల్లి వైపు చూసింది.

‘ఏమీ వద్దమ్మా. నేనే నీకు గిఫ్ట్ ఇద్దామనుకుంటున్నాను’ అంది.

‘ఏమిటది?’

‘విడాకులు. నువ్వు విడాకులు తీసుకో చాలు’ అంది.

‘అవునమ్మా’ అన్నాడు కొడుకు.

పిల్లలు ఆ తల్లికి ఇవ్వగల అతిపెద్ద గిఫ్ట్ అదే ప్రస్తుతానికి.

* * *

ఒక భార్య విడాకులు తీసుకోవడం ఈ దేశంలో కొంత సులువు కావచ్చు.

కాని ఒక తల్లి విడాకులు తీసుకోవడమంటే ఎన్నో ఆలోచించాలి.

ఇప్పుడామె చుట్టూ ఎన్నో ఆలోచనలు. పాతికేళ్లుగా అవే ఆలోచనలు. దాటలేని ఆలోచనలు.

* * *

నర్మదకు పాతికేళ్ల క్రితం పెళ్లయ్యింది. అప్పటికే ఆమెకు బ్యాంకులో ఉద్యోగం ఉంది. మరో బ్యాంకు సంబంధమే చూసి పెళ్లి చేశారు. ఇద్దరూ బ్యాంకు ఉద్యోగులే ఇంకేమి అని వాళ్లు వీళ్లు అసూయపడ్డారు. కాని కాపురం అలా లేదు. కత్తితో పొడవడం కర్రతో కొట్టడం ఒక రకమైన హింస. భర్త శ్రీనివాస్ అలా చేయడు. గొంతుకు అడ్డంపడే ఉండలాగా ఉంటాడు. కక్కలేదు. మింగలేదు. అలాగని అక్కడే ఉంచుకోలేదు. ఊపిరాడని భావన.

శ్రీనివాస్ ఆమెను చెయ్యెత్తి ఒక్క దెబ్బ కూడా కొట్టలేదు. కాని ఒళ్లంతా హూనం అయ్యేలా ప్రవర్తిస్తాడు. మాటలు అంటాడు.

‘బ్యాంకులో ఎవరితోనో చనువుగా మాట్లాడుతున్నావటగా. అవసరమా’

‘బయటకు వెళ్లేప్పుడు బాగానే తయారవుతావ్. ఇంట్లో ఏం రోగం?’

‘పిల్లలది నా పోలికేనంటావా?’

‘చూడబోతే నీ మనసులో ఇంకెవడో ఉన్నట్టున్నాడు’

ఇవే మాటలు. ఇలాంటి మాటలే మాట్లాడుతూ ఉంటాడు.

‘సరే... మీకు అనుమానం ఉంటే చెప్పండి. ఉద్యోగం మానేసి ఇంట్లో కూచుంటాను’ అంటే ‘డబ్బు లేకపోతే అడుక్కు తినాల్సి వస్తుంది. నువ్వు ఉద్యోగం చేయాల్సిందే’ అంటాడు.

అతనితో ఎలా వేగాలో ఆమెకు ఎప్పటికీ అర్థం కాలేదు. ఇప్పటికీ అర్థం కావడం లేదు. పెళ్లి చేసుకొని వచ్చిన స్త్రీతో, తాళి కట్టి తెచ్చుకున్న స్త్రీతో భర్త ఎలా వ్యవహరించాలో ఏ కాలేజీలోనూ చెప్పరు. అందుకు అవసరమైన కోర్సు ఏదీ లేదు. తల్లిదండ్రులు ఆ కోర్సు చదివించరు. స్పోకెన్ ఇంగ్లిష్ క్లాస్ కన్నా, కంప్యూటర్ క్లాస్ కన్నా భార్యతో మెలగడం ఎలా అనే క్లాస్ ముఖ్యమని చాలామంది తల్లిదండ్రులు గ్రహించరు. భర్త అనాల్సినవాడు, భార్య పడాల్సిన ప్రాణి అనే మైండ్‌సెట్ స్థిరపడి ఉంటుంది.

ఆ మైండ్ సెట్‌తో నరకం అనుభవిస్తోంది నర్మద.

పిల్లలకు చిన్నప్పుడు ఇది తెలియదు. కాని పెరిగే కొద్దీ తండ్రి దురుసుతనం, దుర్మార్గ తీరు వారికి అర్థమైంది. నలుగురూ కలిసి సంతోషంగా, ఒకరి పట్ల ఒకరు గౌరవం ప్రదర్శించుకుంటూ ఒక్క నాడూ ఉన్నది లేదు. ఒకచోటుకు వెళ్లింది లేదు. తల్లికి జరిగే అవమానం పిల్లలకూ జరిగే అవమానంగా చాలామంది తల్లిదండ్రులు భావించరు– పిల్లలు నోరు తెరిచి చెప్పినా చెప్పకపోయినా.

నర్మద ఈ పెళ్లి నుంచి బయపడాలని చాలా రోజులుగా అనుకుంటోంది. కాని ఆమెకు అనేక సందేహాలు ఉన్నాయి.

1. అత్తగారి తరపువారు, పుట్టింటి వారు ఏమనుకుంటారో.
2. స్నేహితులు ఏమనుకుంటారో.
3. ఆఫీసులో ఏమనుకుంటారో.
4. అసలు భర్త ఏమనుకుంటాడో విడాకులు ఇస్తాడో ఇవ్వడో ఎటువంటి టెన్షన్ క్రియేట్ చేస్తాడో
5. పిల్లలకు తండ్రి ఎక్కడ మిస్సవుతాడో
6. విడాకులు తీసుకున్న తల్లి ఉందంటే పిల్లలకు సంబంధాలు వస్తాయో రావో
7. పిల్లలు రేపు పెద్దవాళ్లయ్యి చదువులకు వెళ్లిపోతే తానొక్కత్తే జీవితాన్ని నడిపించుకోగలదో లేదో.

ఇన్ని సందేహాల మధ్య ఆమె విడాకుల నిర్ణయాన్ని ఏళ్ల తరబడి వాయిదా వేస్తూ వస్తోంది. ఒక జీవి సంతోషంగా లేకపోతే ఆరోగ్యకరమైన మన సున్న సాటిజీవికి కష్టంగా ఉంటుంది. ఇప్పుడు తల్లి కష్టం చూసి పిల్లలకు చాలా కష్టంగా ఉంటోంది. వాళ్లే తల్లిని సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకు వచ్చారు. సైకియాట్రిస్ట్ ఆమె కథంతా వింది.

ఈ సందేహాలకు ఎవరు మాత్రం సమాధానం చెప్పగలరు? స్త్రీ చుట్టూ భారతీయ సంప్రదాయ వ్యవస్థ బిగించిన భావపరమైన, భౌతిక పరమైన బంధనాలు ఇవి.

వీటిని ఛేదించడం సాధ్యమా?



మీరు పూర్తిగా మీ జీవితాన్ని సంఘం చేతుల్లో పెట్టారు. సంఘభయం మీకు ఎక్కువగా వుంది. సంఘ తీర్పులు ఎన్ని ఉన్నా అవి వ్యక్తిగత అనుభవాల ముందు, స్వేచ్ఛ ముందు, నిర్ణయం తీసుకునే శక్తి ముందు నిలబడవు.

* * *

‘చూడండీ... ఈ దేశంలో చాలామంది స్త్రీలు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోయినా ధైర్యంగా విడాకులు తీసుకుంటున్నారు. మీకు ఉద్యోగం ఉంది. రిటైర్ అయితే పెన్షన్ కూడా వస్తుంది. అయినా మీరు భయపడుతున్నారు. మీరు పూర్తిగా మీ జీవితాన్ని సంఘం చేతుల్లో పెట్టారు. సంఘభయం మీకు ఎక్కువగా వుంది. సంఘ తీర్పులు ఎన్ని ఉన్నా అవి వ్యక్తిగత అనుభవాల ముందు, స్వేచ్ఛ ముందు, నిర్ణయం తీసుకునే శక్తి ముందు నిలబడవు. మీకు జ్వరంగా ఉందంటే ఈ సంఘం వచ్చి టాబ్లెట్ కొని పెట్టదు. వండుకునే ఓపిక లేదంటే స్విగ్గీలో ఆర్డరు పెట్టదు. మీ బాధలు మీరు పడుతున్నప్పుడు మీ నిర్ణయాలు మీరు తీసుకోవడానికి సంఘం అంగీకారం అక్కర్లేదు. మీరు విడాకులు తీసుకున్నారని తెలిశాక మీకు మిగిలే బంధువులే నిజమైన బంధువులు. మిగిలే స్నేహితులే నిజమైన స్నేహితులు. మిగిలే అనుబంధాలే నిజమైన అనుబంధాలు. మీ నిర్ణయాన్ని గౌరవించని తతిమావన్నీ అనవసరాలే. పైగా మీకు అన్నింటి కంటే బలంగా మీ పిల్లల మద్దతు ఉంది. వారు మీతోనే ఉంటామంటున్నారు. ఇక భర్త పెట్టే ఇబ్బందులు ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ సంగతి అంటారా? అలాంటి ఇబ్బంది ఉంటే చట్టం అండ మీకు ఎప్పుడూ ఉంటుంది. కనుక మీరు ధైర్యంగా విడాకులకు అప్లై చేయండి’ అని చెప్పింది సైకియాట్రిస్ట్.

నర్మద ఆ తర్వాత రెండు మూడు సిట్టింగ్‌లకు వచ్చింది.

ఐదో సిట్టింగ్ సమయంలో చెప్పింది–

‘డాక్టర్ నాకు కొంచెం ధైర్యం వచ్చింది. నాకిప్పుడు వాళ్లేమనుకుంటారో వీళ్లేమనుకుంటారో అనే భయం లేదు. నా జీవితం గురించి కూడా భయం లేదు. కాని ఒక్క పిల్లల విషయమే ఆలోచిస్తున్నాను. రేపు వాళ్లు యూనివర్సిటీలకో ఉద్యోగాలకో వెళ్లే వరకూ ఆగుతాను. అది జరిగాక ఆయనను కౌన్సెలింగ్‌కు తీసుకువస్తాను. మీరు చెప్పాల్సింది చెప్పండి. మారుతాడని అనుకుంటున్నాను. అప్పటికి కూడా మారకపోతే అప్పుడు విడాకుల సంగతి ఆలోచిస్తాను’ అందామె.

సైకియాట్రిస్ట్‌కు ఇది ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు.

వివాహ వ్యవస్థ స్త్రీని మాత్రమే దుర్బరురాలిని చేసి పురుషుణ్ణి చాలా శక్తిమంతం చేస్తుండటం వల్లే స్త్రీకి ఇంత పెనుగులాట అనిపించింది. తన గర్భంలో నుంచి వచ్చిన పిల్లల పట్ల తల్లికి ఉండే సహజమైన పాశం కూడా పురుషుడి దృష్టిలో ఆమె బలహీనతగా కనిపించడం వల్లే ‘ఆ.. ఎక్కడికి పోతుందిలే’ అనే భావనతో ఆమెను చులకన చేయడం, హింసించడం చేస్తుంటాడు.

నర్మద కోరినట్టుగా భర్త కౌన్సెలింగ్ వల్ల మారితే సంతోషం.

మారకపోతే ఆమె కచ్చితంగా విడాకులు తీసుకునేలా ప్రోద్బలం అందించడం తన బాధ్యత అనుకుంది సైకియాట్రిస్ట్.

ఆమె కథ ప్రస్తుతానికైతే అసంపూర్ణమే. ఇలాంటి అసంపూర్ణ దశలో ఈ దేశంలో ఎందరో స్త్రీలు ఉన్నారన్నది వాస్తవం.


– కథనం: సాక్షి ఫ్యామిలీ

ఇన్‌పుట్స్: డా. పద్మ పాల్వాయి, సైకియాట్రిస్ట్

గుడ్‌ఫుడ్ / నేడు జాక్‌ఫ్రూట్ డే

# అన్నీ ఉన్న పండు

**తండ్రి గరగర, తల్లి పీచుపీచు, బిడ్డలు రత్న మాణిక్యాలు.. ఇలా చిన్నప్పుడు మీరు పొడుపు కథ పొడిచి.. దాన్ని విప్పి.. అది పనసపండు అని తెలుసుకుని థ్రిల్ అయ్యే ఉంటారు. శ్వాసకోశ వ్యాధులతో గొంతులో గరగరలుంటే అవి తగ్గుతాయి. ‘పీచుపీచు’ అన్నందుకు అందులో పుష్కలంగా ఉండే పీచుతో జీర్ణవ్యవస్థ బాగుపడుతుంది. ఇక ‘బిడ్డల’ని పిలిచే.. తొనల్లోని రత్నాలు విటమిన్‌లు, ఖనిజలవణాలతో.. ఆ పండ్లు సాక్షాత్తూ హెల్త్ పాలిటి మాణిక్యాలే! అయితే పనసతో ఒనగూరే ఆరోగ్యప్రయోజనాల్లో ఇవి కొన్ని మాత్రమే. ఇంకా అనేకం ఉన్నాయి.**



- పనసతొనల్లో మంచి చక్కెరలైన ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లు ఉండి పండు తియ్యగా ఉంటుంది. 100 గ్రాముల పనస తొనల్లో 95 క్యాలరీలుంటాయి. తిన్న వెంటనే దేహానికి అవసరమైన శక్తిని తక్షణం విడుదల చేస్తాయి.
- పనసలో పీచుపదార్థాలు చాలా ఎక్కువ. అవి పేగుల్లోని పొరలను (కోలన్ మ్యూకోజా)ను కాపాడటంతో పాటు పేగు క్యాన్సర్లను నివారిస్తాయి.
- పనసలో చాలా శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. అవి క్యాన్సర్ కారకాలైన ఫ్రీ–రాడికల్స్‌ను నిర్మూలించి అనేక క్యాన్సర్లను నివారిస్తాయి. మరీ ముఖ్యంగా ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్లను పనస నివారిస్తుంది.
- పనసలో విటమిన్–ఏ చాలా ఎక్కువ. అది కంటి ఆరోగ్యాన్ని చాలాకాలం పాటు పదిలంగా కాపాడుతుంది. అంతేకాదు.. క్యాటరాక్ట్, మాక్యులార్ డీ–జనరేషన్, రేచీకటి వంటి కంటి వ్యాధులను నివారిస్తుంది.
- పనసలో విటమిన్–ఏ వల్ల అది మేనికి మంచి నిగారింపును కూడా ఇస్తుంది. ఏజింగ్ ప్రక్రియను చాలా ఆలస్యం చేస్తూ... ఒంటిపై ముడతలు రాకుండా చాలా కాలం నిరోధిస్తుంది. సుదీర్ఘకాలం పాటు యౌవనంగా ఉండటానికి తోడ్పడుతుంది.
- పనస నోటి (ఓరల్) క్యాన్సర్లను సమర్థంగా నివారిస్తుంది.
- పనసలో విటమిన్–సి పాళ్లు పుష్కలంగా ఉంటాయి. ఇంకా చెప్పాలంటే 100 గ్రాముల పనసలో 13.7 మిల్లీగ్రాముల విటమిన్–సి లభ్యమవుతుంది. రికమెండెడ్ డయటరీ అలవెన్స్ (ఆర్‌డీఏ) అనే కొలమానం రూపంలో చెప్పాలంటే పనసలో 23 శాతం విటమిన్–సి ఉంటుందన్నమాట. ఇంత విటమిన్–సి ఉండటం వల్ల ఈ తొనలతో మంచి వ్యాధి నిరోధక శక్తి సమకూరుతుంది. అందువల్ల పనసతో ఒకటీ రెండూ కాకుండా... అనేక రకాల వ్యాధుల నుంచి మనకు రక్షణ ఇస్తుంది.
- ఇక ఇందులో విటమిన్–బి కాంప్లెక్స్ గ్రూపునకు చెందిన పైరిడాక్సిన్, నియాసిన్, రైబోఫ్లేవిన్ వంటివి కూడా ఎక్కువే. వీటివల్ల కూడా మంచి రోగనిరోధక శక్తి సమకూరుతుంది.
- పనసలోని ప్రత్యేకమైన ఫైటోన్యూట్రియెంట్స్, ఫ్లేవనాయిడ్స్ వంటి పోషకాల సామర్థ్యం చాలా ఎక్కువ. అవి జీవకణాలలోని దెబ్బతిన్న డీఎన్ఏలను సైతం చక్కదిద్దగలవు.
- పనస పండు లోని కొన్ని పోషకాలు మంట, వాపు, నొప్పి (ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గిస్తాయి. దెబ్బలు త్వరగా నయమయ్యేలా చూస్తాయి.
- పనసలో క్యాల్షియమ్, ఫాస్ఫరస్ పాళ్లు చాలా ఎక్కువ. అందువల్ల ఇది ఎముకలు బలంగానూ, పటిష్ఠంగానూ ఉండేందుకు దోహదపడుతుంది.
- పనస థైరాయిడ్ గ్రంథికి వచ్చే జబ్బులను నివారించడంతో పాటు థైరాయిడ్ జీవక్రియలకు అవసరమైన కాపర్‌ను సమకూరుస్తుంది.
- పనసలో పొటాషియమ్ పాళ్లు ఎక్కువగా ఉండటం వల్ల అది రక్తపోటును నియంత్రించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది.

చెట్టు నీడ

# ఆ బలం నిలబడదు

రావణుడు ఎంత గొప్ప శివభక్తుడో, అంత దురహంకారి, ఎంతటి పరాక్రమ వంతుడో అంత దుర్మార్గుడు. పరస్త్రీలను అపహరించుకు రావడం సాటిలేని ఘనత, ఎదురులేని వీరత్వంగా భావించి స్త్రీలను చెరపట్టడం అతనికొక పరిపాటి అయింది. ఇష్టపడని కాంతను బలాత్కరించితే పదితలలు వెయ్యి చెక్కలౌతాయని శాపం కూడా పొందాడు..

రావణాసురుడి భార్య మండోదరి మయుని కూతురు. భర్త హితవు కోరి తరచూ హితవు చెబుతూండేది. అతని తమ్ముడు విభీషణుడు ఉత్తముడు. అవకాశం వచ్చినప్పుడల్లా రావణుడికి మంచి చెబుతూండేవాడు. కాని, రావణుడు ఒకరు చెబితే వినేలాంటి వాడు కాదు. వింధ్యపర్వతానికి దక్షిణాన వున్న భూభాగమూ, సముద్రమూ, ద్వీపాలూ రావణరాజ్యంగా, లంకా మహాసామ్రాజ్యంగా రాక్షస సమూహాలు స్థావరంగా చేసుకొని, నరభక్షకులై, ఆర్యావర్తంలో యజ్ఞయాగాదులు జరక్కుండా ధ్వంసం చేస్తూ, ఋషులను చిత్రహింసలు పెట్టి వినోదిస్తూ, ఊళ్ళూ ఆశ్రమాలూ తగలబెడుతూ చెలరేగుతూండేవారు. కుశధ్వజుడు అనే రాజర్షి వేదం చదువుతూండగా పుట్టిన వేదవతి అనే కన్య విష్ణువును భర్తగా కోరుతూ తపస్సు చేస్తోంది. రావణుడామెతో విష్ణువు కంటే తానే అధికుడననీ, తనతో వచ్చేయమనీ ఆమె కొప్పు పట్టుకొన్నాడు. వేదవతి, ‘‘దురాత్మా! నీవు తాకిన శరీరం ఇప్పుడే విడుస్తున్నాను. నీ లంకలోనే నా అంతట నేను పుట్టి నీ సర్వనాశనానికే కారణం ఔతాను! విష్ణువే నన్ను వరిస్తాడు!’’ అని చెప్పి తపోశక్తితో యోగాగ్ని రగుల్చుకొని ఆ క్షణమే దగ్ధమైపోయింది. రాక్షస నిర్మూలనం చేసి లోకకల్యాణం చేకూర్చడం కోసం విష్ణువు భూలోకంలో అవతరించవలసిన తరుణం వచ్చింది. విష్ణువు మానవుడుగా, దేవతలు అసంఖ్యాకులైన వానరులుగా జన్మించారు. రాముడి అవతారంలో ఉన్న విష్ణువు, వానరుల రూపంలో ఉన్న దేవతల సాయంతో రావణుడిని వధించి, లోకాలకు హితం చేకూర్చాడు.

ఇక్కడ మనం గ్రహించవలసింది ఏమిటంటే... ఎంతగా చదువుకున్నా, ఎంత ధనం ఉన్నా, ఎంతటి బలపరాక్రమాలు ఉన్నా ప్రజాకంటకంగా, లోక కంటకంగా తయారైతే ఆ వ్యక్తికి పతనం తప్పదు అని.

– డి.వి.ఆర్.

మంచిదే

# భయపడి ఛస్తున్నారు


**ఇరవై ఏళ్ల నాటి ‘టాయ్ స్టోరీ 2’ చిత్రాన్ని మళ్లీ హోమ్ వెర్షన్‌గా విడుదల చేస్తూ.. ‘మీటూ’ భయంతో అందులోని ఒక బ్లూపర్‌ని డిస్నీ పిక్చర్స్ తొలగించింది! హాలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ ఉందని చెబుతున్నట్లుగా ఆ బ్లూపర్ ఉండడమే అందుకు కారణం.**

థియేటర్‌లో ఆడుతున్న సినిమాకు ఇంట్లోని వాళ్లంతా ఒకేసారి కలిసి వెళ్లేందుకు వీలు కాకపోవచ్చు. ఆఫీస్‌లు ఉంటాయి.. అలసిపోయి వస్తారు. స్కూళ్లు ఉంటాయి.. స్కూల్‌బ్యాగ్ నిండా చేయవలసిన హోమ్ వర్క్ ఉంటుంది. కాలేజీలు ఉంటాయి.. ఆ వయసు పిల్లల ఆసక్తులు కలివిడికి భిన్నంగా ఉంటాయి. ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీల కన్నా ఎక్కువ.. ఇల్లు! ఎప్పుడూ తెమలని పని ఉంటుంది. సెలవురోజు అందరూ కలిసి వెళ్లడం కుదరొచ్చు కానీ, రాకరాక వచ్చిన సెలవుని బయటికి వెళ్లి వృథా చేసుకోవడం ఎందుకన్న ఆలోచన కూడా ఉంటుంది. అందుకే సెలవు రోజున ఇల్లంతా టీవీలో మళ్లీ మళ్లీ వస్తుండే హిట్ సినిమాకు (మోస్ట్‌లీ సినిమా) అంటుకుని ఉంటుంది. సోఫాలోనో, కుర్చీల్లోనో ఒకళ్ల మీద ఒకళ్లు పడుతూ సినిమా చూస్తుంటారు. అలా చూస్తున్నప్పుడు ఎవరో కనిపెడతారు.. ‘అరె! ఈ సీన్ లేదేమిటి?’ అని! ఆ సీన్ ఎందుకులేదో కనిపెట్టినవారు మౌనంగా ఉంటారు. థియేటర్‌లో చూసిన సినిమాల్లోని కొన్ని సీన్‌లు టీవీలో అందరూ కలిసి చూస్తున్నప్పుడు కట్ అయి ఉండటానికి కారణం.. ఇళ్లలోకి అలాంటి సీన్‌లు వెళ్ల కూడదని చానల్ వాళ్లు అనుకోవడం.

డిస్నీ పిక్చర్స్ కూడా తాజాగా ఇళ్లకు విడుదల చేసిన వెర్షన్‌లోని ‘టాయ్ స్టోరీ 2’ చిత్రంలో ఒక ‘బ్లూపర్’ని తొలగించింది! ఇరవై ఏళ్ల నాటి ఆ చిత్రంలోని చిన్న ముక్కను డిస్నీ ఇప్పుడు తీసేయడం ఏమిటి? పైగా అది బ్లూపర్. సినిమాకు ఏమాత్రం సంబంధం లేనిది. షూటింగ్ జరుగుతున్నప్పుడు నవ్వు తెప్పించే తప్పులు కొన్ని జరుగుతుంటాయి. అవే బ్లూపర్స్. వాటిని సినిమా చివర్లో క్లోజింగ్ క్రెడిట్స్‌తో కలిపి ప్రేక్షకులకు కొసరు సినిమాగా చూపిస్తుంటారు. క్లోజింగ్ క్రెడిట్స్ అంటే స్క్రీన్‌పై నెమ్మదిగా పైకి జరుగుతూ కనిపించే తారాగణం తరహా వివరాలు. ఆ వివరాల్లోంచి ఆ బ్లూపర్‌ను తొలగించింది డిస్నీ. టాయ్ స్టోరీ సిరీస్‌లో ఇప్పటి వరకు నాలుగు చిత్రాలు వచ్చాయి. టాయ్ స్టోరీ 4 గత నెలలో రిలీజ్ అయింది. మొదటి చిత్రం 1995లో వచ్చింది. రెండోది 1999లో. మూడోది 2010లో. ఈ సిరీస్ అన్నీ తయారవుతున్నది ‘పిక్సర్ యానిమేషన్ స్టూడియోస్’లో. డిస్నీ 2006లో పిక్సర్‌ని కొనేసింది. తర్వాత నుంచి టాయ్ స్టోరీస్‌ని రెండు సంస్థలూ కలిసే నిర్మిస్తున్నాయి. కంప్యూటర్ ఏనిమేటెడ్ అడ్వంచర్ కామెడీ ఫిల్మ్స్ ఇవన్నీ.

> ‘టాయ్ స్టోరీ’ సిరీస్ అన్నింటిలోనూ బొమ్మలన్నీ మనుషులు ఉన్నప్పుడు జీవం లేనట్లుగా నటిస్తుంటాయి. ఆ బొమ్మల్లా మగవాళ్లు ‘మీటూ’ ఉందని నటించే అవసరం రాకూడదనుకుంటే ఆడవాళ్లను టాయ్స్‌లా ట్రీట్ చేయడం మానాలి.

‘పిక్సర్’ సంస్థకు ఓ అలవాటు ఉంది. ప్రతి సినిమాకూ కొన్ని బ్లూపర్స్‌ని జత చేస్తుంది. సరదాగా చూస్తారు కదా అని. అలాగే టాయ్ స్టోరీ 2 లోనూ ఒక బ్లూపర్‌ని చూపించింది. అయితే అది నిజమైన బ్లూపర్ కాదు. కల్పితం. పైగా ‘క్యాస్టింగ్ కౌచ్’ బ్లూపర్. అందులో ఒక ప్రొడ్యూసర్.. సినిమాల్లో నటించడానికి వచ్చిన బార్బీ డాల్స్‌లాంటి ఇద్దరు అమ్మాయిలతో.. ‘మీకు టాయ్ స్టోరీ 3లో చాన్స్ ఇప్పిస్తాను. యాక్టింగ్‌లో టిప్స్ కూడా. ఏ క్షణమైనా మీకు అందుబాటులో ఉంటాను సరేనా’ అంటాడు. అంటూ వారిలో ఒక అమ్మాయి చేతిని నిమురుతాడు. అతడి ఉద్దేశం అర్థమై ఆ ఇద్దరూ వెళ్లిపోతారు. ఈ ముక్కనే డిస్నీ ఇప్పుడు కట్ చేసింది. ఇంకా అలాంటి ముక్కలు సిరీస్‌లో ఎక్కడైనా ఉన్నాయేమోనని వెతికిస్తోంది. ఇంతగా డిస్నీ జాగ్రత్త పడడానికి కారణం.. అది ఫేక్ బ్లూపర్ అని కాదు. ‘మీ టూ’ ఎఫెక్ట్! ఆ బ్లూపర్‌ని సెన్సార్ చెయ్యకుండా అలాగే ఉంచేస్తే హాలీవుడ్‌లో ‘క్యాస్టింగ్ కౌచ్’ (ఇవ్వడం కోసం పొందడం) ఉన్నమాట వాస్తమేనని అంగీకరించినట్లు అవుతుందని డిస్నీ భావించి ఈ నిర్ణయం తీసుకుంది. ఉండటం వేరు. ఉందని అంగీకరించడం వేరు.





‘టాయ్ స్టోరీ 2’ చిత్రం లోంచి డిస్నీ పిక్చర్స్ తొలగించిన క్యాస్టింగ్ కౌచ్ ‘బ్లూపర్’ ఇదే

రెండేళ్లుగా ‘మీటూ’ ఉద్యమం హాలీవుడ్‌ను వణికిస్తోంది. పెద్ద పెద్ద వాళ్ల స్థానాలు మారిపోయాయి. ఎవరి కారణంగానైతే హాలీవుడ్‌లో ‘మీ టూ’ రగులుకుందో ఆ మూవీ మొఘల్ హార్వీ వైన్‌స్టీన్‌పై వందకు పైగా కేసులు ఉన్నాయి. కోట్లాది రూపాయలు ధారపోసి ఒక్కో కేసు నుంచి బెయిల్ తెచ్చుకుంటున్నారు ఆయన. చేయాల్సిన ప్రాజెక్టులు ఎన్నో ఉండగా చేసేసి ప్రాజెక్టుల్లోకి వెళ్లి చిక్కుకోవడం ఎందుకు అని డిస్నీ కూడా అనుకున్నట్లే ఉంది. అలా కాకున్నా ఆ పర్టిక్యులర్ బ్లూపర్‌ని తీసి పడేయడం అన్నది డిస్నీకి తప్పని నిర్ణయం. టాయ్ స్టోరీ 2 ని డైరెక్ట్ చేసింది జాన్ లస్సెటర్. ‘పిక్సర్ ఏనిమేషన్ స్టూడియోస్’కి కో–ఫౌండర్ కూడా. పిక్సర్‌ని డిస్నీ కలుపుకున్నాక గత ఏడాది చివరి వరకు వాల్ట్ డిస్నీ కంపెనీ యానిమేషన్ చీఫ్‌గా ఉన్నారు. ఇంకా ఉండేవారే. తన దగ్గర పని చేసే అమ్మాయిలతో ఆయన మిస్ బిహేవ్ చేశారని ఆరోపణలు వచ్చాయి. పదవి నుంచి తప్పుకోవలసి వచ్చింది. ‘‘నా మనసులో చెడేమీ లేకపోవచ్చు. కానీ అవతలి వాళ్లకు చెడు కనిపించినప్పుడు వాళ్లకు నేను క్షమాపణ చెప్పవలసిందే’ అని నోట్ పెట్టి మౌనంగా వెళ్లిపోయారు లస్సెటర్.

ఈ మధ్య విడుదలైన టాయ్ స్టోరీ 4 కూడా వివాదాలకు అతీతంగా ఏమీ లేదు. ఆ సినిమాకు రైటర్‌గా పని చేస్తూ చేస్తూ ‘తాత్విక విభేదాలను’ కారణంగా చూపి మధ్యలోనే క్విట్ అయ్యారు రిషీదా జోన్స్. అసలు కారణం మాత్రం ఆడవాళ్లకు అవకాశాలు ఇవ్వడంపై వివక్ష. టాయ్ స్టోరీ సిరీస్.. ‘పిక్సర్’కి, ‘డిస్నీ’కి మంచి పేరు తెస్తున్నాయి. పేరు మాత్రమే కాదు. కలెక్షన్‌లూ వస్తున్నాయి. రివ్యూలు సరేసరే. ‘సరిలేరు మీకెవ్వరూ’ అన్నదే ఎప్పుడూ విమర్శకుల మాట. ‘టాయ్ స్టోరీ’ సిరీస్ అన్నిటిలో.. మనుషులు ఉన్నప్పుడు బొమ్మలన్నీ జీవం లేనట్లుగా నటిస్తుంటాయి. ఆ టాయ్స్‌లా మగవాళ్లు ‘మీటూ’ ఉందని నటించే అవసరం రాకూడదనుకుంటే ఆడవాళ్లను బొమ్మల్లా ట్రీట్ చేయడం మానాలి. ●



# అమ్మో... టీన్‌మార్!

**కౌమారం అందరికీ వస్తుంది.**
**కిక్కిస్తుంది, కిక్కెక్కిస్తుంది!**
**ఇది ప్రకృతి పిల్లలకు ఇచ్చే బహుమానం.**
**ఇది సుగుణాలకు దారివేయాలి.**
**అవగుణాల నుంచి దూరంగా ఉంచాలి.**
**పేరెంట్స్‌గా అది మీ చేతుల్లోనే ఉంది.**
**లేకపోతే...**
**అమ్మో... టీన్‌మారే!!**

**బా**ల్యం, కౌమారం, యౌవనం, మధ్యవయస్సు, వృద్ధాప్యం... ఇవీ మనిషి తన జీవితంలో అనుభవించే దశలు. పుట్టినప్పటి నుంచి 12 ఏళ్లు వచ్చే వరకు గడిచే బాల్యం చాలా మధురమైనది. 18 ఏళ్లు నిండిన నాటి నుంచి 40లలోకి ప్రవేశించే వరకు యౌవనం కూడా జీవితంలో మంచిదశే. ఈ దశలో ప్రతి వ్యక్తీ జీవితంలో తాను అనుకున్నది సాధించడానికి అవసరమైన శక్తియుక్తులు కలిగి ఉంటాడు. ఇక 40 నుంచి 65–70ల వరకు ఇక తాను గడించిన అనుభవంతో అలా దాదాపుగా అలవోకగా జీవితాన్ని వెళ్లదీస్తాడు. ఇలా సాగిపోయే దశే... మధ్యవయస్సు. ఇవన్నీ గడిచిపోయాక జీవితం చివరి భాగంలో 75–90 ల వరకు ఉండేది వృద్ధాప్యం అనుకోవచ్చు. ఈ దశలో ప్రతి ఒక్కరూ దాదాపుగా పూర్తిస్థాయి విశ్రాంత జీవితం గడుపుతుంటారు.

కానీ 12 ఏళ్ల నుంచి 19 వరకు ఉండే టీనేజీ చాలా చిత్రమైన దశ. ఈ సమయంలో మనం చేసేవన్నీ కరెక్ట్ అనిపిస్తుంది. ఈ దశలోనే మన వ్యక్తిత్వ నిర్మాణం జరుగుతుంది. మనకు అభిరుచులు ఏర్పడి... టీనేజీ దాటాక అవి హాబీలుగా స్థిరపడతాయి. టీన్స్‌లోని కొత్తహార్మోన్ల ప్రభావంతో పిల్లలు తాము కోపంగా ఉన్నా, దురుసుగా వ్యవహరించినా, ఆగ్రహంతో ఊగిపోయినా... మనకు అదంతా సబబే అనిపిస్తుంది. మధ్యవయసుకు చేరాక ఆలోచిస్తే... అప్పుడెంత దుందుడుకుగా వ్యవహరించామా అంటూ మన ప్రవర్తన పట్ల మనకే సిగ్గుగానూ, బిడియంగానూ ఉంటుంది. అందుకే ఇలాంటి కౌమార (టీన్స్) దశలో వారి ప్రవర్తనల్లో వచ్చే మార్పులు... ఆ ప్రవర్తనకు కారణమయ్యే రకరకాల భావోద్వేగాలు.. అందుకు కారణాలు, పెద్దలు వాటిని ఎలా ఎదుర్కోవాలి, ఎలా మేనేజ్ చేయాలి వంటి అనేక అంశాలపై అవగాహన కోసమే ఈ కథనం.

‘టీన్’ అంటే బాలబాలికలు పదమూడు దాటిన నాటి నుంచి పందొమ్మిదవ ఏటి వరకు ఉండే దశ అన్నది అందరికీ తెలిసిందే. థర్‘టీన్’ అంటూ మొదలై... నైన్‘టీన్’ వరకు గడిచే సంవత్సరాలను ఆయా సంఖ్యల పేర్ల చివరన ఉండే ‘టీన్’ అనే పదంతో సూచిస్తుంటారు. అయితే పిల్లలందరిలోనూ టీన్స్‌లో ఉండే ఆ ఉద్వేగాలన్నీ... గంటకొట్టినట్టుగా సరిగ్గా పన్నెండో ఏడు దాటిన మరుక్షణం నుంచే మొదలవ్వాలని ఏమీ లేదు. అమ్మాయిల్లో టీన్స్ తాలూకు పరిణతి 10–11 నుంచే ప్రారంభం కావడం మొదలవుతుంది. కానీ అబ్బాయిల్లో మాత్రం కాస్తంత ఆలస్యంగా అంటే... 12వ ఏటి తర్వాతే ఈ పరిణతి ప్రారంభమవుతుంది. పిల్లలు తమ బాల్యం వీడి క్రమంగా పెద్దలుగా రూపొందడానికి మధ్యన ఉండే ఈ సంధి (ట్రాన్సిషన్) దశలో వారి ప్రవర్తనలో ఎన్నో మార్పులు (బిహేవియరల్ ఛేంజెస్) చోటు చేసుకుంటాయి. ఆ మార్పులతో వారెన్నో అయోమయాలకు గురవుతుంటారు. అంతే కాదు.. తమ ప్రవర్తనతో తమకూ, తమ పెద్దలకు సైతం సమస్యలూ, చిక్కులూ తెచ్చిపెడుతుంటారు.

## హార్మోన్లే ప్రధాన కారణం

టీనేజీ పిల్లల ప్రవర్తనల్లో అంతకు మునుపెన్నడూ లేని మార్పు కనిపించడానికి వారిలో కొత్తగా స్రవించే కొన్ని హార్మోన్లే ప్రధాన కారణం. అవి వారిని నిలకడగా, స్థిరంగా, కుదురుగా ఉండనివ్వవు. టీన్స్‌లో వారు కొత్తదనం కోరుకుంటుంటారు. స్వేచ్ఛను ఆకాంక్షిస్తుంటారు. ఉత్సాహాలు, ఉద్రేకాలు పొంగిపొరలుతుంటాయి. తమ కోరికలు తక్షణం తీరకపోతే వెంటనే వారిలో రకరకాల ఉద్వేగాలు చెలరేగుతుంటాయి. మగపిల్లల్లో టెస్టోస్టెరాన్ అనే హార్మోన్ స్రవించడం మొదలవుతుంది. దాంతో మీసాలూ, గడ్డాలు వంటి సెకండరీ సెక్సువల్ కారెక్టర్స్ కనిపించడం ప్రారంభమవుతుంది. ఈ హార్మోన్ సాహస ప్రవృత్తినీ పెంచుతుంది. కాస్తంత స్వేచ్ఛగా సంచరించేలా, తమకూ తమ ఆపోజిట్ జెండర్‌కూ మధ్యన ఆకర్షణను పెంచేలా చేస్తుంది. ఆ హార్మోన్ ప్రభావం వల్ల సమకూరే కొత్త ఉత్సాహాల కారణంగా తాము స్వేచ్ఛను అనుభవించాలన్న కాంక్షతో కొన్ని పనులు చేయడం మొదలుపెడతారు. ఉదాహరణకు సమాజంలో సిగరెట్ తాగడం, మద్యం సేవించడం, వేగంగా వాహనం నడపడం వంటి కొన్ని అంశాలపై ఆంక్షలు ఉంటాయన్న విషయం తెలిసిందే. తమ సాహసప్రవృత్తిని తీర్చుకోడానికి వారు సమాజంలో ఆంక్షలున్న అంశాలను కాస్త తెంపరితనంతోనో లేదా దొంగతనంగానో చేయాలనుకుంటారు. ఆ పనులు చేసినప్పుడు అవి వారికి మంచి లేదా హాయిగా అనిపించే (ఫీల్‌గుడ్) భావనను కలగజేస్తే... అవే పనులు మాటిమాటికీ చేసి అలవాట్లనూ, వ్యసనాలనూ అభివృద్ధి చేసుకుంటారు.

ఇక్కడ మెదడులో స్రవించే మరికొన్ని హార్మోన్లు సైతం రంగంలోకి వస్తాయి. ఉదాహరణకు మొదటి సారి సిగరెట్ తాగినప్పుడు అందులోని నికోటిన్ ప్రభావం వల్ల మెదడులో డోపమైన్ వంటి సంతోష రసాయనాలు స్రవిస్తే... ఆ ఆనందభావనను మాటిమాటికీ పొందడం కోసం టీనేజీ పిల్లాడు మళ్లీ మళ్లీ సిగరెట్ తాగాలనుకుంటాడు. అలాగే మద్యం, పేకాట, దురలవాట్లు శ్రుతిమించితే డ్రగ్స్... ఇవన్నీ కూడా అలా అలవాటయ్యేవే.

## మంచీ చెడుల కలగలుపు...

మన హార్మోన్లతో టీనేజ్‌లో కలిగే సాహస ధోరణీ, సంతోష రసాయనాలూ రెండూ కలగలసి మంచీ–చెడూ... ఈ రెండు రకాల అభిరుచులూ వృద్ధి అవుతాయి. ఉదాహరణకు టీనేజ్‌లో కొత్తగా బైక్ నేర్చుకోవాలనే ధోరణి అందరిలో కలగడం ఓ మంచి భావన. భవిష్యత్తులో తాము జీవితాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలనే తపన అందులో ఉంటుంది. అయితే బైక్ నేర్చుకున్న తర్వాత దాని ముందు చక్రాన్ని పైకెత్తి నడపడం, చాలా వేగంగా డ్రైవ్ చేయడం వంటివి చేస్తున్న టీనేజీ పిల్లలను మనం రోడ్లపై నిత్యం చూస్తుంటాం. దీనికి కారణం ఆ వయసులో వారిలో కలిగే సాహసప్రవృత్తి. దానికి తోడుగా తమ కాన్షియస్ ఎఫర్ట్స్‌తో వారు తమ బైక్ నైపుణ్యాలను మరింత వృద్ధిపరచుకొని సాహసకార్యాలు చేస్తుంటారు. మరికొన్ని సందర్భాల్లోనైతే హింసాత్మక ప్రవృత్తితో చాలా క్రూరంగానూ వ్యవహరిస్తారు.

అయితే పిల్లల్లో ఇలా వ్యక్తిత్వ రూపకల్పన, అభిరుచులు ఏర్పడే సమయంలో... వారినీ, వారి ఆలోచనలనూ, వారి అలవాట్లనూ ప్రభావితం చేసే అంశాలు ఎన్నో ఉంటాయి.

## టీనేజ్‌లో మన ప్రవర్తన రూపొందడానికీ, అభివృద్ధి చెందడానికి కారణాలివే...

- **జన్యుపరమైన అంశాలు:** టీనేజీ పిల్లల్లోని ప్రవర్తనలకు జన్యుపరమైన అంశాలే ప్రధాన కారణం. సాధారణంగా తల్లిదండ్రులనుంచి వచ్చే జన్యువుల పైనే వారి ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు తల్లిదండ్రుల్లో ఆత్మస్థైర్యం చాలా ఎక్కువనుకోండి. వారిని చూసిన పిల్లలు సైతం తామూ అలాగే ధైర్యంగా ఉండటాన్ని అలవాటు చేసుకుంటారు. తల్లిదండ్రుల్లో ఏదైనా కొత్తగా చేసే పనుల విషయంలో భయపడే గుణం... అంటే ‘పర్‌ఫార్మెన్స్ యాంగ్జైటీ’ ఉంటే పిల్లల ప్రవర్తనలోనూ చాలా వరకు అవే గుణగణాలు (ట్రెయిట్స్) వస్తాయి.
- **కాన్షియస్ ఎఫర్ట్స్ :** వీటికి కూడా చాలా వరకు తల్లిదండ్రులతో పాటు కొన్ని సామాజిక అంశాలూ కారణమవుతాయి. ఉదాహరణకు తల్లిదండ్రులు ఏ డాక్టర్లో, ఐఏఎస్‌లుగానో పనిచేస్తున్నారనుకోండి. వాళ్లను గమనించే పిల్లలు... తాము కూడా అలాంటి వృత్తిలోకే వెళ్లాలనీ, అలాంటి గౌరవమే పొందాలని ఆకాంక్షిస్తుంటారు. ఇదే విషయం పెయింటర్లు, డాన్సర్లు, రచయితలకూ వర్తిస్తుంటుంది. కొన్ని మినహాయింపులున్నా సాధారణంగా తల్లిదండ్రుల ప్రభావం కారణంగానూ, తమ కాన్షియస్ ఎఫర్ట్స్‌తోనూ కలగలిసిన ప్రభావంతో తమ కెరియర్‌ను నిర్మించుకుంటుంటారు.

### మంచి అభిరుచుల వృద్ధి కూడా...

**టీ**న్స్ దశలోనే పిల్లల్లో వ్యక్తిత్వ నిర్మాణం ప్రారంభం అవుతుందనీ, అభిరుచులూ పెంపొందుతుంటాయని మనం ముందే చెప్పుకున్నాం కదా. ఈ దశలో తమకు సంతోషాన్నిచ్చే వ్యక్తిత్వాన్నీ, అభిరుచులను పిల్లలు ప్రాక్టీస్ చేస్తారు. ఆ సమయంలో కూడా మళ్లీ వాళ్ల మెదడుల్లో సంతోషాన్నీ, హాయినీ ఇచ్చే డోపమైన్, సెరిటోనిన్, ఎండార్ఫిన్ లాంటి రసాయనాలు స్రవిస్తాయి. ఉదాహరణకు ఒక టీనేజ్ అబ్బాయి చక్కటి డ్రాయింగ్ వేస్తాడు. మరొక అమ్మాయి మంచి రచన చేస్తుంది. ఇంకొకరు మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్ ప్లే చేస్తారు. ఇలా సృజనాత్మకమైన చర్య (యాక్టివిటీ) వల్ల తాము పొందిన ఆనందాన్ని మళ్లీ మళ్లీ పొందడం కోసం... తమలోని ఆ సృజనాసామర్థ్యాన్ని (టాలెంట్‌ను) అభివృద్ధి చేసుకుంటారు. ఇందుకోసం చేసే ప్రాక్టీస్‌ను ‘కాన్షియస్ ఎఫర్ట్’ అని అంటారు.



## ప్రవర్తనపై సామాజిక అంశాల ప్రభావం ఇలా...

పిల్లలను తమ చుట్టూ ఉన్న సమాజంలోని అనేక అంశాలను నిత్యం పరిశీలిస్తూ ఉంటారు. వాటినుంచి కూడా తాము నేర్చుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా తమ పరిసరాలు, తాము చూసే సినిమాల వంటి మాస్‌మీడియా ప్రభావాలు, తాము చదివే పుస్తకాల వంటి అనేక సామాజిక అంశాలూ టీనేజీ పిల్లల ప్రవర్తనను నిర్దేశిస్తుంటాయి. నిర్ణాయాత్మక భూమికను పోషిస్తుంటాయి.

**పరిసరాల ప్రభావం:** ఉదాహరణకు తమ ఇంటికి సమీపంలో ఏ పోలీస్ ఉద్యోగో ఉన్నాడు. అతడి ధీరత్వం, అతడి హుందాతనం, అతడు ప్రవర్తిస్తున్న తీరుతో స్ఫూర్తి పొందుతుంటాడు. అలాంటి వారి వల్ల ప్రభావితమైన కుర్రాడు తానూ అలాంటి వృత్తిలోకే వెళ్లాలని ఆశిస్తాడు. అందుకు అనుగుణంగా మళ్లీ తన కాన్షియస్ ఎఫర్ట్స్ మొదలుపెడతాడు. కొద్ది మేరకు జన్యుపరమైన అంశాలతో పాటు... చాలావరకు ఈ కాన్షియస్ ఎఫర్ట్స్ కారణంగానే పిల్లల కెరియర్, వారి భవిష్యత్తు నిర్ణయమవుతుంది. అలాగే నిత్యం కీచులాడుకునే తల్లిదండ్రులూ, పరిసరాల్లో ఎప్పుడూ గొడవలకు దిగే ప్రవృత్తి ఉన్నవారు ఉన్నారనుకోండి.... అవే అంశాలు పిల్లలనూ ప్రభావితం చేస్తాయి. దాంతో వారు నిత్యం తగాదాలు పెట్టుకునే తంపులమార్లుగా, పోకిరీలూ, జులాయిలుగా తయారయ్యే అవకాశాలూ ఉంటాయి.

**టీవీలు, సినిమాల, డిజిటల్ వంటి మాస్ మీడియా :** సాధారణంగా టీనేజ్ దశలో చూసే సినిమాలు, అందులో కథానాయకుడి లక్షణాలు పిల్లలను చాలా వరకు ప్రభావితం చేస్తుంటాయి. ఉదాహరణకు శంకరాభరణం సినిమా తర్వాత చాలా మంది టీనేజీ పిల్లలు సంగీతం వైపునకు ఆకర్షితులయ్యారు. అలాగే సాగరసంగమం సినిమా వచ్చాక చాలా మంది డాన్స్ నేర్చుకోవడం మొదలుపెట్టారు. ఇక ‘ద్రోహి’ (హిందీలో ద్రోహకాల్) అనే సినిమా చూసిన కొంతమంది పోలీస్ ఇన్‌స్పెక్టర్ ట్రైనింగ్ తీసుకొని ఆ వృత్తిలోకి వెళ్లారు.

**స్ఫూర్తిదాయక కథనాలు, సాహిత్యం:** కింది స్థాయి నుంచి జీవితాన్ని ప్రారంభించి, తాము మంచి కెరియర్‌నూ, మంచి పేరునూ సంపాదించిన వారి కథనాలూ చదవడం, సాహిత్యంతోనూ చాలామంది టీనేజీ పిల్లలు ప్రభావితమవుతుంటారు. పాపులర్ సైన్స్ పుస్తకాలు చదివి సైన్స్ పట్ల అభిరుచి పెంచుకోవడం, డబ్బు సంపాదన గురించిన కథనాలు చదివి జీవితంలో తామూ పారిశ్రామికవేత్తలుగా రూపొందిన ఉదాహరణలు సైతం చాలానే ఉన్నాయి. ఇంగ్లిష్‌లో స్టీఫెన్ హాకింగ్స్ వంటివారి పుస్తకాలు చదవడం, తెలుగులో నండూరి రామమోహన్‌రావు ‘విశ్వరూపం’, ‘నరావతారం’, యాకొవ్ పెరల్మాన్ రాసిన ‘నిత్యజీవితంలో భౌతికశాస్త్రం’ వంటి పుస్తకాలూ, మన దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం వంటి వారి రచనలు చదివి సైన్స్ పట్ల అభిరుచి పెంచుకొని సైంటిస్టులుగా మారినవారూ ఉన్నారు.

## అవే అంశాలతో దురలవాట్లు సైతం...

మనం పైన చెప్పుకున్న అంశాల నుంచే దురలవాట్లు అబ్బుతాయి. ఉదాహరణకు పరిసరాల్లో నేరప్రవృత్తి ఉన్నవారి నుంచి, సినిమాల్లోని కొన్ని దుస్సాహస ధోరణుల నుంచి, పేరుమోసిన నేరగాళ్ల నుంచి ప్రేరణ పొంది చెడుదారుల్లో నడవడం, ఆల్కహాల్‌కూ, డ్రగ్స్‌కూ అలవాటు కావడం వంటి ధోరణులు సైతం చోటు చేసుకునేందుకు టీనేజీలోనే బీజం పడటం జరుగుతుంటుంది.

ఇవన్నీ చేశాక కూడా టీనేజీ పిల్లల్లో ప్రవర్తన పూర్వకమైన మార్పుల వల్ల ఇటు పెద్దలకూ అటు వారికీ ఇబ్బందులు కలుగుతుంటే సైకియాట్రిస్ట్‌ల వంటి ప్రొఫెషనల్స్ సహాయం తీసుకోవడం చాలా వరకు మేలు చేస్తుంది. సైకియాట్రిస్ట్‌లు కౌన్సెలింగ్, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ (సీబీటీ) వంటి ప్రక్రియలతో వారి టీనేజ్ ప్రవర్తనలను చక్కదిద్దుతారు. ఒకవేళ ఈ ఈడు పిల్లలు దుష్ప్రవర్తనతో ఉంటే... వాటి కారణంగా వచ్చే దుష్పరిణామాలకు చాలావరకు అడ్డుకట్ట వేస్తారు.



**డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి**
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్,
లూసిడ్ డయాగ్నస్టిక్స్,
బంజారాహిల్స్,
హైదరాబాద్.

## చక్కదిద్దడం ఎలా...

**టీ**నేజ్‌లోకి రాగానే పిల్లల్లో కనిపించే ప్రవర్తను మార్పులను చక్కగా గాడిలో పెట్టడం (ఛానలైజ్ చేయడం) ద్వారా వారిని ప్రయోజనాత్మకమైన మంచి పౌరులుగా రూపొందేలా చేయవచ్చు. అందుకు తల్లిదండ్రులు అనుసరించాల్సిన కొన్ని అంశాలివే.

- **ఆదర్శప్రాయంగా ఉండటం:** టీనేజీ పిల్లలు తమ చాలా ప్రవర్తనలను పెద్దల నుంచే నేర్చుకుంటారని చెప్పుకున్నాం కదా. ఉదాహరణకు తాము మంచివృత్తుల్లో ఉండాలన్న భావనలూ, తాము సైతం తమ తల్లిదండ్రుల్లా సంగీత సాధన, మంచి రచనలు చేయాలని అనుకోవడానికి తల్లిదండ్రుల ఆదర్శ ప్రవర్తనే కారణమవుతుంది.
- **మంచి జీవనశైలి అలవాటు చేయడం:** మన జీవనశైలి ఆరోగ్యకరంగానూ, క్రమశిక్షణతోనూ ఉండేలా టీనేజీలోనే పిల్లలకు అలవాటు చేయాలి. ఆ వయసులో ఏర్పడ్డ అలవాట్లు జీవితాంతం కొనసాగుతాయి. క్రమబద్ధంగా ఉండటం అలవాటు చేసుకుంటే అది జీవితంలో వచ్చే ఎన్నో అడ్డంకులు, సమస్యలను అధిగమించడానికి ఉపయోగపడుతుంది. క్రమశిక్షణ కలిగి ఉండటం అన్నది జీవితంలో శ్రమపడటాన్నీ నేర్పుతుంది.



- **ఓపికతో వివరించడం:** పిల్లల అయోమయ భావనలను విసుక్కోకుండా... ఆ వయసులో జరిగే పరిణామాలను పిల్లలకు ఓపికగా వివరించి చెప్పాలి. ఈ పనిని వారు చాలా ప్రేమగానూ, సహనంతోనూ చేయాలి.
- **ఒత్తిడిని ఎదుర్కోవడం నేర్పడం:** ప్రతివారి జీవితంలోనూ కష్టాలు, సమస్యలు రావడం సహజం. ఆ సమయంలో ఒత్తిడి పెరగడం మామూలే. ఒత్తిడి పెరగడం అన్నది చాలా సహజమైన అంశమనీ, పరిమితమైన ఒత్తిడితోనూ మంచి ఫలితాలు సాధించవచ్చని పిల్లలకు చెప్పాలి. ఒత్తిడి పెరిగినప్పుడు దాన్ని అధిగమించే మార్గాలూ నేర్పాలు. ఉదాహరణకు యోగా, బ్రీతింగ్ వ్యాయామాలు, మంచి హాబీలను అలవరచుకోవడం వంటి వాటితో ఒత్తిడిని సమర్థంగా ఎలా ఎదుర్కోగలమో వారికి వివరంగా చెప్పాలి. అంతేకాదు... పేరెంట్స్ తాము కూడా ఆచరిస్తే... పిల్లలూ వారిని అనుకరిస్తారు.
- **పటిష్టమైన కుటుంబ సబంధాలు:** తల్లిదండ్రులు తమ పిల్లలతో నాణ్యమైన సమయం గడపడం, వారి పట్ల ప్రేమతో వ్యవహరించడం ద్వారా టీనేజీలో సైతం పిల్లలు అయోమయానికి గురికాకుండా స్పష్టంగా వ్యవహరించేలా చేయవచ్చు. పిల్లలు తమను నమ్మి అన్ని విషయాలూ తమతో చర్చించేలా బలమైన, పటిష్టమైన కుటుంబ సంబంధాలు ఉన్నప్పుడు ఆ పిల్లలు టీనేజీ అయోమయాలను తేలిగ్గా అధిగమించగలుగుతారు.
- **చెడు అలవాట్లకు లోనుకాకుండా చూడటం:** వ్యసనాలన్నీ పిల్లలను కబళించేందుకు టీనేజీలోనే పొంచి ఉంటాయి. వారి సాహసధోరణీ, తాత్కాలిక సంతోషాన్ని కలిగించే అంశాలు వ్యసనాలకు బానిస చేస్తాయి. అందుకే అవెంత ప్రమాదకరమో పిల్లలకు అన్యాపదేశంగా ఎప్పుడూ చెబుతూ ఉండటం ద్వారా వాటి జోలికి వెళ్లకుండా చేయాలి.

## హోమియో కౌన్సెలింగ్స్

### పీసీవోడీ నయమవుతుందా?

**నా భార్య వయసు 32 ఏళ్లు. ఇటీవల ఆమె శరీరంపై వెంట్రుకలు ఎక్కువగా పెరుగుతుంటే డాక్టర్‌కు చూపించాం. ఆమె పీసీఓడీతో బాధపడుతున్నట్లు చెప్పారు. దీనికి హోమియోలో చికిత్స ఉందా?**

**– కె. సోమరాజు, రాజాం**



రుతుక్రమం సవ్యంగా ఉన్న మహిళల్లో నెలసరి అయిన 11–18 రోజుల మధ్యకాలంలో వాళ్లలోని రెండు అండాశయాల్లోని ఏదో ఒకదాని నుంచి అండం విడుదల అవుతుంది. అలా జరగకుండా అపరిపక్వమైన అండాలు వెలువడి అవి నీటిబుడగల్లా అండాశయపు గోడలపై ఉండిపోయే కండిషన్‌ను పీసీవోడీ (పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్) అంటారు. ఇవి రెండువైపులా ఉంటే ‘బైలేటరల్ పీసీఓడీ’ అంటారు. ఈ సమస్యకు కచ్చితమైన కారణాలు తెలియనప్పటికీ జన్యుపరమైన అంశాలు ఒక కారణంగా భావిస్తున్నారు. అంతేగాక ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ హార్మోన్ల అసమతౌల్యత వల్ల ఈ సమస్య తలెత్తవచ్చు. సరైన జీవనశైలి పాటించని వారిలోనూ ఇది ఎక్కువ.

**లక్షణాలు:** నెలసరి సరిగా రాకపోవడం, వచ్చినా అండాశయం నుంచి అండం విడుదల కాకపోవడం, రుతుస్రావం సమయంలో ఎక్కువ రక్తంపోవడం, రెండు రుతుక్రమాల మధ్యకాలంలో రక్తస్రావం కావడం, నెలసరి వచ్చే సమయంలో కడుపులో బాగా నొప్పిరావడం, నెలసరి రాకపోవడం, బరువు పెరగడం, తలవెంట్రుకలు రాలిపోతుండటం, ముఖం, వీపు, శరీరంపై మొటిమలు రావడం, ముఖం, ఛాతీపైన మగవారిలా వెంట్రుకలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనివల్ల సంతానం కలగక పోవడం, స్థూలకాయం, డయాబెటిస్, కొందరిలో చాలా అరుదుగా హృద్రోగ సమస్యలు రావచ్చు. రోగి భౌతిక లక్షణాలతో పాటు అల్ట్రాసౌండ్ స్కాన్, హెచ్‌సీజీ, టెస్టోస్టెరాన్, ఆండ్రోజెన్, ప్రోలాక్టిన్ మొదలైన హార్మోన్ల పరీక్షలు, రక్తంలో చక్కెర పాళ్లు, కొలెస్ట్రాల్ శాతం వంటి పరీక్షలతో దీన్ని నిర్ధారణ చేయవచ్చు. హోమియో విధానంలో సరైన హార్మోన్ వ్యవస్థను పరిపుష్టం చేయడం ద్వారా దుష్ఫలితాలేవీ లేకుండా శాశ్వతంగా పీసీఓడీని నయం చేయవచ్చు.



**డా॥ శ్రీకాంత్ మొర్లావర్,**
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

### బాబుకు ఆస్తమా... ? చికిత్స ఉందా?

**మా బాబు వయసు పదేళ్లు. పుట్టినప్పటి నుంచి దగ్గు, ఆయాసం ఉన్నాయి. ఆయాసపడే సమయంలో పిల్లికూతలు వినిపిస్తుంటాయి. ఇప్పుడు చలికాలం వచ్చింది కదా... ఎప్పుడు హాస్పిటల్‌లో చేర్చాల్సివస్తుందో అని ఆందోళనగా ఉంటోంది. హోమియోలో ఆస్తమాకు పూర్తి చికిత్స ఉందా?**

**– డి. మోహన్‌కుమార్, గుంటూరు**



ఆస్తమా ఒక సాధారణమైన దీర్ఘకాలిక సమస్య. ఇది ఊపిరితిత్తుల్లోని వాయునాళాలకు సంబంధించిన వ్యాధి. వాయునాళాలు మూసుకుపోయి గాలి పీల్చడం, వదలడం కష్టంగా మారుతుంది. దీన్ని ఉబ్బసం, ఆయాసం, ఆస్తమా అనే పేర్లతో పిలుస్తుంటారు. ఇది దీర్ఘకాలికంగా... అంటే ఏళ్లతరబడి మనిషికి ఊపిరి అందకుండా చేస్తుంది. పిల్లలు, పెద్దలు అందరిలోనూ కనిపిస్తుంది. ఆస్తమా సమయంలో శ్వాసనాళాలు సంకోచించి, శ్లేష్మం (కళ్లె/ఫ్లెమ్) ఎక్కువగా తయారవుతుంది. అది కూడా ఊపిరిని అడ్డుకుంటుంది.

**కారణాలు:** ● దుమ్ము, ధూళి, కాలుష్యం ● వాతావరణ పరిస్థితులు, చల్లగాలి ● వైరస్‌లు, బ్యాక్టీరియాతో వచ్చే ఇన్ఫెక్షన్స్ ● పొగాకు ● పెంపుడు జంతువులు ● సుగంధద్రవ్యాలు, ఘాటైన వాసనలు ● పుప్పొడి రేణువులు ● వంశపారంపర్యం మొదలైనవి.

**లక్షణాలు:** ● ఆయాసం ● దగ్గు రాత్రిపూట రావడం ● గాలి తీసుకోవడం కష్టం కావడం; పిల్లికూతలు ● ఛాతీ పట్టేసినట్లుగా ఉండటం.

**వ్యాధి నిర్ధారణ :** ఎల్ఎఫ్‌టీ (లంగ్ ఫంక్షన్ టెస్ట్), ఛాతీ ఎక్స్‌రే, అలర్జీ టెస్టులు, కొన్ని రక్తపరీక్షలు.

**చికిత్స:** ఆస్తమా నుంచి పూర్తిగా ఉపశమనం కలిగించే మందులు హోమియోపతిలో అందుబాటులో ఉన్నాయి. అవి ఆస్తమా లక్షణాలను తగ్గించడమే కాకుండా, ఆ లక్షణాలను కలిగించే కారకాల పట్ల శరీరానికి వ్యాధి నిరోధకతను పెంచుతాయి. రోగి శారీరక, మానసిక, వంశపారంపర్య తత్వాలనూ, వ్యాధి లక్షణాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స చేస్తారు. ఈ విధానంలో ఆర్సెనిక్ ఆల్బ్, ఇపికాక్, నేట్రమ్ సల్ఫ్, కాల్కేరియా కార్బ్, యాంటిమోనమ్ ఆల్బ్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి. నిపుణులైన హోమియోవైద్యుల పర్యవేక్షణలో తగిన మందులు వాడితే హోమియో విధానం ద్వారా ఆస్తమాను పూర్తిగా తగ్గించవచ్చు.



**డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,**
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

### ఫ్యామిలీ డాక్టర్

### ఒంటిపైన తెల్లమచ్చలు... పరిష్కారం దొరుకుతుందా?

**నా శరీరమంతా తెల్లమచ్చలు వచ్చాయి. డాక్టర్‌ను సంప్రదిస్తే బొల్లి అని చెప్పారు. ఈ సమస్యతో నలుగురిలో వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. ఇది ఎందుకు వస్తుంది? హోమియోతో పరిష్కారం దొరుకుతుందా?**

**– ఆర్. రాజసింహ, విజయనగరం**

చర్మంలో రంగునిచ్చే మెలనోసైట్స్ అనే కణాలు తగ్గినప్పుడు అక్కడ తెల్లమచ్చలు వస్తాయి. ఈ మచ్చలనే బొల్లి లేదా ల్యూకోడెర్మా అంటారు. చర్మం వెలుపల పొరల్లో ఉండే మెలనోసైట్ కణజాలాలు విడుదల చేసే ‘మెలనిన్’ అనే ప్రత్యేక పదార్థం, టైరోసినేజ్ అనే ఎంజైమ్ వల్ల సరైన మోతాదులో విడుదల అవుతుంది. బొల్లి వ్యాధిలో ఈ ఎంజైమ్ అనేక కారణాల వల్ల క్షీణిస్తుంది. ఫలితంగా మెలనిన్ విడుదలకు అంతరాయం ఏర్పడి, చర్మం రంగును కోల్పోతుంటుంది. ఈ టైరోసినేజ్ అనే ఎంజైమ్ తగ్గుదలకు ఈ కింది పరిస్థితులు కారణం కావచ్చు.

**కారణాలు:** ● దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి ● కొన్నిసార్లు కాలిన గాయాలు ● పోషకాహారలోపం ● జన్యుపరమైన కారణాలు ● దీర్ఘకాలిక గ్యాస్ట్రిక్ సమస్యలు ● మందులు, రసాయనాలు ● కొన్ని ఎండోక్రైన్ గ్రంథులు స్రవించే హార్మోన్‌లలో లోపాలు ● వ్యాధి నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) తగ్గడం లేదా మన సొంత వ్యాధి నిరోధక కణాలు మనపైనే దాడి చేయడం వంటి అంశాలు బొల్లి వ్యాధి వచ్చేందుకు కొన్ని కారణాలు.

**లక్షణాలు:** మొదట చిన్న చిన్న మచ్చలుగా ఏర్పడి, ఆ తర్వాత శరీరం అంతటా వ్యాపిస్తాయి. చివరకు తెలుపు రంగులోకి మారతాయి. చర్మం పలుచబడినట్లు అవుతుంది. కొన్నిసార్లు ఎండవేడిని తట్టుకోలేరు. జుట్టు రంగుమారడం, రాలిపోవడం, వంటి లక్షణాలు ఉంటాయి. ఈ మచ్చలు ముఖ్యంగా చేతులు, పెదవులు, కాళ్ల మీద రావచ్చు. ఇవి పెరగవచ్చు లేదా అని పరిమాణంలో ఉండిపోవచ్చు.

**చికిత్స:** తెల్లమచ్చలకు హోమియోలో మంచి చికిత్స అందుబాటులో ఉంది. ఇందుకు దీర్ఘకాలిక చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. మానసికంగా, శారీరకంగా రోగిని పూర్తి స్థాయిలో అవగాహన చేసుకున్న తర్వాత వ్యాధికి అవసరమైన కాన్‌స్టిట్యూషనల్ మెడిసిన్‌ను ఇస్తారు. తూజా, నైట్రిక్ యాసిడ్, నేట్రమ్మ్యూరియాటికమ్, ఆర్సెనికమ్ ఆల్బమ్, లాపిస్ అల్బా, రస్టాక్స్ వంటి మందులతో తెల్లమచ్చలకు సమర్థంగా చికిత్సను అందించవచ్చు.



**డాక్టర్ టి.కిరణ్‌కుమార్,**
డైరెక్టర్,
పాజిటివ్ హోమియోపతి,
విజయవాడ, వైజాగ్

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

గురువారం 4-7-2019



మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com


**హైస్కూల్, ఇంటర్మీడియెట్ విద్యార్థులూ.. మీకు సైన్స్, మ్యాథమెటిక్స్ పట్ల ఆసక్తి ఉందా? సునిశిత పరిశీలన, విశ్లేషణలు మీ సొంతమా?! అయితే.. మీకు సరైన మార్గం.. ఒలింపియాడ్స్! వివిధ స్థాయిల్లో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరీక్షించి.. అంతర్జాతీయ వేదికలపై వెలుగులీనేందుకు ఒలింపియాడ్స్ దోహదపడుతున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో.. ఒలింపియాడ్స్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానాలు..**



# ఒలింపియాడ్స్

- ఆరు సబ్జెక్టుల్లో ప్రతి ఏటా దేశవ్యాప్తంగా ఒలింపియాడ్స్
- స్కూల్ స్థాయి నుంచే ప్రతిభను వెలుగులోకి తెచ్చే మార్గం
- సైన్స్, మ్యాథ్స్‌లో కెరీర్ దిశగా విద్యార్థులకు ప్రోత్సాహం
- నోడల్ సెంటర్‌గా హోమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్
- ఒలింపియాడ్స్ విజేతలకు అనేక ప్రయోజనాలు

**స్కూ**ల్ స్థాయి విద్యార్థుల్లో దాగున్న మ్యాథ్స్, సైన్స్ నైపుణ్యాల్ని, సునిశిత పరిశీలనను, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను వెలుగులోకి తెచ్చేందుకు నిర్వహించేవే.. ఒలింపియాడ్స్! రాష్ట్ర స్థాయి నుంచి పలు దశల్లో జరిగే ఎంపిక ప్రక్రియలో విజయంసాధిస్తే.. అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. పరిశోధనల్లో మేటి సంస్థ హోమీబాబా రీసెర్చ్ సెంటర్ ఒలింపియాడ్‌కు నోడల్ సెంటర్‌గా వ్యవహరిస్తోంది.

### ఒలింపియాడ్స్.. ఐదు దశలు

ప్రస్తుతం ఒలింపియాడ్స్‌ను ఆరు సబ్జెక్టు(మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఆస్ట్రానమీ, జూనియర్ సైన్స్)ల్లో నిర్వహిస్తున్నారు. తొలి దశగా పేర్కొనే నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ నుంచి తుది దశ అయిన అంతర్జాతీయ ఒలింపియాడ్ వరకు మొత్తం అయిదు దశలు ఉంటాయి. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్దేశిత కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో ఒలింపియాడ్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం నుంచి ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి గరిష్ఠంగా 300 మందిని జాతీయ స్థాయిలో నిర్వహించే ఒలింపియాడ్స్‌కు ఎంపిక చేస్తారు.

### దశల వివరాలు

- **తొలిదశ:** నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్-ఎన్ఎస్ఈ(రీజనల్ ఒలింపియాడ్)లో ఉత్తీర్ణత. రెండు లక్షల నుంచి ఆరు లక్షల మంది విద్యార్థులు పాల్గొంటారు. ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి.
- **రెండోదశ:** ఎన్ఎస్ఈలో ఉత్తీర్ణత సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత ఆధారంగా తర్వాత దశకు 300 నుంచి 500 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. థియరిటికల్ ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, దీర్ఘ ప్రశ్నలు ఉంటాయి.
- **మూడోదశ:** నేషనల్ ఒలింపియాడ్‌లో అత్యున్నత ప్రతిభ చూపిన వారికి ముంబైలోని హోమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్‌లో.. ఓరియెంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్(ఓసీఎస్‌సీ) నిర్వహిస్తారు. నేషనల్ ఒలింపియాడ్ విజేతల్లోని 35 నుంచి 50 మందికి ఈ అవకాశం దక్కుతుంది. హోమీబాబా రీసెర్చ్ సెంటర్‌లో థియరీ తరగతులు, ప్రాక్టికల్ శిక్షణ ఉంటుంది.
- **నాలుగోదశ:** ఓసీఎస్‌సీలో అత్యున్నత ప్రతిభ చూపిన విద్యార్థులకు అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో రాణించేందుకు శిక్షణనిచ్చే దశ ఇది. ఓసీఎస్‌సీలో ప్రతిభ ఆధారంగా గరిష్ఠంగా ఆరుగురు విద్యార్థులకు ప్రీడిపార్చర్ క్యాంప్ పేరుతో శిక్షణనిస్తారు.
- **అయిదోదశ:** ఒలింపియాడ్స్‌లో తుది దశ.. అంతర్జాతీయ వేదికపై ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్‌లో ప్రతిభ చాటేందుకు సువర్ణావకాశం అయిదో దశ. ప్రీ డిపార్చర్ క్యాంప్‌లో పొందిన శిక్షణ ఆధారంగా.. ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇందులో విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందిస్తారు.

## పరీక్ష విధానాలు


రీజనల్, నేషనల్ ఒలింపియాడ్స్ పరీక్షల తీరుతెన్నులు...

### ఎన్ఎస్ఈ (రీజనల్ ఒలింపియాడ్స్)

ఆస్ట్రానమీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్ట్‌లకు సంబంధించి.. ఒలింపియాడ్స్ ప్రక్రియలో తొలిదశగా భావించే నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామ్(రీజనల్ ఒలింపియాడ్)ను 80 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

### నేషనల్ ఒలింపియాడ్స్

- ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఆస్ట్రానమీల్లో నేషనల్ ఒలింపియాడ్స్ విభిన్నంగా జరుగుతుంది.



- ఫిజిక్స్.. ఆరు ప్రాబ్లమ్స్ ఇచ్చి పరిష్కరించమంటారు. గరిష్ఠంగా 75 మార్కులకు నిర్వహించే ఈ పరీక్ష.. డిస్క్రిప్టివ్ విధానంలోనే ఉంటుంది. ప్రతి ప్రశ్నకు క్లిష్టత స్థాయి ఆధారంగా మార్కులు నిర్ణయిస్తారు. ప్రశ్నలు అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, అప్లికేషన్ ఓరియెంటేషన్, క్రిటికల్ థింకింగ్ వంటి నైపుణ్యాలను పరీక్షించేవిగా ఉంటాయి.
- కెమిస్ట్రీలో..అయిదు ప్రశ్నలు అడుగుతారు. గరిష్ఠ మార్కుల విధానం ఏటా వేర్వేరుగా ఉంటుంది.
- బయాలజీ నేషనల్ ఒలింపియాడ్..ఆబ్జెక్టివ్ విధానంలో రెండు విభాగాలుగా(సెక్షన్-ఎ,బి)గా ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. పాయింట్ల విధానంలో మూల్యాంకన జరుగుతుంది.
- ఆస్ట్రానమీ పరీక్ష(ఒలింపియాడ్)కు సంబంధించి 2018-19 సంవత్సరానికిగాను విద్యార్థులను గ్రూప్-ఎ, గ్రూప్-బిగా వర్గీకరించారు. ఈ ప్రక్రియను నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్‌లో ప్రతిభ ఆధారంగా చేపడతారు. ఎన్ఎస్ఈలో పొందిన మార్కుల ఆధారంగా.. తర్వాత దశలో నిర్వహించే ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్‌లో ప్రతి గ్రూప్ నుంచి 250 మందికి అవకాశం ఇస్తారు. ప్రశ్నల తీరుతెన్నులు ఎన్ఎస్ఈ మాదిరిగానే ఉంటుంది.

### ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్

సైన్స్ ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్‌లో విజేతలను నిర్ణయించే ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉంటుంది. నాలుగైదు గంటల వ్యవధిలో అభ్యర్థులకు థియరీ, ప్రాక్టికల్ ఆధారిత సమస్యలు ఇస్తారు. వీటిని నిర్ణీత సమయంలో పరిష్కరించిన వారిని విజేతలుగా ప్రకటిస్తారు.

**సైన్స్ ఒలింపియాడ్స్‌కు అర్హత:** 10+2/ఇంటర్మీడియెట్ స్థాయి చదువు పూర్తిచేసి ఉండకూడదు.

### ఒలింపియాడ్స్... ముఖ్యాంశాలు

- ముందుగా రీజనల్ ఒలింపియాడ్స్‌లో భాగంగా నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామ్స్ నిర్వహణ. వీటిని రాష్ట్రాల స్థాయిలో అన్ని జిల్లాల్లోనూ నిర్వహిస్తారు.
- ఎన్ఎస్ఈలో ఉత్తీర్ణత సాధించిన వారిలో 300 నుంచి 500 మందిని జాతీయ స్థాయి ఒలింపియాడ్స్‌కు ఎంపిక చేస్తారు.
- జాతీయ స్థాయి ఒలింపియాడ్స్‌లో ప్రతిభ కనబర్చిన టాప్ 30-35 విద్యార్థులకు హోమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్‌లో ఓరియెంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్ పేరుతో శిక్షణనిస్తారు.
- ఈ శిక్షణలో మెరిట్ జాబితాలో టాప్ 5లో నిలిచిన అభ్యర్థులను అంతర్జాతీయ ఒలింపియాడ్‌కు ఎంపిక చేస్తారు.
- తొలిదశ రీజనల్ ఒలింపియాడ్స్‌లో భాగంగా నిర్వహించే నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామ్‌కు విద్యార్థులు తమ స్కూల్ ద్వారా లేదా నేరుగా నమోదు చేసుకోవచ్చు.

**వివరాలకు వెబ్‌సైట్**
https://olympiads.hbcse.tifr.res.in

### మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్

మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ ప్రక్రియ సైతం సైన్స్ ఒలింపియాడ్‌ను పోలి ఉంటుంది. మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌ను హోమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీకి చెందిన నేషనల్ బోర్డ్ ఫర్ హయ్యర్ మ్యాథమెటిక్స్ తరపున ఈ పరీక్షను జరుపుతుంది. మొత్తం ఆరు దశల్లో మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ ఉంటుంది.

- మొదటి దశలో... అభ్యర్థులు ప్రీ రీజనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ పరీక్షను మూడు గంటల వ్యవధిలో నిర్వహిస్తారు. మెరిట్ ఆధారంగా 300 మంది విద్యార్థులను తర్వాత దశలో జరిగే ఆర్ఎంఓకు ఎంపిక చేస్తారు.
- ఆర్ఎంఓలో మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులు (గరిష్ఠంగా 30) మూడో దశ ఇండియన్ నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ (ఐఎన్ఎంఓ)ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ పరీక్షను నాలుగు గంటల వ్యవధిలో నిర్వహిస్తారు. అభ్యర్థులు కనీసం ఆరు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.
- ఐఎన్ఎంఓలో చూపిన ప్రతిభ ఆధారంగా.. మెరిట్ జాబితా రూపొందించి 30 నుంచి 35 మంది విద్యార్థులను ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌కు ఎంపికచేస్తారు. ఈ సమయంలో అత్యున్నత ప్రతిభ చూపిన ఐదుగురిని ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌కు పంపిస్తారు.
- ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ పరీక్షను రెండు దశల్లో...రెండు రోజులపాటు నిర్వహిస్తారు. ఈ పరీక్షలు నాలుగున్నర గంటల వ్యవధిలో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటాయి.

### అర్హతలు

8, 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు మొదటి దశ పీఆర్ఎంఓకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

**వివరాలకు వెబ్‌సైట్**
https://olympiads.hbcse.tifr.res.in

### జూనియర్ సైన్స్ ఒలింపియాడ్

పదోతరగతి, ఇంటర్ విద్యార్థులతోపాటు ప్రాథమికోన్నత తరగతులు (ఆరు నుంచి పది వరకు) చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ నిర్వహిస్తున్నారు. దీనికోసం మొదటగా విద్యార్థులు నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామ్ జూనియర్ సైన్స్ రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్షను 80 ప్రశ్నలతో 240 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. పరీక్షలో టాప్-300 అభ్యర్థులను ఇండియన్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన 30 మంది అభ్యర్థులకు.. హోమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్ నిర్వహిస్తారు. శిక్షణలో టాప్-5లో నిలిచిన విద్యార్థులను ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌కు ఎంపిక చేస్తారు.

### ప్రయోజనాలు ఇవిగో

- కేవైపీవై స్కాలర్‌షిప్ ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది.
- మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలిస్తే..చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్‌లో బీఎస్సీ మ్యాథ్స్ ఆనర్స్‌లో నేరుగా ప్రవేశం పొందొచ్చు.
- ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో బీఎస్సీ మ్యాథ్స్, బ్యాచిలర్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది.
- విజేతలకు నగదు బహుమతులు లభిస్తాయి.

---

# పల్లె బ్యాంకుల్లో.. కొలువుల సందడి

**ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)ల్లో వేర్వేరు స్థాయిల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే ఉమ్మడి నియామక ప్రక్రియకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆఫీస్ అసిస్టెంట్, స్కేల్1 ఆఫీసర్, సీనియర్ మేనేజర్ లెవల్ పోస్టులైన స్కేల్ 2,3 ఉద్యోగాల భర్తీని ఐబీపీఎస్ చేపడుతోంది. బ్యాంకింగ్ రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ నోటిఫికేషన్ చక్కటి అవకాశం. సొంత ప్రాంతంలో పనిచేసే అవకాశంతోపాటు, ఆకర్షణీయమైన వేతనాలు అందుకునే వీలుంది. తాజాగా ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ-2019 నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో.. ఆయా పోస్టుల భర్తీ ప్రక్రియ, ప్రిపరేషన్ గైడెన్స్...**




**దరఖాస్తులకు చివరి తేది: జూలై 4**
**రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ**
**బ్యాంకింగ్ రంగంలో కెరీర్‌కు చక్కటి మార్గం**
**ఎంపికైతే నెలకు రూ.36,500లకు పైగా వేతనం**

### ఖాళీల వివరాలు

- మొత్తం పోస్టుల సంఖ్య: 8,401
- ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్): 3688
ఏపీ: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు: 130;
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు: 93;
సప్తగిరి గ్రామీణ బ్యాంకు: 50.
తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు: 89; తెలంగాణ గ్రామీణ బ్యాంకు: 115
- **ఆఫీసర్ స్కేల్ -1 (అసిస్టెంట్ మేనేజర్)-3382;**
**ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు: 100;**
**సప్తగిరి గ్రామీణ బ్యాంకు: 60**
**తెలంగాణ:**
**ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు: 100;**
**తెలంగాణ గ్రామీణ బ్యాంకు: 20**
- **ఆఫీసర్ స్కేల్- 2**
**(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్లు)-893;**
**ఆఫీసర్ స్కేల్-2 (అగ్రికల్చర్ ఆఫీసర్: 106;**
**మార్కెటింగ్ ఆఫీసర్: 45;**
**ట్రెజరీ మేనేజర్: 11; లా ఆఫీసర్: 19;**
**సీఏ: 24; ఐటీ ఆఫీసర్: 76);**
**ఆఫీసర్ స్కేల్- 3 (సీనియర్ మేనేజర్)-157.**

### అర్హతలు

- మల్టీపర్పస్, స్కేల్ 1(అసిస్టెంట్ మేనేజర్), ఆఫీసర్ స్కేల్ 2(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్లు), సీనియర్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే రాష్ట్ర స్థానిక భాషతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం.
- స్కేల్1, జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హజ్బెండరీ, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, పిసికల్చర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, లా, ఎకనామిక్స్, అకౌంటెన్సీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్ పోస్టులకు.. బ్యాంకింగ్/ఫైనాన్షియల్ రంగంలో రెండేళ్ల అనుభవం; సీనియర్ మేనేజర్ పోస్టులకు అయిదేళ్ల అనుభవం ఉండాలి. స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాలకు పోస్టును అనుసరించి ఆయా విభాగాల్లో డిగ్రీ/పీజీ విద్యార్హతతోపాటు సంబంధిత రంగంలో ఏడాది/రెండేళ్ల అనుభవం తప్పనిసరి.

### వయసు

- ఆయా పోస్టులను బట్టి 2019 జూన్ 1 నాటికి 18-40 ఏళ్ల వారు అర్హులు.
- మల్టీపర్పస్ అసిస్టెంట్, స్కేల్1 ఆఫీసర్ పోస్టులకు ఎలాంటి పని అనుభవం అవసరం లేదు. మల్టీపర్పస్ పోస్టులకు 18-28 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 30 ఏళ్లు. ఎస్సీ,ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీహెచ్‌సీలకు పదేళ్ల వయోపరిమితిలో సడలింపు ఉంది.

### ఎంపిక

- ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్-1 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ విధానంలో ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలు ఉంటాయి. అసిస్టెంట్స్ పోస్టులను మెయిన్స్‌లో సాధించే స్కోర్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఆఫీసర్ స్కేల్-1 పోస్టులకు మెయిన్స్, మౌఖిక పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. స్కేల్-2, 3 ఆఫీసర్ పోస్టులను ఆన్‌లైన్ పరీక్ష, మౌఖిక పరీక్షల ద్వారా భర్తీ చేస్తారు.
- ఆన్‌లైన్ విధానంలో ప్రిలిమినరీ పరీక్ష(45 నిమిషాలు) 80 మార్కులకు ఉంటుంది.
- మల్టీపర్పస్ పోస్టులకు రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ విభాగాల నుంచి 40 చొప్పున ప్రశ్నలు అడుగుతారు.
- ఆఫీసర్ స్కేల్-1 పోస్టులకు రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి 40 చొప్పున ప్రశ్నలు ఉంటాయి.
- ప్రశ్నల క్లిష్టత స్థాయిలో మార్పులు ఉంటాయి. సెక్షనల్ కటాఫ్,రుణాత్మక మార్కుల విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు కోత విధిస్తారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధిస్తేనే మెయిన్ రాసేందుకు అనుమతి లభిస్తుంది.
- మెయిన్ పరీక్ష 200 ప్రశ్నలకు 200 మార్కులకు జరుగుతుంది. ఇందులో రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్, కంప్యూటర్ నాలెడ్జ్ తదితర అంశాలు ఉంటాయి.

### వేతనాలు ఆకర్షణీయం

- ఆర్ఆర్‌బీ ఉద్యోగులకు వేతనాలు ఆకర్షణీయమని చెప్పొచ్చు. పదోన్నతులు కూడా ఆయా బ్యాంకులను బట్టి మారుతూ ఉంటాయి. వీరికి కెరీర్ ప్రారంభంలో బేసిక్, హెచ్ఆర్ఏ, డీఏ, ప్రత్యేక అలవెన్సులు కలుపుకొని నెలకు రూ.36,500లకు పైగానే వేతనం అందుతుంది. అదే స్కేల్-2 జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్‌కు రూ.46వేలకు పైగా జీతం లభిస్తుంది. మల్టీపర్పస్ స్టాఫ్‌కు రూ.23 వేల వరకు ఉంటుంది. వీరు పనిచేసే ప్రాంతం, బ్యాంక్ ఆధారంగా వేతనాల్లో కొంత మేర వ్యత్యాసాలు ఉండొచ్చు. వేతనాలతోపాటు ట్రావెలింగ్ అలవెన్సులు, పెట్రోల్, డీజిల్ అలవెన్సులు, మెడికల్ అలవెన్సులు, ఇన్సూరెన్సు సౌకర్యం ఉంటుంది.

### ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 2019 జూలై 4
- **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీలు:** ఆఫీసర్ స్కేల్-1కు 2019 ఆగస్టు 3, 4, 11 తేదీల్లో; ఆఫీస్ అసిస్టెంట్లకు-ఆగస్టు 17, 18, 25 తేదీల్లో
- **ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష తేదీలు:** ఆఫీసర్స్ పోస్టులకు సెప్టెంబర్ 22, ఆఫీసర్ అసిస్టెంట్ పోస్టులకు సెప్టెంబర్ 29న నిర్వహిస్తారు.
- ఇంటర్వ్యూలు నవంబర్‌లో ఉంటాయి.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600,
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.100. ఒక పోస్టు కంటే ఎక్కువ దరఖాస్తు చేసుకుంటే వేర్వేరుగా అప్లికేషన్ ఫీజులు చెల్లించాలి.
- **వెబ్‌సైట్: www.ibps.in**

## ప్రిపరేషన్.. పక్కాగా

**అ**సిస్టెంట్, స్కేల్-1 ఆఫీసర్ ఉద్యోగాలకు ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ పడతారు. వీరు ప్రిలిమ్స్, మెయిన్‌లో కామన్‌గా ఉండే రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ సెక్షన్లకు సన్నద్ధమవ్వాలి. స్కేల్-1 స్థాయిలో సన్నద్ధమైతే అసిస్టెంట్ పరీక్షకు కూడా ఉపయోగపడుతుంది.

### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

- న్యూమరికల్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగంలో స్కోరు చేయాలంటే.. బేసిక్స్‌పై పట్టు ఎంతో ముఖ్యం. బ్యాంకింగ్ పరీక్షల్లో తక్కువ సమయంలో ఎక్కువ కచ్చితత్వంతో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు మల్టిప్లికేషన్ టేబుల్స్ కంఠస్థం చేయాలి. కూడికలు, తీసివేతలు, బాగాహారాలు, గుణకారాలు మొదలైన ప్రాథమిక అంశాలు వేగంగా చేయగలిగేలా సన్నద్ధమవ్వాలి. వర్గాలు, వర్గమూలాలు, ఘనమూలాలకు షార్ట్‌కట్స్ నేర్చుకోవాలి.
- నిష్పత్తులు, శాతాలు, సగటు వంటి కీలక టాపిక్స్‌ను అవగాహన చేసుకోవాలి. వీటిపై పట్టు సాధిస్తే కటాఫ్ మార్కులు పొందడం సులువు. ఓవరాల్ కటాఫ్ మార్కులు సాధించడానికి క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలి.
- పరీక్షల్లో అడుగుతున్న ప్రశ్నలు గమనిస్తే కొన్ని చాప్టర్లకు ప్రాధాన్యత ఎక్కువగా కనిపిస్తోంది. సింప్లిఫికేషన్/అప్రాక్షిమేషన్ ప్రాబ్లమ్స్ తప్పనిసరిగా కనిపిస్తున్నాయి. వీటిని తక్కువ సమయంలో సాధించవచ్చు. కాబట్టి అభ్యర్థులు వీటిపై ముందుగా దృష్టిపెట్టాలి. ఇక తప్పనిసరిగా ఉండే మరో విభాగం.. నంబర్ సిరీస్. ఇందులో స్కోరు చేసేందుకు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ప్రాక్టీస్ చేస్తేనే నంబర్లపై పట్టు లభిస్తుంది. క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ ప్రధానమైన టాపిక్. దీన్నుంచి తప్పనిసరిగా ప్రిలిమ్స్, మెయిన్స్‌లో 5 ప్రశ్నలు వస్తాయి. ఎక్కువ వెయిటేజీ ఉన్న మరో విభాగం.. డేటా ఇంటర్‌ప్రిటేషన్. నిష్పత్తులు, శాతాలు, సగటు అధ్యాయాల్లో నైపుణ్యం ఉంటే డేటా ఇంటర్‌ప్రిటేషన్ ప్రశ్నలకు తక్కువ సమయంలో సమాధానాలు రాబట్టవచ్చు.
- అర్థమెటిక్ అంశాల్లో.. పార్ట్‌నర్‌షిప్స్, పర్సంటేజెస్ దాని అనువర్తనాలు; రేషియో అండ్ ప్రపోర్షన్, టైమ్ అండ్ వర్క్, సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, యావరేజెస్ చాప్టర్లు ముఖ్యమైనవి. గత కొన్ని నోటిఫికేషన్ల నుంచి బ్యాంకింగ్ పరీక్షల్లో ప్రశ్నల క్లిష్టత ఎక్కువగా ఉంటోంది. కాబట్టి అభ్యర్థులు క్లిష్టత స్థాయి ఎక్కువగా ఉన్న ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. అదేవిధంగా పరీక్షకు కేటాయించే సమయం చాలా తక్కువగా ఉంటోంది. ప్రశ్నలకు సమాధానాలు సాధించేందుకు ఎక్కువ సమయం పడుతోంది. కాబట్టి ఇప్పటి నుంచే అర్థమెటిక్ మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలి. దీనివల్ల సమయ పాలన అలవడుతుంది. వీలైనన్నీ మాక్ టెస్టులు రాయడం ఉపకరిస్తుంది.

### రీజనింగ్

- అభ్యర్థుల లాజికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విభాగం.. రీజనింగ్. ఈ విభాగం నుంచి అడిగే ప్రశ్నలు ట్రిక్కీగా ఉంటాయి. టాపిక్స్ వారిగా ఏయే అంశాల నుంచి ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయో తెలుసుకొని తదనుగుణంగా సన్నద్ధమవ్వాలి. రీజనింగ్‌లో ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా... సమయం వృథా అవుతుంది. అలాగే కఠినంగా ఉండే ప్రశ్నలను వదిలేసి చివర్లో సాధించే ప్రయత్నం చేయాలి.
- కోడెడ్ఇన్ఈక్వాలిటీస్/ఇన్‌పుట్ ఔట్‌పుట్; సిలాయిజమ్స్/కోడింగ్ అండ్ డీకోడింగ్, సీటింగ్ అరెంజ్‌మెంట్స్ అండ్ పజిల్స్(సర్కులర్, లీనియర్ అరెంజ్‌మెంట్స్, ఫ్లోర్ టెస్ట్స్) సెక్షన్ల నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతారు. అలాగే బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్ అండ్ డిస్టెన్స్, ఆర్డరింగ్ అండ్ ర్యాంకింగ్, క్రిటికల్ రీజనింగ్ సెక్షన్లకు ఎక్కువ వెయిటేజీ ఉంటుంది.
- రీజనింగ్‌లో కొన్ని చాప్టర్లకు ఎక్కువ సమయం అవసరం ఉండదు. ఇలాంటి వాటిని గుర్తించి వాటికి మొదట సమాధానాలు గుర్తిస్తే, కఠినంగా ఉన్న ప్రశ్నలకు ఎక్కువ సమయం కేటాయించవచ్చు. కోడెడ్ ఇన్ఈక్వాలిటీస్, సిలాయిజమ్స్, డైరెక్షన్స్ అండ్ డిస్టెన్స్ కొంత సులువుగా ఉండే విభాగాలని చెప్పొచ్చు. కొన్ని ప్రశ్నల కాఠిన్యత మధ్యస్తంగా ఉంటుంది. ఇలాంటి ప్రశ్నలకు వెయిటేజీ ఎక్కువ. కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, ఆర్డరింగ్ అండ్ ర్యాంకింగ్ ఈ కోవకు చెందినవి. ఈ టాపిక్స్ నుంచి వచ్చే ప్రశ్నలు సాధించడానికి ఎక్కువగా ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది.
- సర్క్యులర్ సీటింగ్ అరేంజ్‌మెంట్, లీనియర్ సీటింగ్ అరేంజ్‌మెంట్, డబుల్ లైనప్ అండ్ పజిల్స్ విభాగాలు రీజనింగ్‌లో ఎక్కువ కాఠిన్యత ఉండేవిగా చెప్పవచ్చు. ఈ ప్రశ్నలను చివర్లో సాధించడం మేలు. మాక్‌టెస్టులు తుది పరీక్షగా భావించి రాయాలి. మాక్‌టెస్టులు రాసేటప్పుడు అనుసరించే వ్యూహాన్నే మెయిన్ పరీక్షకు అనుసరించాలి. గత పేపర్ల సాధన సన్నద్ధతకు ఉపయోగపడుతుంది.

### ఇంగ్లిష్

- మెయిన్‌లో మాత్రమే కనిపించే సబ్జెక్ట్.. ఇంగ్లిష్. గ్రామీణ నేపథ్యం ఉన్న అభ్యర్థులు, తెలుగు మీడియం అభ్యర్థులు కొంత ఆందోళన చెందే విభాగం ఇది. కానీ ఇందులో సాధించే స్కోరే తుది ఎంపికలో కీలకంగా మారుతుంది. వొకాబ్యులరీ, గ్రామర్‌పై పట్టు ఉంటే మాత్రం మంచి స్కోరు చేయవచ్చు. రీడింగ్ కాంప్రహెన్షన్, క్లోజ్ టెస్ట్, పారా జంబుల్/సెంటెన్స్ జంబుల్/ఆడ్ మన్ ఔట్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, ఎర్రర్ స్పాటింగ్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. గ్రామర్‌పై పట్టు సాధించాక సాధ్యమైనన్నీ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. ఇప్పటికే నేర్చుకున్న వొకాబ్యులరీని పునశ్చరణ చేసుకోవాలి.
- ఎకానమీకి సంబంధించిన టెర్మినాలజీ నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. రీడింగ్ కాంప్రహెన్షన్‌లో వొకాబ్యులరీ ఆధారిత ప్రశ్నలకు మొదట సమాధానాలు గుర్తించాలి. ఇవి కాసింత సులువుగా ఉంటాయి. ఇచ్చిన ప్యాసేజీ ఆధారంగా సందర్భానుసారంగా సమాధానాలు రాబట్టడం తేలికగా ఉంటుంది. బ్యాంక్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు నిత్యం ఇంగ్లిష్ పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలి.

### జనరల్ అవేర్‌నెస్

- సులువుగా, వేగంగా చేయగలిగే సెక్షన్ ఇది. మెయిన్‌లో మాత్రమే ఉంది. తాజా పరిణామాలపై పట్టు ఉంటేనే జనరల్ అవేర్‌నెస్‌లో స్కోరు చేసే వీలుంటుంది. ప్రధానంగా బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో తాజా పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఈ విభాగంలోని మొత్తం 40 ప్రశ్నల్లో.. స్టాండర్డ్ జీకే నుంచి 5 ప్రశ్నలు, బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 10, కరెంట్ అఫైర్స్ నుంచి 25 ప్రశ్నలు వస్తున్నాయి.
- వివిధ దేశాల కరెన్సీలు, రాజధానులు, నేషనల్ పార్కులు, ముఖ్య తేదీలు, పోర్టులు, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు,న్యూక్లియర్ పవర్‌ప్లాంట్స్, నదులు, రిజర్వాయర్లు.. అవి ఉన్న ప్రదేశాలు, నృత్యాలు,భాషలు,ప్రముఖబ్యాంకులు - ప్రధాన కార్యాలయాలు, అంతర్జాతీయ సంస్థలు - అవి ఉన్న ప్రదేశాలు,స్పోర్ట్స్-కప్స్, స్పోర్ట్స్-ప్లేయర్స్, స్టేడియాలు-ప్రాంతాలు నేర్చుకోవాలి.
- బ్యాంకింగ్ అవేర్‌నెస్‌కు సంబంధించి మానిటరీ పాలసీ, ఎన్‌పీఏలు, ఎంసీఎల్ఆర్, డిజిటల్ పేమెంట్స్, బ్యాంకులు-వాటి యాప్స్, జీఎస్టీ, ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టెన్సీ కోడ్ తదితర వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి.

కరెంట్ అఫైర్స్‌లో ప్రభుత్వ విధానాలు, ఆర్‌బీఐ అండ్ బ్యాంకింగ్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్య అంశాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ,డిఫెన్స్ టెక్నాలజీ, మిలిటరీ ఎక్సర్‌సైజెస్,సదస్సులు, అవార్డులు, నియామకాలు, అంబాసిడర్లు, బుక్స్-ఆథర్స్, ఇండెక్స్, కమిటీలు, వార్తల్లో వ్యక్తులు, స్పోర్ట్స్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

### కంప్యూటర్ నాలెడ్జ్

కొద్దిపాటి ప్రిపరేషన్‌తో మంచి మార్కులు సాధించేందుకు అవకాశమున్న విభాగం ఇది. కంప్యూటర్ పనితీరుపై ప్రాథమిక ప్రశ్నలు ఉంటాయి. కంప్యూటర్, ఆపరేటింగ్ సిస్టమ్స్, నెట్‌వర్క్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షార్ట్ కట్స్/అబ్రివేషన్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎంఎస్ ఆఫీస్ టూల్స్ గురించి తెలుసుకోవాలి.

సాక్షి బిజినెస్
గురువారం 4-7-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 23 ▲ | 39,839 |
| నిఫ్టీ | 6 ▲ | 11,917 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,170 | ▲ 61 |
| డోజోన్స్ | 26,966 | ▲ 180 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,609 | ▲ 50 |
| డాక్స్ | 12,616 | ▲ 89 |
| షాంఘై | 3,015 | ▼ 29 |
| నికాయ్ | 21,638 | ▼ 116 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | థామస్‌కుక్ | 67.35 | 70.96 |
| £ | బ్రిటన్ పౌండ్ | థామస్‌కుక్ | 85.18 | 88.31 |
| € | యూరో | థామస్‌కుక్ | 76.01 | 80.46 |
| ¥ | జపాన్ ఎన్ (100) | థామస్‌కుక్ | 62.79 | 65.23 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | థామస్‌కుక్ | 47.17 | 49.35 |
| SS | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 49.92 | 51.73 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.65 | 19.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.07 | 19.58 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.39 | 10.75 |

# బిర్లా గ్రూప్ మూలపురుషుడు ఇకలేరు!



- పారిశ్రామిక కురువృద్ధుడు బీకే బిర్లా కన్నుమూత
- నేడు కోల్‌కతాలో అంత్యక్రియలు

ముంబై: బీకే బిర్లాగా అంతా పిలిచే బసంత్ కుమార్ బిర్లా ఇకలేరు. బిర్లా గ్రూప్ వ్యవస్థాపకుడైన బీకే బిర్లా బుధవారం ముంబైలో కన్నుమూశారు. ఆయన వయస్సు 98 సంవత్సరాలు. భారత పారిశ్రామిక రంగానికి పునాదులు వేసిన దిగ్గజాల్లో ఒకరిగా పేర్కొనే బిర్లా గత కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తన 15వ సంవత్సరం నుంచీ ఆయన వ్యాపార కార్యకలాపాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. సెంచురీ టెక్స్‌టైల్స్ అండ్ ఇండస్ట్రీస్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు. కేశోరామ్ ఇండస్ట్రీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించినప్పటి నుంచీ వ్యాపార పరంగా తన ప్రత్యేకతలను కనబరుస్తూ వచ్చారు.

**పారిశ్రామికవేత్తలుగా కుమార్తెలు...**

బీకే బిర్లా కుమార్తెలు మంజుశ్రీ ఖైతాన్ కేశోరామ్ ఇండస్ట్రీస్‌ను నిర్వహిస్తుండగా, జయశ్రీ మెహతా జయశ్రీ టీ అండ్ ఇండస్ట్రీస్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. బీకే బిర్లా భార్య సరళా బిర్లా 2015లో తుదిశ్వాస విడిచారు. 1995లో ఆయన ఏకైక కుమారుడు ఆదిత్య విక్రమ్ బిర్లా కన్నుమూశారు. కాగా కోల్‌కతాలో గురువారం బీకే బిర్లా అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ వర్గాలు తెలియజేశాయి. వైద్య సేవల నిమిత్తం బీకే బిర్లాను ఆయన మనవడు కుమారమంగళం బిర్లా ముంబైకి తీసుకువచ్చారు.

**మరికొన్ని ముఖ్యాంశాలు ఇవీ...**

- దాతృత్వానికి మారుపేరుగా ఉన్న ఘనశ్యామ్ దాస్ బిర్లా చిన్న కుమారుడు బీకే బిర్లా. ఆయన 1921 జనవరి 12న జన్మించారు.
- 15వ సంవత్సరం నాటికే బీకే బిర్లా పలు కంపెనీల్లో క్రియాశీల బాధ్యతలను చేపట్టారు. కేశోరామ్ ఇండస్ట్రీస్ చైర్మన్‌గా ఆ సంస్థను ఉన్నత స్థాయిలో నిలబెట్టారు.
- పత్తి, విస్కోస్, పాలిస్టర్, నైలాన్ దారాలు, రిఫ్రాక్టరీ, పేపర్, షిప్పింగ్, టైర్ కార్డ్, ట్రాన్స్‌పరెంట్ పేపర్, స్పన్‌పైప్, సిమెంట్, టీ, కాఫీ, రసాయనాలు, ప్లైవుడ్, ఎండీఎఫ్ బోర్డ్ వంటి పలు రంగాలపై ఆయన దృష్టి పెట్టారు.
- ప్రస్తుతం బీకే బిర్లా గ్రూప్‌లో కేశోరామ్ ఇండస్ట్రీస్‌తో పాటు సెంచరీ టెక్స్‌టైల్స్, సెంచరీ యెంకా, జయశ్రీ టీ అండ్ ఇండస్ట్రీస్ ఉన్నాయి.
- కృష్ణార్పణ్ చారిటీ ట్రస్ట్ చైర్మన్‌గా కూడా బీకే బిర్లా పనిచేశారు. రాజస్తాన్‌లోని పిలానీలో బీకే బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ పేరుతో ఒక ఇంజనీరింగ్ కళాశాలను ఈ ట్రస్ట్ నిర్వహిస్తోంది. దేశ వ్యాప్తంగా 25 విద్యా సంస్థల నిర్వహణలోనూ ట్రస్ట్ ప్రధాన భూమికను నిర్వహిస్తోంది.

## మైండ్‌ట్రీ పగ్గాలు ఇక ఎల్ అండ్ టీ చేతికి

### 60.06 శాతం వాటా కైవసం

న్యూఢిల్లీ: బెంగళూరుకు చెందిన ఐటీ సంస్థ, మైండ్‌ట్రీ ప్రమోటర్‌గా మౌలిక రంగ దిగ్గజం ఎల్ అండ్ టీ అవతరించింది. తమ కంపెనీలో 60.06 శాతం మార్కెట్ వాటాతో ప్రమోటర్‌గా ఎల్ అండ్ టీ మారిందని మైండ్‌ట్రీ తెలిపింది. ఇప్పుడు తమ కంపెనీపై యాజమాన్య నియంత్రణ ఎల్ అండ్ టీదేనని వివరించింది. ఇటీవలి ఓపెన్ ఆఫర్‌లో నలంద ఇండియా ఫండ్, నలంద ఇండియా ఈక్విటీ ఫండ్‌లు తమ వాటాలో సింహభాగాన్ని ఎల్ అండ్ టీకి విక్రయించాయని పేర్కొంది. మైండ్‌ట్రీలో ఈ రెండు సంస్థలకు 10.60 శాతం వాటా ఉందని,



దీంట్లో 8.90 శాతం వాటాను ఓపెన్ ఆఫర్‌లో ఈ సంస్థలు ఎల్ అండ్ టీ కి విక్రయించాయని, ప్రస్తుతం ఈ రెండు సంస్థలకు 1.71 శాతం వాటా మాత్రమే ఉందని వివరించాయి. కాగా జూన్ 28న ముగిసిన ఓపెన్ ఆఫర్‌లో తమకు షేర్లను విక్రయించిన వాటాదారులకు చెల్లింపులు జరిపామని ఎల్ అండ్ టీ తెలిపింది. భారత ఐటీ రంగంలో తొలి బలవంతపు టేకోవర్‌గా మైండ్‌ట్రీ టేకోవర్ నిలిచింది.

## 'వివో జెడ్1ప్రో' స్మార్ట్‌ఫోన్ సిరీస్ విడుదల

- ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయాలు
- ధరల శ్రేణి రూ. 14,990–17,990



న్యూఢిల్లీ: చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివో.. 'జెడ్1ప్రో' సిరీస్ స్మార్ట్‌ఫోన్లను బుధవారం ఆవిష్కరించింది. వీటి ధరల శ్రేణి రూ.14,990–17,990 కాగా, జూలై 11 నుంచి ఇవి ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులోకి రానున్నాయి. '70,000 రిటైల్ అవుట్‌లెట్లతో ఇక్కడి మార్కెట్లో వివోకు బలమైన మార్కెటింగ్ వ్యవస్థ ఉంది. మార్కెట్ వాటాను రెట్టింపు చేయడంలో భాగంగా నూతన సిరీస్‌ను ఆన్‌లైన్ ద్వారా విక్రయించాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా జెడ్1ప్రో ఫ్లిప్‌కార్ట్‌లో లభ్యంకానుంది' అని సంస్థ ఇండియా డైరెక్టర్ (బ్రాండ్ స్ట్రాటజీ) నిపున్ మరియా తెలిపారు.

# విద్యుత్ పంపిణీ ప్రైవేటుకు?

- మరిన్ని పీఎస్‌యూల్లో వాటాల ఉపసంహరణ
- 200 బొగ్గు, బాక్సైట్, కాపర్ గనుల వేలం
- ప్రధానితో సమావేశంలో ఆర్థికవేత్తల సూచనలు
- వీటిపై చర్యలకు మంత్రిత్వ శాఖలకు సిఫారసు



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు ఆర్థికవేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలు చేసిన సూచనలకు కదలిక వచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ గత నెల 22న వివిధ రంగాలకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్తలతో పాటు పారిశ్రామిక దిగ్గజాలైన టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, ఐటీసీ సీఎండీ సంజీవ్‌పురి, వేదాంత రిసోర్సెస్ వ్యవస్థాపకుడు అనిల్ అగర్వాల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా... విద్యుత్ సరఫరాను (డిస్ట్రిబ్యూషన్) ప్రైవేటీకరించాలని, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ), ఎన్‌ఎండీసీ సహా పలు ప్రభుత్వరంగ సంస్థల్లో (పీఎస్‌యూలు) పెట్టుబడులను ఉపసంహరించుకోవాలన్న సూచనలు వారి నుంచి వచ్చాయి. ఈ సూచనలపై తదుపరి చర్యలకు ఆయా మంత్రిత్వ శాఖలకు ప్రధాని కార్యాలయం సిఫారసు చేసినట్టు తాజాగా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలో ఉపాధి కల్పన, వృద్ధి రేటు పెంచడం, జీడీపీని 2024 నాటికి రెట్టింపు చేయడం లక్ష్యంగా 'ఎకనమిక్ పాలసీ: రోడ్ ఎహెడ్'పై నిపుణుల అభిప్రాయాలు, ఆలోచనలను ప్రధాని తెలుసుకునే ప్రయత్నం చేశారు.

**కీలక సూచనలు ఇవీ..**

- బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో సమస్యలకు కారణాలను గుర్తించి, రుణ వితరణను పెంచాలన్న సూచన ఎన్.చంద్రశేఖరన్ నుంచి రాగా, దీనిపై చర్యలకు ఆర్థిక సేవల విభాగానికి పంపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరించాలన్న ఆయన సూచనను పరిశీలించాలని విద్యుత్ శాఖను కోరినట్టు చెప్పాయి. ఎలక్ట్రిక్ వాహనాల అమలు వేగవంతం చేసే విషయంలో చంద్రశేఖరన్ సూచనలను నీతి ఆయోగ్, భారీ పరిశ్రమల శాఖలు పరిశీలించనున్నట్టు తెలిపాయి.
- వేదాంత రీసోర్సెస్ చైర్మన్ అనిల్ అగర్వాల్ 400 బిలియన్ డాలర్ల దిగుమతుల బిల్లు తగ్గించేందుకు... ప్రభుత్వ రంగ సంస్థలైన హిందుస్తాన్ కాపర్, కోలార్ గోల్డ్, యురేనియం కార్పొరేషన్, ఎస్‌సీఐ, ఎన్‌ఎండీసీల్లో ప్రభుత్వ వాటాలను ఉపసంహరించుకోవాలని సూచించారు. వీటిని పెట్టుబడులు, ప్రజా ఆస్తుల విభాగం (దీపమ్) పరిశీలించనుంది.
- అలాగే, ప్రభుత్వరంగ కంపెనీలు, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో సర్కారు తన వాటాను 50 శాతానికి పరిమితం చేసుకోవాలని, వాటిని బోర్డుల ఆధ్వర్యంలో స్వతంత్రంగా నడిచేలా చూడాలన్న అగర్వాల్ సూచనను కూడా దీపమ్ పరిశీలనకు పంపారు. దిగుమతులు తగ్గించుకునేందుకు వెంటనే 200 బొగ్గు, బాక్సైట్, కాపర్, ఐరన్‌ఓర్ బ్లాకులను వేలం వేయాలన్న అగర్వాల్ సూచనను ప్రధాని కార్యాలయం బొగ్గు, మైనింగ్ శాఖలకు నివేదించింది. జల సంరక్షణ కోసం జాతీయ స్థాయిలో వాటర్ అండ్ ఇరిగేషన్ అథారిటీని ఏర్పాటు చేయాలన్న సంజీవ్‌పురి సూచనను కూడా వ్యవసాయ శాఖ పరిశీలనకు పంపారు.

## జీఎస్‌టీ తేడాలను వార్షిక రిటర్నుల్లో చెప్పాల్సిందే

### కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: జీఎస్‌టీకి సంబంధించి నెలవారీ అమ్మకాల రిటర్ను ఫారం, విక్రయ గణాంకాలకు మధ్య వ్యత్యాసాలు ఉన్న పక్షంలో వార్షికంగా దాఖలు చేసే ఫారంలో కచ్చితంగా వెల్లడించాల్సిందేనని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. కట్టాల్సిన పన్ను బకాయిలను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. సాధారణంగా జీఎస్‌టీఆర్–1 కింద విక్రయ వివరాలు, జీఎస్‌టీఆర్–3బీ కింద అన్ని లావాదేవీలు, చెల్లింపుల వివరాలను సమగ్రంగా దాఖలు చేయాల్సి ఉంటోంది. అయితే, వార్షిక రిటర్ను దాఖలు చేసేటప్పుడు ఈ రెండింటిలో దేన్ని ప్రాతిపదికగా తీసుకోవాల్సి ఉంటుందన్న పరిశ్రమ వర్గాల సందేహాలను నివృత్తి చేస్తూ ఆర్థిక శాఖ తాజా వివరణనిచ్చింది. జీఎస్‌టీఆర్–1, జీఎస్‌టీఆర్–3బీ, ఖాతాలన్నింట్లో గణాంకాలు సరిపోలాలని పేర్కొంది. ఒకవేళ తేడాలొస్తే.. పన్ను కట్టకపోవడమో లేదా అధిక పన్ను చెల్లింపులు జరిపినట్లో భావించాల్సి వస్తుందని తెలిపింది.




## మార్కెట్లోకి 'ఎల్‌జీ' సీలింగ్ ఫ్యాన్లు

ప్రారంభ ధర రూ.13,990 • వై–ఫైతో నియంత్రించగలిగిన టెక్నాలజీ





చెన్నై: దక్షిణ కొరియాకు చెందిన కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీ.. 'సీలింగ్ ఫ్యాన్' విభాగంలోకి ప్రవేశించింది. తొలుత చెన్నైలో విక్రయాలను ప్రారంభించింది. ప్రీమియం శ్రేణిలో మొత్తం ఐదు ఫ్యాన్లను ఇక్కడ విడుదల చేయగా.. వీటి ప్రారంభ ధర రూ.13,990గా నిర్ణయించినట్లు కంపెనీ వెల్లడించింది. త్వరలోనే వీటిని దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. గ్రేటర్ నోయిడాలోని ఎల్‌జీ ఇండియా ప్లాంట్‌లో వీటిని ఉత్పత్తి చేస్తోంది. వై– ఫై ఆధారంగా పనిచేసే ఈ ఫ్యాన్లలో అమెజాన్ అలెక్సా, గూగుల్ అసిస్టెంట్ అనుకూల సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్నట్లు తెలియజేసింది. ఎల్‌జీ స్మార్ట్ థింక్ టెక్నాలజీ ఉన్నందువల్ల మొబైల్ ఫోన్‌ల ద్వారా ఫ్యాన్‌ను నియంత్రించవచ్చని పేర్కొంది. ఈ సందర్భంగా సంస్థ ప్రొఫెషనల్ ఆర్ఏసీ ఎయిర్‌కేర్ (ఓవర్సీస్ సేల్స్ – మార్కెటింగ్) సెజూన్ పార్క్ మాట్లాడుతూ.. 'భారత వాతావరణానికి తగిన విధంగా ఈ ఫ్యాన్లను రూపొందించాం. వినియోగదారుల నుంచి వీటిపట్ల సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు.

**ఆర్ఓ వాటర్ ప్యూరిఫయర్లు విడుదల**

గృహోపకరణాలు, ఎయిర్ సొల్యూషన్స్ విభాగంలో తన ఉనికిని బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా.. ఈ ఏడాది ఆగస్టు నాటికి మినీ ఎయిర్ ప్యూరిఫయర్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ ప్రకటించింది. స్టెయిన్ లెస్ స్టీల్ స్టోరేజ్ ట్యాంక్ కలిగిన ఏడు ఆర్ఓ వాటర్ ప్యూరిఫయర్ మోడళ్లను ప్రవేశపెట్టినట్లు తెలిపింది.

# ఐపీఓ నిధులు.. నాలుగేళ్ల కనిష్టానికి

- ఈ ఏడాది తగ్గిన ఐపీఓల జోరు
- తొలి ఆరు నెలల్లో 8 ఐపీఓలు
- రూ.5,509 కోట్లు సమీకరణ
- ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి




**తొలి ఆరు నెలల్లో ఐపీఓ నిధుల సమీకరణ**

| సంవత్సరం | ఐపీఓల సంఖ్య | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019 | 8 | 5,509 |
| 2018 | 18 | 23,452 |
| 2017 | 13 | 11,774 |
| 2016 | 12 | 8,183 |
| 2015 | 8 | 3,849 |

ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)ల జోరు ఈ ఏడాది తొలి అర్ధభాగంలో అంతంతమాత్రంగానే ఉంది. ఈ ఏడాది జనవరి–జూన్ కాలానికి 8 కంపెనీలు(ఇటీవలే ముగిసిన ఇండియామార్ట్‌ను కూడా కలిపితే) రూ.5,509 కోట్లు సమీకరించాయి. ప్రతి ఏడాది తొలి ఆరునెలల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి. 2015లో కూడా ఇదే కాలంలో 8 కంపెనీలు రూ.3,849 కోట్లు మాత్రమే సమీకరించాయి. ఇక గత ఏడాది తొలి ఆరు నెలల కాలంలో మొత్తం 18 కంపెనీలు రూ.23,452 కోట్ల మేర నిధులు సమీకరించాయి.

**సెంటిమెంట్ బలహీనం...**

మార్కెట్ సెంటిమెంట్ అంతంతమాత్రంగానే ఉండటంతో ఐపీఓల జోరు పెద్దగా లేదని నిపుణులంటున్నారు. మిడ్‌–క్యాప్, స్మాల్–క్యాప్ సెగ్మెంట్లు చాలా బలహీనంగా ఉన్నాయి. ఎన్నికల కారణంగా అనిశ్చితి చోటు చేసుకోవడం, ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉండటంతో పలు కంపెనీలు ఐపీఓలకు దూరంగా ఉన్నాయి. రాజకీయ అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు కొత్త కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడానికి ఆసక్తి చూపరనే ఉద్దేశంతో కంపెనీలు కూడా ఐపీఓలపై ఆసక్తి చూపలేదు. మరీ ముఖ్యంగా వినియోగ రంగంలో మందగమనం చోటు చేసుకోవడం కూడా తీవ్ర ప్రభావమే చూపించింది. నరేంద్ర మోదీ భారీ మెజారిటీతో మళ్లీ కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడంతో ఈ నెల 4న సెన్సెక్స్ జీవిత కాల గరిష్ట స్థాయి, 40,312ను తాకింది. అప్పటి నుంచి చూస్తే, సెన్సెక్స్ 2 శాతం పతనమైంది. మరోవైపు ఈ ఏడాది జనవరిలోనే బీఎస్ఈ మిడ్–క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు తమ తమ జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. అప్పటి నుంచి చూస్తే, జూన్‌లో ఈ సూచీలు 20–30% పతనమయ్యాయి. ముడి చమురు ధరల్లో తీవ్ర ఒడిదుడుకులు, అమెరికా–చైనాల మధ్య వాణిజ్య యుద్ధం, తాజాగా ఇరాన్‌తో ఉద్రిక్తతలు.. ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి.

**జూలై నుంచి జోరుగా...**

ఈ ఏడాది రెండో అర్ధభాగంలో ఐపీఓల జోరు పెరుగుతుందని నిపుణులంటున్నారు. కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం నెలకొనడంతో సంస్కరణలు కొనసాగుతాయనే అంచనాలు బలపడ్డాయి. మరోవైపు ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. వృద్ధి జోరును పెంచే చర్యలు బడ్జెట్‌లో ఉండే అవకాశాలు అధికంగా ఉంటాయని, ఫలితంగా ఐపీఓల జోరు పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా ఈ ఏడాది ఇప్పటిదాకా 56 కంపెనీలు ఐపీఓల కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ నుంచి ఆమోదాలు పొందాయి. ఈ కంపెనీలన్నీ కలిసి రూ.54,000 కోట్ల మేర నిధులు సమీకరించనున్నాయి. మరోవైపు ఏడు కంపెనీలు ఐపీఓ ఆమోదాల కోసం సెబీకి దరఖాస్తు చేశాయి. ఈ కంపెనీలు రూ.13,300 కోట్లు సమీకరించనున్నాయి.

# ఎవరి రూటు వారిదే!!

2019-20 బడ్జెట్ రేపే

- సరళీకరణ తర్వాత కాలాన్ని బట్టి మారుతున్న కేంద్ర బడ్జెట్లు
- సంక్షేమంపైనే కాంగ్రెస్ ఫోకస్
- ఎన్డీయే పాలనలో పన్ను సంస్కరణలపై దృష్టి...

దేశంలో ఆర్థిక సరళీకరణ మొదలైన తర్వాత కాలంతో పాటు బడ్జెట్ లక్ష్యాలు కూడా మారిపోతున్నాయి. 1990వ దశకం నుంచి ఇప్పటి వరకు చూస్తే అప్పటి ప్రభుత్వ ప్రాధమ్యాలు ఏ విధంగా ఉన్నాయనేది అర్థం చేసుకోవచ్చు. 1991 నుంచి బడ్జెట్‌లను గమనిస్తే.. 90వ దశకంలో ఆర్థిక సంస్కరణలకు పెద్ద పీట వేయగా, ఆ తర్వాత 2000 నుంచి 2010 మధ్య కాలంలో ద్రవ్య స్థిరీకరణకు ప్రాధాన్యమిచ్చారు. ఇక 2010 తర్వాత బడ్జెట్లు సామాజిక కార్యక్రమాలపై ఎక్కువగా ఖర్చు చేసేలా దృష్టిపెట్టాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలు పేదల సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టగా, ఎన్డీయే ప్రభుత్వాలు పన్నుల సంస్కరణలకు పెద్దపీట వేశాయి.

### మన్మోహన్... ఆర్థిక వ్యవస్థకు తలుపులు బార్లా!




➤ 1991– 92 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ వాణిజ్య విధాన సంస్కరణల్లో నూతన దిశను చూపించారు. పరిమాణ పరిమితుల నుంచి ధరల ఆధారిత యంత్రాంగానికి మారే దిశగా అడుగులు వేశారు. విధానాల పరంగా స్వేచ్ఛనివ్వడంతోపాటు, ప్రాధాన్య రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) 51 శాతానికి మన్మోహన్ సింగ్ పెంచేశారు. వడ్డీ రేట్ల విధానాన్ని కూడా సరళతరం చేశారు. ఇదిగో... ఇప్పటి నుంచే బడ్జెట్లలో ఆర్థిక రంగ పాత్ర విస్తృతమవుతూ వచ్చింది. మ్యూచువల్ ఫండ్స్ అభివృద్ధికి ప్రోత్సాహం, ప్రైవేటు రంగానికి ద్వారాలు తెరవడం జరిగింది.

### చిదంబరం... సంస్థాగత నిర్మాణం



➤ 1997–98లో నాటి ఆర్థిక మంత్రి పి.చిదంబరం సంస్థాగత నిర్మాణం, నియంత్రణపరమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమైన నియంత్రణపరమైన కార్యాచరణ ఏర్పాటే లక్ష్యంగా ముందుకెళ్లారు. ఫలితం... సంస్థాగతంగా మార్పుల్లేకుండా నియంత్రణలతో కూడిన ఆర్థిక వ్యవస్థ కాస్తా క్రమబద్ధీకరణ ఆర్థిక వ్యవస్థగా మారింది. విదేశీ మారక నిర్వహణ చట్టం, నూతన కంపెనీల బిల్లు, నూతన ప్రత్యక్ష పెట్టుబడుల బిల్లుకు చిదంబరం చోటిచ్చారు.


### సిన్హా... మౌలికానికి పెద్దపీట



➤ 1998–99లో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన యశ్వంత్ సిన్హా స్వేచ్ఛగానే వ్యవహరించారు. పట్టణాలు, నగరాల్లోని మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా ఆయన చర్యలను చేపట్టారు. అనుమతులు పొందిన హౌసింగ్ ప్రాజెక్టులకు మొదటి ఐదేళ్లపాటు లాభాలపై నూరు శాతం పన్ను మినహాయింపు కల్పించారు. ఆ తర్వాత ఐదేళ్లకూ 30 శాతం రాయితీ కల్పించారు.

➤ 2001–02 బడ్జెట్‌లో యశ్వంత్‌సిన్హా ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ రెగ్యులేషన్స్‌ను ప్రవేశపెట్టారు. దీని వల్ల భాగస్వామ్య కంపెనీల మధ్య లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించడం తప్పనిసరిగా మారింది. పన్ను ఎగవేతల నిరోధం విషయంలో ఈ నియంత్రణ ఎంతో ముఖ్య పాత్ర పోషించిందనే చెప్పుకోవాలి.

### ప్రణబ్ ముఖర్జీ... సంక్షేమ బాట



➤ ఇక 2005 నాటి బడ్జెట్‌లో (యూపీఏ–1లో) పి.చిదంబరం పేద ప్రజలే ఫోకస్‌గా ముందుకొచ్చారు. అంతక్రితం ఐదేళ్లలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే పాలన, భారత్ వెలిగిపోతోందంటూ వారు చేసుకున్న ప్రచారం బెడిసి కొట్టి ఓటమిపాలవడంతో, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీఏ సర్కారు సామాన్యులపై దృష్టి పెట్టింది. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాలు అమల్లోకి వచ్చాయి. ఇక యూపీఏ–2లో చివర్లో ఆర్థిక మంత్రిగా పగ్గాలు చేపట్టిన ప్రణబ్ ముఖర్జీ కూడా సంక్షేమానికే సై అన్నారు.

### అరుణ్ జైట్లీ... పన్ను సంస్కరణలకు సై



➤ 2014– 2018 మధ్యలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో అరుణ్ జైట్లీ కీలక సంస్కరణలతోపాటు ఇతర చర్యలూ చేపట్టారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులకు, డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియాకు నిధులు అందించారు. జీఎస్‌టీ సంస్కరణను తీసుకొచ్చారు. మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం తగ్గించారు. 2015లో వెల్త్ ట్యాక్స్‌ను (సంపద పన్ను) రద్దు చేసి, రూ.కోటి ఆదాయం దాటిన వారిపై 2% అదనపు సర్‌చార్జ్ తీసుకొచ్చారు. 2017లో రూ.2.5–5 లక్షల మధ్య పన్ను వర్తించే ఆదాయం వారికి పన్ను రేటు 10% నుంచి 5%కి తగ్గించారు. దీంతో పన్ను చెల్లింపుదారులకు రూ.12,500 ఆదా అయింది.

## ఫండ్ల మదుపరులు చిన్న వ్యాపారులే!

- మా ఖాతాదారుల్లో 60–70% వారే
- మహీంద్రా ఎంఎఫ్ ఎండీ అశుతోష్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మ్యూచువల్ ఫండ్ల(ఎంఎఫ్)లో పెట్టుబడికి చిన్న వ్యాపారులే ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నట్లు మహీంద్రా మ్యూచువల్ ఫండ్ ఎండీ అశుతోష్ బిష్ణోయ్ తెలియజేశారు. తమ కస్టమర్లలో వీరి సంఖ్య ఎంత కాదన్నా 60– 70 శాతం ఉంటుందని చెప్పారు. మహీంద్రా హైబ్రిడ్ ఈక్విటీ నివేష్ యోజన పథకాన్ని బుధవారమిక్కడ పరిచయం చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే తొమ్మిది పథకాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఏటా మూడు నాలుగు ఉత్పత్తులను పరిచయం చేస్తున్నట్లు వెల్లడించారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే క్లయింట్ ఖాతాలు 26 శాతం వృద్ధితో 2018–19లో 1.59 లక్షలు దాటాయన్నారు.



కెనడా పెట్టుబడి సంస్థ మాన్యు లైఫ్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్‌లో 49 శాతం వాటాను సుమారు రూ.240 కోట్లకు కొనుగోలు చేస్తోంది. ఆరు నెలల్లో ఈ డీల్ పూర్తి అవుతుందని అశుతోష్ పేర్కొన్నారు. కాగా, ఓపెన్ ఎండెడ్ హైబ్రిడ్ ఈక్విటీ నివేష్ యోజన ఫండ్ ఆఫర్ జూలై 12న ముగియనుంది. అధిక వృద్ధికి ఆస్కారం ఉన్న కంపెనీల్లో ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. దీర్ఘకాలిక పెట్టుబడి లక్ష్యాలున్నవారికి ఇది ఉపయుక్తంగా ఉంటుందని కంపెనీ తెలిపింది.

# స్వల్ప లాభాలతో సరి




- నేడు ఆర్థిక సర్వే
- రేపు కేంద్ర బడ్జెట్
- ఈ రెండింటి కారణంగా ఇన్వెస్టర్ల అప్రమత్తత
- 23 పాయింట్ల లాభంతో 39,839కు సెన్సెక్స్
- 6 పాయింట్లు పెరిగి 11,917కు నిఫ్టీ

ఆద్యంతం లాభ, నష్టాల మధ్య దోబూచులాడిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో గట్టెక్కింది. మార్కెట్ భవిష్యత్తు గమనాన్ని నిర్దేశించే బడ్జెట్ మరో రెండు రోజుల్లో రానుండటం, మరో రోజులో ఆర్థిక సర్వే వెల్లడి కానుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. సేవల రంగం దాదాపు ఏడాది తర్వాత క్షీణించడం ఒకింత ప్రతికూల ప్రభావం చూపించింది. మొత్తం మీద సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా మూడో రోజూ లాభాల్లోనే ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 23 పాయింట్లు లాభపడి 39,839 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 6 పాయింట్లు పెరిగి 11,917 పాయింట్ల వద్ద ముగిశాయి.

**ఒడిదుడుకులు తప్పవు....**

రెండు రోజుల్లో బడ్జెట్ రానుండటంతో మార్కెట్లో ఒడిదుడుకులు చోటు చేసుకుంటాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్ వినోద్ నాయర్ చెప్పారు. అధిక వేల్యూయేషన్ల నేపథ్యంలో లాభాల స్వీకరణ జరిగే అవకాశాలూ ఉన్నాయని ఆయన అంచనా వేశారు. మౌలిక రంగానికి ఊపునిచ్చేలా బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రతిపాదనల ఉండొచ్చనే అంచనాలున్నాయని, అందుకే మార్కెట్లో ఒకింత సానుకూల వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. బుధవారం మొత్తం సెన్సెక్స్, నిఫ్టీలు లాభనష్టాల మధ్య ఊగిసలాడాయి. ఒక దశలో 84 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ మరో దశలో 119 పాయింట్లు లాభపడింది. మొత్తం మీద రోజంతా 203 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

**ఆసియా డౌన్.. యూరప్ అప్...**

అమెరికా– చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం చర్చలు మళ్లీ ఆరంభమవుతాయనే ఆశలు నెలకొన్న నేపథ్యంలో యూరప్ దిగుమతులపై సుంకాలు విధించాలని అమెరికా యోచిస్తుండటం.. ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించింది. ప్రధాన ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. కాగా యూరప్ కేంద్ర బ్యాంక్ అధ్యక్షురాలిగా అంతర్జాతీయ ద్రవ్యనిధి చీఫ్ క్రిస్టినా లగార్డే నామినేషన్ దాదాపు ఖరారు కావడంతో యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. డీహెచ్ఎఫ్ఎల్ షేర్ 10 శాతం లాభంతో రూ.83 వద్ద ముగిసింది. రూ. 12,000 కోట్ల తాజా రుణాలు లభించే అవకాశాలు దీనికి కారణం.

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 1,772 |
| ఎన్ఎస్ఈ | 27,873 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 9,80,052 |
| ఎఫ్ఐఐ | -390 |
| డీఐఐ | 280 |

- 170కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. గ్లాక్సోస్మిత్‌లైన్ ఫార్మా, సెంట్రమ్ క్యాపిటల్, లక్ష్మీ మెషీన్ వర్క్స్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, ఫెడరల్ బ్యాంక్, అదానీ పవర్ తదితర 40 షేర్లు తాజా ఏడాది గరిష్ట స్థాయిలను తాకాయి.

## నిఫ్టీ 50

**టాప్ 10 గెయినర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| IBULHSGFIN | 690.6 | 7.5 |
| INDUSINDBK | 1,473.00 | 3.99 |
| ITC | 277.2 | 1.22 |
| ZEEL | 360.65 | 1.19 |
| GRASIM | 930 | 1.11 |
| IOC | 156.4 | 1.1 |
| LT | 1,578.50 | 0.94 |
| BRITANNIA | 2,793.10 | 0.86 |
| POWERGRID | 208.75 | 0.68 |
| JSWSTEEL | 278 | 0.67 |

**టాప్ 10 లూజర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| EICHERMOT | 19,585.55 | -2.74 |
| GAIL | 305.4 | -1.91 |
| TECHM | 701.4 | -1.44 |
| VEDL | 172.25 | -1.37 |
| DRREDDY | 2,592.80 | -1.33 |
| INFY | 731.7 | -1.12 |
| HCLTECH | 1,048.25 | -1.11 |
| YESBANK | 99.8 | -0.99 |
| TCS | 2,234.00 | -0.8 |
| UPL | 651 | -0.78 |


### కల్పతరు ఎస్‌పీవీల్లో వాటా విక్రయం - మూడింట్లో కొనుగోలు చేసిన సీఎల్‌పీ ఇండియా

కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్ (కేపీటీఎల్) కంపెనీ తన మూడు ఎస్‌పీవీల్లో (స్పెషల్ పర్పస్ వెహికల్) వాటాలను సీఎల్‌పీ ఇండియాకు విక్రయించనుంది. ఈ మేరకు కెనడా సంస్థాగత ఫండ్ మేనేజర్ సీడీపీక్యూకు చెందిన సీఎల్‌పీ ఇండియాతో నిశ్చయాత్మక ఒప్పందాలు కుదుర్చుకున్నామని కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్ తెలియజేసింది. ఈ డీల్ విలువ రూ.3,275 కోట్లు. కల్పతరు సాత్పుర ట్రాన్స్‌కో, అలిపుర్దార్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్, కోహిమా మారియాని ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్... ఈ మూడు ఎస్‌పీవీల్లో వాటాను సీఎల్‌పీ ఇండియాకు విక్రయించనున్నట్లు కల్పతరు తెలియజేసింది.''ఈ వాటా విక్రయం కారణంగా కేపీటీఎల్ రుణభారం తగ్గుతుంది. దాంతో మా ప్రధాన వ్యాపారంలో వ్యూహాత్మక వైవిధ్యీకరణపై దృష్టి పెడతాం'' అని కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్ ఎండీ, సీఈఓ మనీశ్ మోహనత్ తెలియజేశారు.

### జియో డిజిటల్ అక్షరాస్యత ఉద్యమం

**న్యూఢిల్లీ:** తొలిసారి ఇంటర్‌నెట్ వినియోగించేవారి కోసం డిజిటల్ అక్షరాస్యత ఉద్యమాన్ని ప్రారంభించినట్లు రిలయన్స్ జియో బుధవారం ప్రకటించింది. 'డిజిటల్ ఉడాన్' పేరుతో ప్రతి శనివారం ఇంటర్‌నెట్ వాడకంపై అవగాహనా కార్యక్రమాలను చేపట్టనుంది. తొలుత 13 రాష్ట్రాల్లో 200 వేర్వేరు ప్రాంతాల్లో వీటిని ప్రారంభించి.. 7,000 ప్రాంతాలకు చేరుకోనున్నట్లు తెలిపింది. సరళమైన, సురక్షితమైన మార్గాల్లో జియో ఫోన్, ఫేస్‌బుక్ వినియోగించి స్నేహితులు, కుటుంబ సభ్యులతో సంభాషించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఇటువంటి ఉద్యమాల ద్వారా వంద శాతం డిజిటల్ అక్షరాస్యత సాధించడమే లక్ష్యమని రిలయన్స్ జియో డైరెక్టర్ ఆకాష్ అంబానీ అన్నారు.

### 25 కోట్ల డాలర్ల వేదాంత పెట్టుబడులు



**న్యూఢిల్లీ:** వేదాంత కంపెనీ రానున్న 3–4 ఏళ్లలో 24.5 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నది. ఇటీవలి లైసెన్సింగ్ రౌండ్‌లో తాము గెల్చుకున్న పది ప్రాంతాల్లో చమురు, సహజ వాయువు అన్వేషణ కోసం ఈ పెట్టుబడులను వినియోగిస్తామని వేదాంత తెలిపింది. ఓపెన్ యాక్రేజ్ లైసెన్సింగ్ పాలసీ(ఓఏఎల్‌పీ) రౌండ్–టు, రౌండ్–త్రీ లో భాగంగా వేదాంత కంపెనీకి 10 బ్లాక్‌లు లభించాయి. వీటిల్లో 7 ఆన్‌షోర్ కాగా, 3 ఆఫ్‌షోర్ ఉన్నాయి.

### ద్రవ్య లభ్యత పెంచాలని ఆటో పరిశ్రమ విన్నపం

**న్యూఢిల్లీ:** ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య లభ్యతను పెంచడం ద్వారా ఆటో పరిశ్రమను ఆదుకోవాలని భారత వాహన తయారీదార్ల సంఘం (సియామ్) ప్రభుత్వాన్ని కోరింది. గణనీయంగా తగ్గిపోయిన వాహన అమ్మకాలను నిలబెట్టాలని ప్రభుత్వాన్ని విన్నవించింది. విక్రయాలు మళ్లీ గాడిన పడాలంటే.. వ్యవస్థలో లిక్విడిటీ పెరగాలని, ముఖ్యంగా బ్యాంకింగేతర సంస్థల్లో ద్రవ్య లభ్యత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ రంగం దాదాపు అన్ని రకాల వాహనాలకు ఫైనాన్స్ చేస్తోంది. ఇందువల్లే 60–70% వాహనాలు అమ్ముడుపోతున్నాయి. అటువంటిది ఎన్‌బీఎఫ్‌సీ రంగమే కష్టాల్లో పడడం వల్ల ఆటో రంగం ఇబ్బందులను ఎదుర్కొంటోందని వివరించింది.

## బిజినెస్ @ పార్లమెంట్

### బీఎస్ఎన్ఎల్ నష్టాలు రూ. 14,202 కోట్లు..





గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ నష్టాలు రూ. 14,202 కోట్ల స్థాయిలో ఉంటాయని అంచనా వేస్తున్నట్లు కేంద్ర టెలికం మంత్రి రవిశంకర్ ప్రసాద్ లోక్‌సభకు తెలిపారు. 2015–16లో రూ. 4,859 కోట్లు, 2016–17లో రూ. 4,793 కోట్లు, 2017–18లో రూ. 7,993 కోట్ల మేర నష్టాలు నమోదయ్యాయి. మొబైల్ విభాగంలో తీవ్ర పోటీ వల్ల టారిఫ్‌లు తగ్గడం, సిబ్బందిపై అధిక వ్యయాలు, చాలా చోట్ల 4జీ సర్వీసులు లేకపోవడం వంటి అంశాలు బీఎస్ఎన్ఎల్ నష్టాలకు కారణమని మంత్రి వివరించారు. మరోవైపు, చైనా టెలికం సంస్థ హువావేకి అమెరికన్ తయారీ పరికరాలను సరఫరా చేసే భారతీయ సంస్థలు, అమెరికా చట్టాల కింద చర్యలు ఎదుర్కొనాల్సి రావొచ్చని ఆయన తెలిపారు. హువావేపై అమెరికా తదితర దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.

### ఏవియేషన్‌కు 4 సవాళ్లు ..



దేశీ విమానయాన రంగం ప్రస్తుతం ప్రధానంగా నాలుగు సవాళ్లు ఎదుర్కొంటోందని పౌర విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి రాజ్యసభకు తెలిపారు. మౌలిక సదుపాయాల కొరత, భారీ నిర్వహణ వ్యయాలు, పోటీ కారణంగా తక్కువ రాబడులు, కరెన్సీ మారకం తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతుండటం వీటిలో ఉన్నాయని వివరించారు. అటు, భారీ రుణభారంతో కుంగుతున్న ప్రభుత్వ రంగ ఎయిరిండియాలో వాటాల విక్రయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పురి తెలిపారు.

### పెరిగిన వాణిజ్య లోటు..



గడిచిన మూడేళ్లలో 25 ప్రధాన దేశాలతో భారత వాణిజ్య లోటు గణనీయంగా పెరిగినట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి గోయల్ లోక్‌సభకు తెలిపారు. డిమాండ్–సరఫరా, కరెన్సీ హెచ్చుతగ్గులు, రుణ వ్యయాలు, రవాణా వ్యయాలు మొదలైన అంశాలు ఇందుకు కారణమని పేర్కొన్నారు. 25 దేశాల జాబితాలో దక్షిణ కొరియా, జపాన్, జర్మనీ, ఇరాక్, సౌదీ అరేబియా మొదలైనవి ఉన్నాయి. వివిధ దేశాల నుంచి దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసాన్ని వాణిజ్య లోటుగా వ్యవహరిస్తారు.

### బీఎస్ఎన్ఎల్, ఎమ్‌టీఎన్ఎల్‌కు రూ.74,000కోట్ల బెయిలవుట్

**ముంబై:** ప్రభుత్వ రంగ టెలికం సంస్థలైన భారతీ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), మహానగర్ టెలిఫోన్ నిగమ్(ఎమ్‌టీఎన్ఎల్)లకు రూ.74,000 కోట్ల బెయిలవుట్ ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ స్కీమ్‌లో ఎక్సిట్ ప్యాకేజితో పాటు అదనపు ఐదు శాతం పరిహారం, 4జీ స్పెక్ట్రమ్ నిబంధనలు, మూలధన వ్యయం మిళితమై ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం 2019 చివరి నాటికి అధిక రుణాలు కలిగిన ప్రభుత్వ రంగ సంస్థల్లో, రూ.13,804కోట్లతో బీఎస్ఎన్ఎల్ ఇండియా మొదటి స్థానంలో ఉంది. మూడవ స్థానంలో రూ.3,398కోట్లతో ఎమ్‌టీఎన్ఎల్ ఉండగా, రెండవ స్థానంలో ఎయిర్‌ఇండియా ఉంది. ఈ బెయిలవుట్ స్కీమ్‌లో రూ.20,000 కోట్లను 4జీ స్పెక్ట్రమ్ కోసం కేటాయించాలన్నది ప్రతిపాదన.

## సీఐసీల కార్యాచరణ కోసం వర్కింగ్ గ్రూపు

**ఆర్‌బీఐ ప్రకటన**

**ముంబై:** వ్యవస్థాపరంగా ముఖ్యమైన కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీల (సీఐసీ)కు సంబంధించి వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేసినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. సీఐసీలకు సంబంధించి ప్రస్తుతం అనుసరిస్తున్న నియంత్రణ, పర్యవేక్షణ కార్యాచరణను ఈ వర్కింగ్ గ్రూపు సమీక్షించి, సూచనలు చేస్తుందని తెలిపింది. సీఐసీల నియంత్రణ కోసం 2010 ఆగస్ట్‌లో ఆర్‌బీఐ ప్రత్యేక కార్యాచరణను తీసుకొచ్చిన విషయం గమనార్హం. ఇతర ఎన్‌బీఎఫ్‌సీలతో పోలిస్తే సీఐసీ కంపెనీల భిన్నమైన వ్యాపార నమూనాను ఆర్‌బీఐ గుర్తించింది. ''గత కొన్నేళ్లలో కార్పొరేట్ గ్రూపు నిర్మాణం మరింత క్లిష్టంగా, ఎన్నో అంచలతో మారిపోయింది. ప్రజా నిధులతో సంబంధం కలిగి, ఆర్థిక వ్యవస్థతో మరింతగా పెనవేసుకుపోయింది'' అని ఆర్‌బీఐ తన ప్రకటనలో పేర్కొంది. సీఐసీల కార్పొరేట్ గవర్నెన్స్ నిర్మాణాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన ఆరుగురు సభ్యుల వర్కింగ్ గ్రూపునకు తపన్‌రే అధ్యక్షత వహించనున్నారు.



## శిక్షణ, ఆపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కొలువు

**మణిపాల్ గ్లోబల్ అకాడమీతో బ్యాంక్ జట్టు**

**ముంబై:** డిజిటల్ యుగంలో మారుతున్న అవసరాలను అనుగుణంగా నిపుణులైన మానవవనరుల కొరతను తీర్చుకునేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా తాజాగా మణిపాల్ గ్లోబల్ అకాడమీ ఆఫ్ బీఎఫ్ఎస్ఐ భాగస్వామ్యంతో 'ఫ్యూచర్ బ్యాంకర్స్' కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. క్యాంపస్‌లో అధ్యయనం, తర్వాత ఇంటర్న్‌షిప్, విజయవంతంగా పూర్తి చేసిన వారికి బ్యాంకులో పూర్తి స్థాయి ఉద్యోగ అవకాశం దీని ద్వారా లభిస్తుంది. ఆరు నెలల పాటు మణిపాల్ గ్లోబల్ అకాడమీ ఆఫ్ బీఎఫ్ఎస్ఐలో శిక్షణ ఉంటుంది. ఆ తర్వాత ఆరు నెలలు బ్యాంకులో ఇంటర్న్‌షిప్ చేయాలి. విజయవంతంగా పూర్తి చేసిన వారికి 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా సర్టిఫికెట్ ఇన్ సేల్స్ అండ్ రిలేషన్‌షిప్ బ్యాంకింగ్' సర్టిఫికెట్ అందుకుంటారు. వచ్చే 2–3 ఏళ్లలో 5,000 మందిని ఈ విధానం ద్వారా బ్యాంక్‌లో నియమించుకోవాలనుకుంటోంది. ఇలా ఎంపికై ఉద్యోగంలో చేరిన తొలి ఏడాది జీతం రూ.4 లక్షల తోపాటు, ఇతర అలవెన్స్‌లు లభిస్తాయని బ్యాంకు తెలిపింది. ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థూల నియామకాల్లో 68% ఫ్రెషర్స్ ఉంటుండగా.. ఇప్పటివరకు అంతర్గత శిక్షణపైనే ఆధారపడుతూ వచ్చింది.

## ఆభరణాల పరిశ్రమ మరింత పారదర్శకం కావాలి: బ్యాంకర్ల అభిప్రాయం

**ముంబై:** ఆభరణాల పరిశ్రమలో మరింత పారదర్శక పరిస్థితులు నెలకొనాల్సిన అవసరం ఉందని బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. రత్నాలు, ఆభరణాల వ్యాపారాలకు ఫైనాన్స్ చేయడానికి బ్యాంకింగ్ వ్యతిరేకం కాదనీ, అయితే ఈ పరిశ్రమ వ్యవస్థాగతంగా మరింత పటిష్టం కావాలని, ఈ రంగంలో పారదర్శకత నెలకొనాలని, తద్వారా విశ్వసనీయత పెంచుకోవాలని బ్యాంకర్లు కోరుతున్నట్లు రత్నాలు, ఆభరణాలపై ఇక్కడ జరిగిన ఒక సదస్సులో వక్తలు పేర్కొన్నారు. నీరవ్ మోదీ, గీతాంజలి జెమ్స్ వంటి ఘటనలు ఈ పరిశ్రమలో విశ్వాసాన్ని దెబ్బతీసినట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ కేవాల్ పేర్కొన్నారు. పారదర్శకత, పటిష్టత విషయంలో ఫార్మా రంగం నుంచి ఈ పరిశ్రమ నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. రత్నాలు, ఆభరణాల వ్యాపారానికి నిధులు సమకూర్చడం చాలా క్లిష్టతరంగా మారినట్లు ఇండస్ ఇండ్ బ్యాంక్ ఈవీపీ బీజూ పాట్నాయక్ పేర్కొన్నారు.

## జూన్‌లో సేవల రంగం నేలచూపులు

**న్యూఢిల్లీ:** విక్రయాలు మందగించడం, పోటీ పరమైన ఒత్తిళ్లు, అననుకూల పన్ను విధానాలు మొదలైన అంశాలతో దేశీయంగా సేవల రంగ కార్యకలాపాలు జూన్‌లో మందగించాయి. గతేడాది మే తర్వాత ఇలా క్షీణత నమోదు కావడం ఇదే తొలిసారి. ఐహెచ్ఎస్ మార్కిట్ సంస్థ నిర్వహించే సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ సూచీ (పీఎంఐ) జూన్‌లో 49.6గా నమోదైంది. ఇది మేలో 50.2గా ఉంది. పీఎంఐ పరిభాషలో స్కోరు 50 పాయింట్లకు ఎగువన ఉంటే వృద్ధిని, అంతకన్నా తక్కువ ఉంటే క్షీణతను సూచిస్తుంది. మరోవైపు తయారీ, సేవల రంగాల కాంపోజిట్ సూచీ జూన్‌లో 50.8కి తగ్గింది. ఇది దాదాపు ఏడాది కనిష్ట స్థాయి.

## బులియన్ రూ.లలో



| | ధర | మార్పు |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,120 | ▲ 780 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,450 | ▲ 750 |
| వెండి (కిలో) | 40,700 | ▲ 300 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,380 | ▲ 610 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,740 | ▲ 580 |
| వెండి (కిలో) | 40,700 | ▲ 300 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,380 | ▲ 610 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,740 | ▲ 580 |
| వెండి (కిలో) | 40,700 | ▲ 300 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,000 | ▲ 300 |
| బంగారం (22 క్యారెట్లు) | 31,440 | ▲ 190 |
| వెండి (కిలో) | 38,800 | ▲ 300 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,200 | ▲ 670 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,740 | ▲ 620 |
| వెండి (కిలో) | 39,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,400 | ▲ 630 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,740 | ▲ 580 |
| వెండి (కిలో) | 40,700 | ▲ 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 57.03 (రాత్రి 11.30కు) | $56.25 (మంగళవారం ముగింపు) |
| బ్రెంట్ | 63.59 (రాత్రి 11.30కు) | $62.40 (మంగళవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 4-7-2019

| | |
|---|---|
| విశాఖ | 444-00 |
| చిత్తూరు | 463-00 |
| వరంగల్ | 428-00 |
| చెన్నై | 470-00 |
| ముంబై | 480-00 |
